అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 24-10-2024
సంపుటి : 10 | సంచిక : 245 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ప్రభుత్వానికి సీపీఐ(ఎం) డిమాండ్

మ్యానిఫెస్టో అమల్లో జాప్యం వీడాలి

ప్రజాపాలన అంటూనే నిర్బంధమా?

మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల ఇండ్ల తొలగింపు ఆపాలి

అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

రైతు భరోసా తక్షణమే ఇవ్వాలి

రాష్ట్ర కమిటీలో పలు తీర్మానాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య తదితరులు పాల్గొన్న రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించింది. వాటిని మీడియాకు విడుదల చేసింది.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజా సమస్యల పరిష్కారానికి మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలుపర్చడంలో జాప్యం చేస్తున్నదని తెలిపింది. ముఖ్యంగా 49 కేంద్రాల్లో ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించకుండా, పేదల ఇండ్లను పడగొట్టి వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని విమర్శించింది. ఒకవైపు ప్రజాపాలన అంటూనే ప్రజలపై నిర్బంధాన్ని కొనసాగిస్తున్నదని పేర్కొంది. మూసీ పునరుజ్జీవం పేరుతో నదికి ఆనుకుని ఉన్న ఇండ్లను, పునరావాసం చూపకుండానే తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. రివర్‌బెడ్‌లో ఇండ్లు నిర్మాణం చేసుకున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేసింది.

రీజినల్ రింగ్‌రోడ్ (త్రిబుల్‌ఆర్)కు మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్‌నే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు పెంచి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని తెలిపింది. స్కీమ్ వర్కర్లకు, గ్రామపంచాయతీ, మున్సిపల్, మెడికల్, హెల్త్, కాంట్రాక్ట్ కార్మికులకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని పేర్కొంది. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేసింది. కనీసవేతనం నెలకు రు.11 వేలుగా పెట్టిన డ్రాఫ్ట్ ప్రతిపాదనను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరింది. కనీస వేతనం నెలకు రు.26 వేలుగా నిర్ణయించాలని సూచించింది. అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఆశాల ఫిక్స్‌డ్ వేతనం, మధ్యాహ్న భోజనం కోసం కేటాయింపుల పెంపుదల తదితర సమస్యలు పరిష్కరించాలని తెలిపింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, జీపీఎఫ్, జీఎల్‌ఐ, సప్లిమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు, ఉద్యోగ విరమణ పొందినవారికి పెన్షనరీ బెనిఫిట్స్ ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీని అర్హులైనవారందరికీ అమలు చేయాలని సీపీఐ(ఎం) కోరింది. ప్రస్తుతం 42 లక్షల మంది బాకీపడి ఉండగా, 22 లక్షల మందికి రూ.18 వేల కోట్లు మాత్రమే ...11లో



సరిహద్దులో శాంతి, సుస్థిరతను
కాపాడుకుందాం
ఐదేండ్ల తర్వాత బ్రిక్స్ వేదికగా మోడీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు

కజన్: రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై ...10లో

ఓటు అడగటం నాకు
ఇదే తొలిసారి
వాయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకాగాంధీ నామినేషన్

రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గే హాజరు


బహిరంగ వేదికపై తెలంగాణ, కర్నాటక సీఎంలు



వివరాలు 11లో

గోబ్యాక్..అంబుజా

పచ్చటి బతుకుల్లో విషం చిమ్మే ఫ్యాక్టరీ మాకొద్దు..







- అదానీ సిమెంట్‌పై అందరిదీ ఒకే మాట.. ఒకే బాట
- నల్లజెండాలు, ఫ్లకార్డులతో నిరసనల వెల్లువ
- భారీగా తరలి వచ్చిన స్థానికులు
- పలువురి నేతల ముందస్తు అరెస్టులు
- రసాభాసగా ప్రజాభిప్రాయ సేకరణ

ముందస్తు అరెస్టులు

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణకు వస్తున్న వివిధ పార్టీల నేతలను, ప్రజాసంఘాల నాయకులను ముందుగానే అదుపులోకి తీసుకొని అనంతరం వదిలిపెట్టారు.

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

"వాయు, జల, ధ్వని కాలుష్యాలతో విషం చిమ్మే అదానీ గ్రూపు వారి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం మాకొద్దు.. గో బ్యాక్ అంబుజా... గో బ్యాక్.." అంటూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ప్రజల నినాదాలు మారుమోగాయి. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో అంబుజా ఫ్యాక్టరీ నిర్మాణంపై బుధవారం పర్యావరణ అనుమతుల ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలోమ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి మండలవ్యాప్తంగా రెండు వేలకు పైగా రైతులు, చేతి వృత్తుల వారు, సబ్బండ వర్గాల ప్రజలు చేరుకొని ఫ్లకార్డులు, నల్లజెండాలు పట్టుకొని.. 'గో బ్యాక్ అంబుజా..' 'అంబుజా వద్దురా.. రామన్నపేట ముద్దురా..' అని రాసున్న టీ షర్ట్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేసి కార్యక్రమానికి హాజరయ్యారు. మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పరిశ్రమ ఏర్పాటును ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఉదయం 11గంటల నుంచి ఒంటి గంట వరకు కొనసాగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ.. రసాభాసగా సాగడంతో 12.30 గంటలకే ముగిసిందని పర్యావరణ శాఖ అధికారి సునిత ...10లో

సిమెంట్ పరిశ్రమకు అనువైన స్థలం కాదు..నిర్మాణాన్ని విరమించుకోవాలి



పచ్చని పంటపొలాలతో, చేతివృత్తులతో రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో జనజీవనం సాగుతోంది. అలాంటి ప్రాంతం జల, వాయు, ధ్వని కాలుష్యం విస్తరింపజేసే సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనువైన స్థలం కాదు. జనావాసాల మధ్య డ్రైపోర్టు పేరుతో భూసేకరణ చేసి, తీరా ఆ పని పూర్తయ్యాక సిమెంట్ పరిశ్రమ నిర్మాణం చేపడతామంటే ఒప్పుకోం. ఈ నిర్మాణాన్ని తక్షణమే విరమించుకోవాలి.

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డీ. జహంగీర్

వాస్తవ రిపోర్టు అందజేయాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



జనావాసాలకు దూరంగా ఉండాల్సిన సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మించడం సరికాదు. ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రజలు చెప్పిన అభిప్రాయాల వాస్తవ రిపోర్టును ప్రభుత్వానికి అందజేయాలి. ప్రజలు ఈ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించే వరకూ పోరాటం చేస్తారు. వారికి మా మద్దతు ఉంటుంది.

మూడుగంటలు..130కి పైగా ప్రశ్నలు

వాడీవేడిగా కాళేశ్వరం కమిషన్ విచారణ | కీలక విషయాలను వెల్లడించిన ఇంజినీర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ మళ్లీ మొదలైంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఈఎన్‌సీ నాగేందర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిపై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. ఓపెన్ కోర్టులో వాడీవేడిగా విచారణ సాగింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. కమిషన్ ముందు సదరు ఇంజినీర్లు కీలకాంశాలు వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్టు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా క్వాలిటీ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా ఇస్తారంటూ కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎన్నిసార్లు మేడిగడ్డ, అన్నారం విజిట్ చేశారో



చెప్పాలనీ, అదే సమయం లో సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదంటూ కమిషన్ ప్రశ్నించింది. అయితే, తాము మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ప్రమాదం జరగకముందు విజిట్ చేశామంటూ క్వాలిటీ కంట్రోల్ సీఈ సమాధానమిచ్చారు.

నిబంధనలు ఏమైనా పాటించారా..?

కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు విచారణలో బుధవారం మధ్యాహ్నం తర్వాత క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అజయ్ కుమార్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. క్వాలిటీ కంట్రోల్ సీఈ స్థాయిలో ఉండి రికార్డ్స్ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా సబ్మిట్ చేస్తారని ప్రశ్నించింది. క్వాలిటీ కంట్రోల్ పని ఏంటి? పరిధి ఏంటి? ఇప్పటివరకు ఏం పని చేశారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను ఎన్నిసార్లు విజిట్ చేశారని అడిగింది. దీనికి ఈ రెండు బ్యారేజీలను ప్రమాదం జరగక ముందు పరిశీలించానని తెలిపారు. సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించింది. మొదటి సారి ఫ్లడ్స్ వచ్చిన తర్వాత మూడు బ్యారేజీలను క్వాలిటీ కంట్రోల్ సీఈగా విజిట్ చేశారా..? అని కమిషన్ ప్రశ్నించింది. గ్రౌండ్‌లో సమస్యలు ఉన్నాయని రిపోర్టులు రావడంతో విజిట్ ...11లో

డిస్కంల ప్రతిపాదనలు తిరస్కరించండి

కరెంటు చార్జీల భారం వేయొద్దు

టీజీఈఆర్సీ బహిరంగ విచారణలో పలువురి అభ్యంతరాలు

చార్జీలు పెంచట్లేదు : సీఎమ్‌డీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు చార్జీల పెంపు కోరుతూ డిస్కంలు చేసిన ప్రతిపాదనల్ని నిర్ద్వంధంగా తిరస్కరించాలని పలురంగాల పిటీషన్‌దారులు టీజీఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య అధ్యక్షతన బుధవారంనాడిక్కడి విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ ...10లో



విద్యుద్ఘాత మృతుని కుటుంబానికి పరిహారం

వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలం, జైన్ తిరుమలాపూర్ గ్రామంలో 2021 మార్చి 28న వరగోల యాదయ్య తన వ్యవసాయ భూమిలో పంప్ సెట్ స్టార్టర్‌కు ఫ్యూజ్ వేస్తూ ప్రమాదవశాత్తు మరణించారు. అప్పటి నుంచి ఆయన కుటుంబం ఎక్స్‌గ్రేషియా కోసం విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం జరిగిన బహిరంగ విచారణలో మృతుని కుటుంబ సభ్యులు తమ బాధను తెలిపారు. దీనిపై సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ వెంటనే స్పందించారు. వివరాలు తెలుసుకొని అప్పటికప్పుడు మృతుని కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల పరిహారాన్ని మంజూరు చేశారు. ఈ లేఖను ఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్యల సమక్షంలో విచారణాహాలులోనే అందచేశారు. ఈ పరిహారం చెల్లింపు ఆలస్యానికి కారకులైన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా వనపర్తి ఎస్ఈని సీఎమ్‌డీ ఆదేశించారు.



పొలిటికల్ బాంబ్

రెండ్రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ సునామి : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీపావళి రాకముందే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ సంచలనాలు సృష్టించే పొలిటికల్ బాంబ్‌లను పేల్చేశారు. సియోల్‌లో హన్ నది పునరుజ్జీవన పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన మంత్రి అక్కడ ఓ తెలుగు జాతీయ ఛానల్ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్, ధరణి మొదలగు ఎనిమిది అంశాలపై చర్యలు ఉంటాయన్నాని చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి సాక్ష్యాధారాలు సిద్ధమయ్యాయని అన్నారు. సియోల్ నుంచి మరో రెండు రోజుల్లో హైదరాబాద్ చేరే సరికల్లా చర్యలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కక్ష సాధింపుకు పాల్పడటం లేదనీ, చట్ట ప్రకారం ఆధారాలతో చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. ఇందులో ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

ఒక్కో పార్టీకి 85 సీట్లు..

'మహా' విపక్ష కూటమి నిర్ణయం



వివరాలు 3లో

ఐఏఎస్ అమోయ్‌పై ఈడీ ఇంటరాగేషన్

భూముల అక్రమ కేటాయింపులో 8గంటల పాటు విచారణ





వివరాలు 10లో

దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు..

ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు



వివరాలు 11లో

పరిహారంపై అనుమానాలు

2013 ఆర్‌అండ్‌ఆర్ కావాలంటున్న నిర్వాసితులు

మూసీ కన్నీళ్లు పార్ట్-2



డబుల్ బెడ్‌రూంతో పాటు కొంత నగదు ఇచ్చేందుకు సర్కార్ మొగ్గు

బాధితులను ఒప్పించిన తర్వాతే తరలిస్తామంటున్న సీఎం

క్షేత్రస్థాయిలో కానరాని సంప్రదింపులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"హైదరాబాద్‌ను రక్షించేందుకే మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్ చేపట్టాం. నది ప్రాంతంలో నివసించే పేదల్లో ఏ ఒక్కరిని ఇప్పటి వరకు నిర్దయగా ఖాళీ చేయించలేదు. మూసీ నది గర్భంలో ఉన్న 1,600 కుటుంబాలు దసరా ముందు తమ ఇష్ట పూర్వకంగా ఖాళీ చేసి డబుల్‌బెడ్ రూం ఇండ్లల్లోకి వెళ్లాయి. బఫర్ జోన్లో నివసించే వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. వారికి ఆమోదయోగ్యమైన పునరావాసం కల్పించిన తర్వాతే తరలిస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు సీఎం చెప్పినదానికి భిన్నంగా ఉన్నాయి. నదీ తీర ప్రాంతంలోని బహదూర్‌పుర, కిషన్‌బాగ్, ముషారంబాగ్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మార్కింగ్ చేసిన కొన్ని ఇండ్లను దసరాకు ముందే తొలగించారు. మారుతీనగర్, నాగోల్, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో మాత్రం ప్రజలు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. 1,680 కుటుంబాలకుగాను దాదాపు 1,600 కుటుంబాలు స్వచ్ఛందగా డబుల్ ఇండ్లలోకి వెళ్లాయని అధికారులు చెబుతున్నారు. అయితే వాస్తవంలో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు. నదీ గర్భం, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో ఉండే 500 పైగా కుటుంబాలు మాత్రమే ఖాళీ చేసి డబుల్ ఇండ్లలోకి మారారు. వాటితో పాటు పరిహారం సైతం వెంటనే ఇవ్వాలనీ, అప్పుడే తరలిపోతామని మిగతా వారు అంటున్నారు. ఇక బఫర్‌జోన్లో నివసించే నిర్వాసితులు తాము ఖాళీ చేయలేమంటూ తెగేసి చెబుతున్నారు. కచ్చితంగా తరలాల్సి వస్తే మాత్రం 2013 ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



పరిహారంపై తేల్చని సర్కార్

మూసీ బాధితుల పరిహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎటూ తేల్చలేదు. ఇప్పటి వరకు తుది నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ బాధితులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని ప్రాథమికంగా ...10లో

బస్సుల సంఖ్యను పెంచాలి

- అన్ని గ్రామాలకు బస్సులు నడపాలి
- చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రోడ్డెక్కిన విద్యార్థులు



నవతెలంగాణ-చేవెళ్ల

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని బస్‌స్టేషన్ ఎదురుగా పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కళాశాలల, పాఠశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాలకు బస్సు సౌకర్యాలు లేక విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ సాయంత్రమైతే విద్యార్థులతో బస్టాండ్ నిండిపోతుందని, బస్సుల్లో వేలాడుతూ విద్యార్థులు ప్రయానిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బేగరి తేజ, సాయి గణేష్, చరణ్‌గౌడ్, సమీర్, చందు, నవీన్, సందీప్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

- డీహెచ్‌కు తెలంగాణ(ప్రభుత్వ)నర్సెస్ అసోసియేషన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల పదోన్నతుల కోసం సీనియార్టీ జాబితా ప్రకటించి పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం కోఠిలోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుఢావత్, నర్సింగ్ ఆఫీసర్లు గీతాంజలి, భవాని, శిరీష కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాలకులను ఎన్నుకుంటే మా పాకలు.. కూలదోస్తారా ?

- పేదల ఇండ్లు కూలిస్తే ఊరుకోం : ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణలో మార్పు వస్తే పేదల బతుకులు బాగుపడతాయని అనుకొని కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే.. గత ప్రభుత్వ మాదిరిగానే ఈ ప్రభుత్వం, పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, కంటికి కునుకు లేకుండా చేస్తున్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పాలకులను ఎన్నుకుంటే మా పాకలు, కూలదోస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతపూర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాలైన బాలకృష్ణ నగర్, సాయి కృష్ణ నగర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించిన ఖర్మానికి చెరువుల పక్కన, మూసీ నది పక్కన 30-40 ఏండ్లుగా రెక్కల కష్టం మీద సంపాదించిన డబ్బుతో భూమి కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్న వారికి రెండు నెలలుగా కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారన్నారు. శనివారం, ఆదివారం వస్తే భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినా, చానల్స్ వచ్చి మాట్లాడించినా కేసులు పెట్టడం, పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం చేస్తున్నారని అన్నారు. బీజేపీ కచ్చితంగా పేదలకు అండగా ఉంటుందని.. వారి ఇండ్లను కూలగొడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. పార్టీ పరంగా ఈ ప్రాంతాల్లో సందర్శించి ప్రజల మనోభావాలను, అంతరంగాన్ని అర్థం చేసుకొని దాన్ని ప్రతిబింబించే పద్ధతిలో ఇందిరా పార్క్ దగ్గర ధర్నా చేపట్టబోతున్నట్టు చెప్పారు.

బాలికపై సీఐ లైంగికదాడికి యత్నం

- పోక్సో కేసు నమోదు



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

బాలికపై లైంగికదాడికి యత్నించిన సీఐపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు కాజీపేట అడ్మిన్ ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా వడ్డేపల్లిలోని పీజీఆర్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న సీఐ రవికుమార్.. ఆదిలాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు. సెలవులపై హనుమకొండకు వచ్చాడు. బుధవారం స్థానికంగా నివాసం ఉండే బాలికను లైంగిక వేధింపులకు గురిచేస్తూ లైంగికదాడికి యత్నించగా.. తప్పించుకుని తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలి తల్లిదండ్రులు కాజీపేట పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సీఐ రవికుమార్ గతంలో మామునూర్, మడికొండ పోలీస్ స్టేషన్‌ల్లో విధులు నిర్వర్తించారు.

ఆచార్యా.. మీకిది తగునా..!

'ఐ సెట్' నిర్వహణ నిధులు పక్కదారి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఆయన కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత స్థానంలో ఉన్న ఆచార్యుల్లో ఒకరు. ఏకంగా ఐసెట్ నిర్వహణ నిధులపై కన్నేశాడు.. 'లెక్క' తేలని కారణాలు చెబుతూ పెద్ద మొత్తంలో దారి మళ్లించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఐసెట్ ఒకటి. దాని నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. దీని నిర్వహణ కోసం ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులను ఈ ఆచార్యుడు దారి మళ్లించినట్టు సమాచారం. 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి పత్రికా ప్రకటన, సీఈటీ సమావేశానికి, కాన్ఫిడెన్షియల్ పనులు, వేతనాలు, అతిథ్యం, రవాణా, సామగ్రి ఖర్చు, స్టేషనరీ తదితర వాటికి రూ.99.50 లక్షలు అవసరం అవుతాయని ఉన్నత విద్యామండలికి ప్రతిపాదన పంపిస్తే రూ.92.76 లక్షలను కేటాయించింది. వాటిలో కొన్నింటికి తక్కువ ఖర్చు అయినా ఎక్కువ అయినట్టు లెక్కలు చూపించి రూ.29.25 లక్షలను ఆ ఆచార్యుడు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం ఉన్నత విద్యా మండలి దృష్టికి వెళ్లడంతో బయటకు పొక్కింది.ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.6 లక్షలు, మార్చిలో రూ.5 లక్షలు, ఏప్రిల్‌లో రూ.7 లక్షలు, మే నెలలో రూ.8 లక్షలు, ఆగస్టులో రూ.3.25 లక్షల చొప్పున మొత్తం రూ.29.25 లక్షల అవినీతికి పాల్పడినట్టు తెలిసింది. ఆరు నెలల్లో రూ.16 లక్షలను సెల్ఫ్ చెక్‌లతో డ్రా చేసుకున్నట్టు సమాచారం. వాటిని ఐసెట్ కాన్ఫిడెన్షియల్ విభాగం ఖర్చు కోసం వాడాలి. వాటిని వినియోగించిన తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. రవాణా ఖర్చులు నిమిత్తం నెలకు రూ.40 వేలు తీసుకున్నారు. ఐసెట్ పరీక్ష నిర్వహణలో సంబంధం లేని ఒక పెద్దసారుకు వేతనం పేరుతో రూ.2 లక్షలు చెల్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కార్యాలయంలో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఖాతాలోకి ముందు నగదు జమచేసి ఆ తర్వాత విడుదల చేసుకున్నట్టు సమాచారం. విశ్వవిద్యాల యానికి ఎలాంటి సంబంధమూ లేని మహిళ పేరున రూ.82,600 తీసుకోవడం పట్ల నగదు అక్రమ బదిలీ జరిగినట్టు తెలిసింది. కంప్యూటర్ల కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారని ఉన్నత విద్యామండలి ఫిర్యాదులందినట్టు తెలిసింది.

విచారణ జరిపించి దోషులను శిక్షించాలి

నిర్వహణలో తప్పుడు బిల్స్‌తో లక్షల నిధులు దారి మళ్ళించి, వారి సొంత జేబులో వేసుకోవడమంటే ఇది యూనివర్సిటీ విద్యార్థుల సొమ్మును దోచుకునే చర్య. వెంటనే ఆర్థిక కుంభకోణాన్ని ప్రభుత్వం పారదర్శకంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం.



మంద శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ రంగ సంస్థల సమాచారాన్ని అధ్యయనం చేయండి

- పీయూసీకి స్పీకర్ ప్రసాద్‌కుమార్ దిశా నిర్దేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసన మండలి ద్వారా ఏర్పాటైన కమిటీల్లో ప్రభుత్వ లెక్కల కమిటీ, అంచనాల కమిటీ, ప్రభుత్వరంగ సంస్థల కమిటీ చాలా కీలక పాత్ర పోషిస్తాయని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులు పూర్తిగా అధ్యయనం చేయాలని సూచించారు. చర్చల్లో క్రియాశీలకంగా పాల్గొనాలనీ, ఆ సంస్థలను బలపరిం చేందుకు తమ విలువైన సలహాలను, సూచనలను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల ఆర్థిక వ్యవహారాలను సమీక్షించి, తగు సూచనలు చేయాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో పీయూసీ చైర్మెన్ కె. శంకరయ్య అధ్యక్షతన కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ ప్రతి సమావేశానికి హాజరు కావాలన్నారు. చైర్మెన్ నాయకత్వంలో కమిటీ చాలా సమర్థవంతంగా పని చేస్తుందనే నమ్మకం, విశ్వాసముందన్నారు. ఆ సంస్థలలోని అవకతవకలను, లోపాలను సరిదిద్దడం ద్వారా అన్ని ప్రభుత్వరంగ సంస్థలు బలపడి, ఆరోగ్యకరంగా పని చేసి ప్రభుత్వానికి ఆర్థికంగా సహాయ సహకా రాలను అందించాలని కోరారు. సమావేశానికి మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, లక్ష్మీకాంతారావు, శేరి సుభాష్ రెడ్డి, తాతా మధుసూదన్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ పి. మాధవి, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నాగేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.

అటవీ శాఖ కార్యాలయంలో

గిరిజన యువ రైతు ఆత్మహత్యాయత్నం

- లంచం ఇవ్వాలంటూ వేధింపులు
- మెదక్ జిల్లాలో ఘటన



నవతెలంగాణ-కౌడిపల్లి

ప్రభుత్వం తనకిచ్చిన మూడెకరాల భూమిని అటవీ శాఖ అధికారులు అక్రమంగా లాక్కుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ యువ రైతు బర్మావత్ శ్రీను బుధవారం మధ్యాహ్నం ఐదు లీటర్ల డీజిల్ డబ్బాతో అటవీశాఖ జిల్లా కార్యాలయానికి వచ్చి ఒంటిపై పోసుకుని ఆత్మహత్యా యత్నం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గ్రామపంచాయతీ జయరాం తండాకు చెందిన బర్మావత్ శ్రీను భార్య బర్మావత్ పద్మకు అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో మూడు ఎకరాలు భూమి పంచి పట్టా సర్టిఫికెట్ ఇచ్చారు. 2010 నుంచి సర్వేనెంబర్ 192/1 లో మూడు ఎకరాలు ఉండగా అందులో ప్రతి సంవత్సరం పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. కాగా, నాలుగు నెలల క్రితం కౌడిపల్లి అటవీశాఖ డీఆర్‌ఓ రాజమణి పొలం పనులు చేయకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట దున్నుతుండగా ట్రాక్టర్ పట్టుకొని సీజ్ చేశారని తెలిపారు. తన వద్ద ఉన్న పట్టా సర్టిఫికెట్, పహాణీలు తీసుకువచ్చి అటవీ శాఖ అధికారులకు చూపించినా వినకుండా, ఇది ఫారెస్ట్ భూమి, ఇందులో ఎలాంటి పనులు చేయొద్దని హెచ్చరించినట్టు చెప్పారు. ఈ భూమి విషయం కోర్టులో వేశారని, ఇదేంటని అడిగితే కౌడిపల్లి అటవీ శాఖ డీఆర్‌ఓ రాజమణి, ఎఫ్ఆర్‌వో మనోజ్ కుమార్.. లక్ష రూపాయలు ఇస్తే తన పేర పొలం చూపిస్తామంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయం ఎవరికీ చెప్పినా, రాజకీయ నాయకులతో ఫోన్లు చేయించినా పొలం తనకు చెందదని, లక్ష రూపాయలు ఇస్తేనే తనకు పొలం దక్కుతుందని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్య పరిష్కారం కాకపోవడంతో చేసేది లేక బుధవారం కౌడిపల్లి అటవీ శాఖ కార్యాలయం ముందు అధికారులు చూస్తుండగానే ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం చుట్టుపక్కల ఉన్న వారు వెళ్లి డబ్బాను తీసుకొని అడ్డుకున్నారు. పోలీసులు బాధిత రైతుకు నచ్చచెప్పారు. ఇదే విషయమై అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా నకిలీ కాగితాలు సృష్టించారని తెలిపారు.3

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్



నవతెలంగాణ పాల్వంచ

అక్రమంగా విద్యుత్తు వాడుకుంటున్నావంటూ ఓ వ్యక్తిని లంచం డిమాండ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి విద్యుత్ అధికారి పట్టుబడ్డ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు నిర్మించుకుంటూ.. పక్కనే ఉన్న తన మేనమామ ఇంట్లో నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకొని వాడుకుంటున్నాడు. ఈ క్రమంలో పాల్వంచ లైన్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లిన సమయంలో ఆ వ్యక్తిని అక్రమంగా విద్యుత్తును వాడుకుంటున్నావని, తనపై కేసు నమోదు చేస్తానని హెచ్చరించాడు. దాంతో కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.60 వేలు ఇవ్వాలని ఇంటి యజమానిని డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చెప్పడంతో రూ.30 వేలు ఇవ్వాలని ఒకసారి, తర్వాత రూ.26 వేలు ఇవ్వాలని చెప్పడంతో ఆ వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. దాంతో లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా లైన్ ఇన్స్‌పెక్టర్ నాగరాజును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

కలర్ టెస్ట్ చేయగా లంచం తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు డీఎస్పీ రమేష్ తెలిపారు.



మహాయుతిలో అసమ్మతి మంటలు

బీజేపీ అభ్యర్థులపై శివసైనికుల తిరుగుబాటు

నాలుగు స్థానాల్లో పోటీకి సన్నాహాలు

ముంబయి : మహారాష్ట్రలో అధికార మహాయుతిలో అసమ్మతి మంటలు చెలరేగుతున్నాయి. రాబోయే శాసనసభ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన 99 మంది అభ్యర్థుల జాబితాపై శివసేన మండిపడుతోంది. ముఖ్యంగా కల్యాణ్ ఈస్ట్, థానే, నవీ ముంబయి, ముర్బాద్ స్థానాలలో బీజేపీ ప్రకటించిన అభ్యర్థులకు శివసేన నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ స్థానాలలో పోటీకి దిగాలని స్థానిక శివసేన నేతలు నిర్ణయించుకున్నారు. కల్యాణ్ ఈస్ట్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ భార్య సులభా గైక్వాడ్‌ను బీజేపీ బరిలో దింపింది. ఆమెకు మద్దతుగా ప్రచారం చేసే ప్రశ్నే లేదని స్థానిక శివసేన కార్యకర్తలు తెగేసి చెప్పారు. ఉల్హాస్‌నగర్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో శివసేన నాయకుడు మహేష్ గైక్వాడ్‌పై గణపత్ కాల్పులు జరిపారు. ప్రస్తుతం ఆయన ఈ కేసులో జైలులో ఉన్నారు. ఆయన భార్యకు బీజేపీ టిక్కెట్ ఇవ్వడాన్ని శివసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. అభ్యర్థిని మార్చాలంటూ వారు ప్రదర్శన కూడా నిర్వహించారు.

థానేలో సంజయ్ ఖేల్కర్‌కు బీజేపీ టిక్కెట్ ఇవ్వడాన్ని కూడా శివసేన కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. ఈ నియోజకవర్గం శివసేన అధిపతి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు కంచుకోట అని వారు గుర్తు చేశారు. నవీ ముంబయిలోని ఐరోలీలో గణేష్ నాయక్‌ను, ముర్బాద్‌లో కిషన్ కాథోర్‌ను బీజేపీ పోటీకి నిలపడం కూడా శివసేన ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ స్థానాలలో షిండే నేతృత్వంలోని శివసేన అభ్యర్థులను నిలపాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుండగా షిండే సేన మంగళవారం రాత్రి 45 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం ఏక్‌నాథ్ షిండే థానేలోని కప్రీ-పంచ్‌పకడీ నుండి పోటీ చేస్తారు. ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు చేసి ఏక్‌నాథ్ పంచన చేరిన ఎమ్మెల్యేలందరికీ టిక్కెట్లు దక్కాయి. మహారాష్ట్రలో నవంబర్ 20న ఎన్నికలు జరుగుతాయి. 23న ఫలితాలు ప్రకటిస్తారు.

ఈడీ మౌనానికి అర్థాలే వేరులే !

'స్కిల్' కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరటే

- క్లీన్‌చిట్ ఇవ్వని దర్యాప్తు సంస్థ
- పూర్తికాని విచారణ
- అన్ని ఆప్షన్లూ బీజేపీ వద్దే

అడకత్తెరలో పోకచెక్కలా ఏపీ సీఎం



న్యూఢిల్లీ : ఈడీ అధికారులు ఈ నెల 15వ తేదీన హైదరాబాదులో రూ.23.54 కోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేశారు. ఇవి సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ అండ్ డిజైన్‌టెక్ సిస్టమ్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్‌లకు చెందిన ఆస్తులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణానికి సంబంధించి ఈడీ ఈ చర్య తీసుకుంది. ఈ కేసులోనే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోయిన సంవత్సరం 53 రోజులు జైలులో గడిపారు. ఇదంతా గత చరిత్ర. అయితే రూ.371 కోట్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఈ కేసులో చంద్రబాబు ప్రమేయం ఉన్నదా లేదా అనే విషయంపై ఈడీ ఇప్పటి వరకూ పెదవి విప్పలేదు. దర్యాప్తు సంస్థ నుండి అధికారిక ప్రకటన ఏదీ విడుదల కానప్పటికీ పలు మీడియా సంస్థలు, సీనియర్ పాత్రికేయులు ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చారు.

అయితే ఇదంతా బీజేపీ 'వాషింగ్ మిషన్' వ్యూహంలో భాగమేనని కొందరు విమర్శకులు వ్యాఖ్యానించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల నుండి కేసులు ఎదుర్కొంటున్న నాయకులు ఎన్డీఏలో చేరగానే పునీతులవుతున్నారని, వారిపై ఉన్న కేసులన్నీ అటకెక్కుతున్నాయని వారు గుర్తు చేశారు. చంద్రబాబు ప్రస్తుతం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే.

ఏమిటీ కేసు?

తాను రూ.23.54 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశానని ఈడీ ఓ పత్రికా ప్రకటనలో ధృవీకరించింది. అయితే చంద్రబాబు పేరును అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో ఆయన ప్రమేయంపై నిర్ధారణకు వచ్చానని కూడా చెప్పలేదు. 2002వ సంవత్సరపు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద సీమెన్స్ ఎగ్జిక్యూటివ్‌ల ఆస్తులు జప్తు చేశారు. ప్రభుత్వం చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కోసం ఉద్దేశించిన నిధులను దుర్వినియోగం చేశారంటూ వచ్చిన ఆరోపణలపై ఈడీ విచారణ జరుపుతోంది. అందులో భాగంగానే ఆస్తుల జప్తు జరిగింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-19 కాలంలో ఏపీఎస్-ఎస్‌డీసీ ప్రాజెక్టును చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాభివృద్ధి కోసం దీనిని ఉద్దేశించారు. అయితే దీనికి కేటాయించిన రూ.371 కోట్ల నిధులను షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించారని ఆరోపణలు వచ్చాయి. పరికరాలు, సేవల పేరుతో సిమెన్స్ ఎగ్జిక్యూటివ్‌లు, కొందరు కీలక వ్యక్తులు నిధులను పక్కదారి పట్టించారన్నది ప్రధాన అభియోగం.

ఈడీ ప్రకటనలో ఏముంది?

ఈడీ పత్రికా ప్రకటన నేపథ్యంలో దర్యాప్తు సంస్థ చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. చంద్రబాబు ప్రమేయంపై ఈడీ మౌనం వహించడం అంటే ఆయన పాత్ర ఏమీ లేదని చెప్పడమేనని చాలా మంది అభిప్రాయపడ్డారు. అయితే ఈడీ ప్రకటనను జాగ్రత్తగా పరిశీలిస్తే అర్థమవుతోంది ఏమిటంటే...ఇప్పటి వరకూ జరిగిన విచారణలో చంద్రబాబు ప్రమేయం ఏమీ కన్పించలేదని ఈడీ చెప్పింది. అదే సమయంలో విచారణ పూర్తయినట్లు ఆ ప్రకటనలో తెలుపలేదు. ఎన్డీఏతో దోస్తీ కారణంగానే చంద్రబాబుకు ఈ కుంభకోణంలో తాత్కాలిక ఊరట లభించి ఉండవచ్చునని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఎన్డీఏ కూటమి నుండి బాబు బయటికి వస్తే పరిస్థితిలో మార్పు రావచ్చునని కూడా వారు చెప్పారు.

'వాషింగ్ మిషన్' వ్యూహం

గడచిన దశాబ్ద కాలంలో రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ పావులుగా వాడుకున్నదని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీతో చేయి కలపడమో లేదా చట్టపరంగా సవాళ్లను ఎదుర్కోవడమో తప్ప ప్రతిపక్ష నేతలకు మరో ప్రత్యామ్నాయం లేకుండా చేశారు. కాంగ్రెస్, ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నేతలు బీజేపీలో చేరిన తర్వాతే వారిపై కేసుల విచారణ నెమ్మదించింది. కేసులు పూర్తిగా అటకెక్కిన ఉదంతాలూ ఉన్నాయి.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌పై నమోదైన ఆదర్శ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణం కేసు విచారణ ఆయన బీజేపీలో చేరగానే నిలిచిపోయింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్‌పై నమోదైన సహకార బ్యాంక్ కుంభకోణం కేసు సైతం ఆయన బీజేపీ శిబిరంలోకి రాగానే కోల్డ్‌స్టోరేజీలో చేరింది. ఒకప్పటి టీడీపీ నేతలు సీఎం రమేష్, సుజనా చౌదరిపై దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసులు సైతం వారు బీజేపీ పంచన చేరగానే నీరుకారిపోయాయి. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డిపై ఈడీ నమోదు చేసిన అక్రమాస్తుల కేసు విచారణలో జరుగుతున్న జాప్యాన్ని చూసి నత్త కూడా సిగ్గు పడుతోంది. జగన్ ఎన్డీఏకు 'అనధికారిక భాగస్వామి'గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

టీడీపీ సైతం...

ఆశ్చర్యకరమైన విషయమేమంటే తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో మౌనాన్ని ఆశ్రయించడం. పార్టీ ప్రతినిధులు అప్పుడప్పుడు చంద్రబాబు నిర్దోషిత్వాన్ని గురించి చెబుతున్నప్పటికీ ఈడీ ప్రకటన తర్వాత విజయోత్సవ పత్రికా గోష్ఠులు, సమావేశాలు జరగలేదు. ఈ కేసుతో చంద్రబాబుకు ఎలాంటి ప్రమేయం లేదని ఈడీ స్పష్టం చేయకపోవడమే దీనికి కారణం. మున్ముందు జరిగే విచారణలో చంద్రబాబు ప్రమేయం బయటపడినా, లేదా విచారణ కొత్త రూపు తీసుకున్నా ఇబ్బందులు తప్పవన్న భావనతోనే టీడీపీ ఎలాంటి సంబరాలు జరుపుకోలేదు.

చక్రబంధంలో చంద్రబాబు

కేంద్రంలో చంద్రబాబు కింగ్‌మేకర్ అని, మోడీ దూకుడుకు ఆయన కళ్లెం వేస్తారని రాజధానిలోని పలువురు పరిశీలకులు తొలుత భావించారు. అయితే అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ కోసం చంద్రబాబు కేంద్ర నిధులపై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. వీటికి తోడు ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలుకు ఏటా రూ.1.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో మోడీని ప్రసన్నం చేసుకోవడం మినహా చంద్రబాబుకు మరో దారి లేకుండా పోయింది. తిరుపతి లడ్డూ వివాదాన్ని రాజకీయం చేయడం ద్వారా బీజేపీ ఇప్పటికే ఏపీలో పునాదులు వేసుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీకి అత్యంత నమ్మకమైన భాగస్వామిగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా 'సనాతన ధర్మం' వాదాన్ని తలకెత్తుకున్నారు. ఈ పరిణామాలన్నీ చంద్రబాబుకు ఇబ్బంది కలిగించేవే. ఈడీ కేసు విచారణను సజీవంగా ఉంచడం ద్వారా చంద్రబాబును, టీడీపీని బీజేపీ అదుపులో ఉంచవచ్చు. ఏదేమైనా చంద్రబాబు పరిస్థితి ఇప్పుడు అడకత్తెరలో పోకచెక్కలా తయారైందని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

అఖిల్ గొగోయ్‌పై ఎన్ఐఏ కోర్టు అభియోగాలు

- హైకోర్టును ఆశ్రయిస్తానన్న అసోం ఎమ్మెల్యే



న్యూఢిల్లీ : అసోం ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్, ఆయన ముగ్గురు అనుచరులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ)లోని పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. 2019, డిసెంబర్‌లో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలు హింసకు దారి తీసిన విషయంలో ఆయన పాత్రపై కోర్టు ఈ అభియోగాలను ఫ్రేమ్ చేసింది. ప్రస్తుతం, అఖిల్ గొగోయ్.. సిబ్‌సాగర్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద కుట్ర పన్నారని ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.కె శర్మ అఖిల్ గొగోయ్‌పై అభియోగాలు మోపారు. అయితే, ఉపాలోని సెక్షన్ 39ని, ఐపీసీలోని సెక్షన్ 124ఎలను చేర్చటానికి కోర్టు తిరస్కరించింది. తనపై అభియోగాలు మోపటాన్ని తాను గువహతి హైకోర్టులో సవాలు చేయనున్నట్టు అఖిల్ గొగోయ్ తెలిపారు. తనను, తన అనుచరులను జైళ్లలో ఉంచటానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. మేము ప్రజలతో ఉన్నామనడాన్ని ఇది రుజువు చేస్తున్నదని అన్నారు. ఫాసిస్టు, మతతత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం చాలా కష్టం, ఖరీదైన వ్యవహారమని తెలిపారు. రాజీపడి, లొంగిపోతే తప్ప ప్రభుత్వం ఎవరినీ వదిలి పెట్టదని ఎక్స్ పోస్ట్‌లో గొగోయ్ పేర్కొన్నారు. ఇక్కడ న్యాయమనేది ఒక నిఘంటువు పదమని వివరించారు.

ఏమిటీ కేసు?

సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న తర్వాత 2019, డిసెంబర్ 12న అఖిల్ గొగోయ్‌ను అధికారులు ప్రివెంటివ్ కస్టడీలోకి తీసుకున్నారు. 'దేశానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించటం', కుట్ర, అల్లర్ల ఆరోపణలపై ఆయన మీద కేసు నమోదు చేసినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. ఆయనను అరెస్టు చేసిన మూడు రోజుల తర్వాత.. కఠినమైన ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద అభియోగాలు నమోదయ్యాయి. అఖిల్ గొగోయ్, ఆయన అనుచరులను ఉగ్రవాద వ్యతిరేక చట్టం నుంచి 2021లో ప్రత్యేక న్యాయస్థానం తప్పించింది. కానీ, గువహతి హైకోర్టు మాత్రం ప్రత్యేక కోర్టు ఆదేశాలను తోసిపుచ్చింది. 2023, ఏప్రిల్ 18న అఖిల్ గొగోయ్‌కు బెయిల్‌ను మంజూరు చేసిన సుప్రీంకోర్టు.. హైకోర్టు ఆదేశాలను మాత్రం సమర్థించింది.

ఒక్కో పార్టీకి 85 సీట్లు

'మహా' విపక్ష కూటమి నిర్ణయం



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష 'మహా వికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయిం చాయి. మొత్తంగా 270 సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరగా.. మిగతా 18 స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ సహా ఇతర భాగస్వామ్య పక్షాలకు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే వెల్లడించారు. ఈ మేరకు ఆయన శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఇతర నేతలతో కలిసి ముంబయిలో మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 సీట్లు ఉండగా.. 270సీట్లపై సామరస్యపూర్వకంగా ఏకా భిప్రాయానికి వచ్చినట్టు వెల్లడించారు. అయితే, సీట్ల పంపకాలపై తుది ఒప్పందానికి సంబంధిం చిన చర్చలు ఇంకా కొనసాగుతున్నట్టు చెప్పారు.

దీనిపై సమాజ్‌వాదీ పార్టీతో పాటు కూటమి లోని ఇతర పార్టీలతో చర్చలు జరిపి.. గురువారం నాటికి అంతా పూర్తి చేస్తామని తెలిపారు. తామంతా మహా వికాస్ అఘాడీ కూటమిగా పోటీ చేస్తున్నామని.. ఎన్నికల్లో 'మహాయుతి కూటమి'పై విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. సీట్ల సర్దుబాటులో జరుగుతోన్న జాప్యం పట్ల చిన్న పార్టీలు గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, లెఫ్ట్, పీడబ్ల్యూపీలు కూటమిలో ఉన్నాయి. 12 సీట్లు ఆశిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ఐదు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది.

సీఎం శిందేపై పోటీ ఎవరంటే?

మరోవైపు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శివసేన(యూబీటీ) అభ్యర్థుల తొలిజాబితా విడుదలైంది. మొత్తం 65మందితో జాబితాను విడుదల చేసింది. ముంబయిలోని వర్లి నుంచి మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు. సీఎం ఏక్‌నాథ్‌శిందే నియోజక వర్గమైన కోప్రి పాచ్‌పఖడి సీటులో ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే సోదరుడి కుమారుడైన కేదార్ దిఘేను ఉద్ధవ్ ఠాక్రే బరిలో దించారు. ప్రస్తుతం కేదార్ దిఘే ఠానే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉద్ధవ్ అనుయాయుడు, మాజీ ఎంపీ రాజన్ విచారేకు ఠానే అసెంబ్లీ సీటును కేటాయించారు. అవిభాజ్య శివసేన తరఫున 2009 నుంచి ఏక్‌నాథ్ శిందే కోప్రి పాచ్‌పఖడీ సీటు నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిపై 89వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. సీఎం శిందే అక్టోబర్ 28న నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

35 మందితో జేఎంఎం తొలి జాబితా

బర్‌హైత్ నుంచి హేమంత్ సొరేన్ పోటీ



రాంచీ : జార్ఖండ్ ఎన్నికలలో పోటీ చేసే 35 మంది పార్టీ అభ్యర్థుల జాబితాను జేఎంఎం బుధవారం విడుదల చేసింది. ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ బర్హైత్ నుండి, ఆయన భార్య కల్పనా సొరేన్ గండే నుండి పోటీ చేస్తారు. జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీలలో రెండు దశలుగా ఎన్నికలు జరుగుతాయి. 23న ఫలితాలు ప్రకటిస్తారు. హేమంత్ ప్రస్తుతం సాహిబ్‌గంజ్ జిల్లాలోని బర్హైత్ (ఎస్టీ) నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 ఎన్నికలలో ఆయన ఈ స్థానం నుండి బీజేపీ అభ్యర్థిపై 25,740 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. కల్పనా సొరేన్ గండే స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో 27,149 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జేఎంఎం అభ్యర్థులలో హేమంత్ సోదరుడు బసంత్ సొరేన్, శాసనసభ స్పీకర్ రబీంద్రనాథ్ మహతో, మంత్రి మిధిలేష్ ఠాగూర్ తదితర ప్రముఖులు ఉన్నారు. రాష్ట్రంలోని మొత్తం 81 అసెంబ్లీ స్థానాలలో జేఎంఎం, కాంగ్రెస్ కలిసి 70 సీట్లకు పోటీ చేస్తున్నాయి. ఆర్జేడీ, వామపక్షాలు మిగిలిన 11 స్థానాలలో పోటీ చేస్తాయి. ఆర్జేడీ ఇప్పటికే ఆరుగురు అభ్యర్థులను ప్రకటించింది. ప్రతిపక్ష కూటమిలో బీజేపీ 68, ఏజేఎస్‌యూ 10, జేడీయూ 2, ఎల్జేపీ (రాం విలాస్) ఒక స్థానంలో పోటీ చేస్తాయి.

జార్ఖండ్ సీపీఐ(ఎం) అభ్యర్థుల జాబితా విడుదల

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జార్ఖండ్ ఎన్నికలకు సీపీఐ(ఎం) అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. సురేష్ ముండా (తమర్ -ఎస్టీ), సపన్ మహతో (బహరగోర), మధువా కచప్ (సిసాయి - ఎస్టీ), పున్ భూయియో (చత్ర - ఎస్సీ), లఖన్ లాల్ మండల్ (జమ్తారా), షేక్ సైఫుద్దీన్ (పాకుర్), గోపిన్ సోరెన్ (మహేశ్‌పూర్ -ఎస్టీ), సనాతన్ డెహ్రి (జామా -ఎస్టీ), కీర్తి ముండా (మహిళ) (మందర్ -ఎస్టీ) అభ్యర్థులను ప్రకటించింది.

సీపీఐ నుంచి తొమ్మిది మంది..

ఇండియా బ్లాక్ మిత్రపక్షాలు ఆఫర్ చేసిన సీట్ల కేటాయింపులపై సీపీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో సొంతంగా అభ్యర్థులను ప్రకటించింది. కన్హై చంద్రమల్ పహాడియా (నాలా), ఛాయా(శరత్), మహదేవ్ రామ్ (బర్కథా), రుచిర్ తివారీ (డాల్టోగంజ్), సంతోష్ కుమార్ రజక్ (కంకే), సురేష్ కుమార్ భుయా (సిమారియా), డోమన్ భుయా (ఛత్ర), మహేంద్ర ఒరాన్ (బిషన్‌పూర్), ఘన్‌శ్యామ్ పాఠక్ (భవన్‌పూర్)లు పోటీ చేస్తున్నారు. రాంచీ, మండు, బర్కాగావ్ హజారీబాగ్, పోరేయాహత్ అభ్యర్థులను రెండు రోజుల తరువాత ప్రకటిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

సైనికుడికి హెల్మెట్ సవాల్

అధునాతనమైనవి అందించటంలో భారత్ వెనకంజ



- బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లతో సరి
- నిపుణులు, మాజీ సైనికుల ఆందోళన
- ఇప్పుడిప్పుడే 'బాలిస్టిక్' వైపునకు..
- ఈ విషయంలో అమెరికా, రష్యా, చైనాలు భేష్

ఒకదేశానికి మరో దేశం నుంచి ముప్పు అనేది ఏ రూపంలో, ఎలా వస్తుందో తెలియదు. కాబట్టి, ఒక దేశం తనను తాను రక్షించుకోవటానికి సైన్యం చాలా కీలకం. ముఖ్యంగా, యుద్ధ సమయంలో సైనికులు ముందుండి పోరాడుతూ దేశ రక్షణకు తమ ప్రాణాలనే ఫణంగా పెడతారు. ఇలాంటి సమయంలో సైనికులకు ఆయుధాలు, తగిన యూనిఫామ్‌తో పాటు హెల్మెట్లు కూడా చాలా కీలకం. యుద్ధ సమయంలో ఈ హెల్మెట్లు సైనికులను రక్షించటంలో ఎంతగానో సహాయ పడతాయి. ఇందుకోసం, ప్రపంచంలోనే శక్తివంతమైన సైన్యాన్ని కలిగి ఉన్న చైనా, అమెరికా, రష్యా దేశాలు తమ సైనికుల కోసం అధునాతన హెల్మెట్లను ఉపయోగిస్తుంటే.. భారత్ మాత్రం ఈ విషయంలో వెనకబడి ఉన్నది. బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లతోనే సరిపెడుతున్నది.

న్యూఢిల్లీ : గతనెల రాజస్థాన్‌లో జరిగిన ఇండియా-యూఎస్ 'యుద్ధ అభ్యాస్'లో ఈ విషయం తేటతెల్లమైంది. ఇందులో భారత్, అమెరికా బలగాలు ధరించిన హెల్మెట్ల మధ్య పోలిక చర్చకు వచ్చింది. ఈ సంయుక్త మిలిటరీ విన్యాసంలో యూఎస్ సైనికులు బాలిస్టిక్ హెల్మెట్లు ధరించగా.. భారత బలగాలు కేవలం బుల్లెట్-ప్రూఫ్ హెల్మెట్లను ఉపయోగించాయి. భారత సైనికులు ధరించిన బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లతో రక్షణ తక్కువ అని నిపుణులు చెప్తున్నారు. భారత్ బలమైన సైనిక శక్తని, ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నదనీ, మోడీ పాలనలో భారత్ 'విశ్వగురు'గా ఎదుగుతున్నదని బీజేపీ, ఆ కూటమి నాయకులు తరచూ చెప్పే మాట. అయితే, దేశాన్ని రక్షించే భారత సైనికులకు మోడీ ప్రభుత్వం అధునాతన హెల్మెట్లను కూడా అందించలేకపోతున్నదని విశ్లేషకులు అంటున్నారు.

భారత్, యూఎస్ రెండు దేశాల సైనికులు ధరించిన హెల్మెట్ల గురించి చర్చకు రావటం ఇది మొదటిసారేం కాదు. 2018లో ఉత్తరాఖండ్‌లోని చౌబటియాలో భారత్-అమెరికాలు 'యుద్ధ అభ్యాస్'ను నిర్వహించిన సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. యూఎస్ సైనికులలో ఒకరికి చెందిన అడ్వాన్స్‌డ్ కాంబాట్ హెల్మెట్‌ను ప్రయత్నిస్తున్న భారత ఆర్మీ సిబ్బంది ఫోటోను యూఎస్ ఆర్మీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది. దీంతో ఇరు దేశాల సైనికులు ధరించిన హెల్మెట్ల గురించి విపరీతమైన చర్చ నడిచింది. హెల్మెట్లలో తేడాలను ఎత్తిచూపుతూ.. ఆ సమయంలో చాలా మంది నెటిజన్లు కూడా తీవ్రంగా స్పందించారు.

'పట్కా'లతో ఆర్మీ ఆపరేషన్లు

జమ్మూకాశ్మీర్, ఈశాన్యంలో తిరుగుబాటు నిరోధక ఆపరేషన్లలో భాగంగా భారత సైనికులు జుగాడ్-పట్కాస్‌ను తయారు చేశారు. ఇది మందమైన స్టీల్‌ను, దాని చుట్టూ ఒక వస్త్రాన్ని కలిగి ఉంటుంది. మిలిటెంట్లు ఏకే-47 ల ద్వారా జరిపే క్లోజ్ రేంజ్ భారీ ఫైరింగ్ నుంచి పట్కా.. సైనికులను రక్షిస్తుంది. అయితే, ఈ పట్కాలు దాదాపు 2.5 కేజీలతో బరువుగా ఉంటాయి. అంతేకాదు, ఇవి పూర్తి రక్షణ కల్పించవు. సైనికుడి నుదురు, తల వెనక భాగాన్ని మాత్రమే ఇవి కవర్ చేయగలవు. దీంతో సైనికులు ఈ పట్కాలను ఉపయోగించి గాయపడిన సందర్భాలూ అనేకం ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు. భారత ఆర్మీ 2018లో.. దాదాపు 1.6 లక్షల కెవ్లర్-బేస్డ్ హెల్మెట్లను ఆర్డర్ చేసింది. ఇవి చాలా తేలికగా ఉంటాయి. అయితే, ఇప్పటికి కూడా తిరుగుబాటుదారులు, మిలిటెంట్లతో జరిగే క్లోజ్ ఎన్‌కౌంటర్లలో భాగంగా పలు ఆపరేషన్లు జరిగే ప్రాంతాలలో సైనికులు పట్కాల మీదనే ఆధారపడుతుండటం గమనార్హం.

40 శాతం బాలిస్టిక్ హెల్మెట్లు సమకూర్చుకున్న సైన్యం

భారత ఆర్మీ 2020లో ఆర్ఎఫ్ఐ (రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్) జారీ ద్వారా బాలిస్టిక్ హెల్మెట్లను సమకూర్చుకోవటం ప్రారంభించింది. ప్రస్తుతం, 4.8 లక్షల ఫ్రంట్‌లైన్ దళాలకు బాలిస్టిక్ హెల్మెట్లు ఉన్నాయి. ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం.. హెల్మెట్లను సమకూర్చుకోవటం 40 శాతం పూర్తి కాగా, 50 శాతం మిగిలి ఉన్నది. ఏవైనా టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్స్ కోసం మిగతా పది శాతాన్ని పక్కకు పెట్టారు. మెరుగైన రక్షణను అందించే, సైనికుడు పలు గాడ్జెట్‌లను ఉపయోగించుకోవటానికి అనువైన ప్రత్యేకమైన బాలిస్టిక్ హెల్మెట్లను పలు ఆర్మీ కమాండోలు, ప్రత్యేక యూనిట్లు సమకూర్చుకున్నాయి. యూఎస్ తయారు చేసిన 'ఎక్స్‌ఫిల్' హైకట్ బాలిస్టిక్ హెల్మెట్‌ను 2020లో పరిమిత సంఖ్యలో భారత్ పొందింది.

భారత సైనికులకు 2018 వరకు మోడల్ 1974 హెల్మెట్లు ఉండేవి. వీటి స్థానంలో.. కాన్పూర్ కేంద్రంగా పని చేసే ఎంకేయూ కంపెనీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లు వచ్చి చేరాయి. మోడల్ 1974 హెల్మెట్ 9ఎంఎం కార్బైన్ నుంచి వచ్చే ఒక రౌండ్‌ను తట్టుకోగలదు. కానీ క్లోజ్ రేంజ్‌లో ఒక ఏకే-47 రౌండ్ ఆ హెల్మెట్‌ను తేలిగ్గా గుచ్చుకుంటూ వెళ్లగలదని నిపుణులు చెప్తున్నారు. 2018లో భారత ఆర్మీ 1.58 లక్షల బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లను ఎంకేయూ నుంచి ఆర్డర్ చేసింది. అయితే, ఇవి ఏకే-47 బుల్లెట్ల నుంచి రక్షణ కల్పించలేదని నిపుణులు, మాజీ సైనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూఎస్, రష్యా, చైనా దేశాల్లో అధునాతన హెల్మెట్లు

యూఎస్.. పర్సనల్ ఆర్మోర్ సిస్టమ్ ఫర్ గ్రౌండ్ ట్రూప్స్ (పీఏఎస్జీటీ) హెల్మెట్ల స్థానంలో అడ్వాన్స్‌డ్ కాంబాట్ హెల్మెట్‌ను తీసుకొచ్చింది. ఇది పీఏఎస్జీటీ కంటే తేలికగా ఉండటంతో పాటు నైట్ విజన్ గాగుల్ (ఎన్‌వీజీ) బ్రాకెట్ హోల్‌ను కలిగి ఉంటుంది. ప్రస్తుతం, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు అడ్వాన్స్‌డ్ హెల్మెట్లను ఉపయోగిస్తున్నాయి. సాంకేతికతను చొప్పిస్తూ తమ దేశ సైనికులకు యుద్ధ రంగంలో పని సులువుగా అయ్యేలా ఈ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా కొత్త వెర్షన్ హెల్మెట్లను యూఎస్ తమ సైనికులకు అందిస్తున్నది. ఆర్మీ టైమ్స్ సమాచారం ప్రకారం.. ఇంటిగ్రేటెడ్ హెడ్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఐహెచ్‌పీఎస్)కు తర్వాతి జనరేషన్ హెల్మెట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఎస్ ఆర్మీ అందుకున్నది. దీని బరువు కేవలం 1.48 కేజీలు. యూఎస్ కొన్ని పీఏఎస్జీటీతో పాటు మోడ్యులర్ ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్స్ హెల్మెట్ (ఎంఐసీహెచ్)ను ఉపయోగిస్తున్నది.

రష్యన్ ఆర్మీ 6బీ47 హెల్మెట్లను వాడుతున్నది. ఇవి బాలిస్టిక్ హెల్మెట్లు. ది స్టీల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తయారు చేసిన బార్స్-ఎల్ హెల్మెట్‌ను కూడా రష్యా ఉపయోగిస్తున్నది. పాత ఎస్ఎస్‌హెచ్-68 హెల్మెట్ల స్థానంలో తీసుకొచ్చిన 6బీ7 హెల్మెట్లనూ రష్యా దళాలు వాడుతున్నాయి. చైనా గతంలో స్టీల్ జీకే80 హెల్మెట్లను వాడింది. ప్రస్తుతం, చైనా మిలిటరీకి టైప్ 21 పీఎల్ఏ హెల్మెట్ అందుబాటులోకి రానున్నది. అలాగే, బాంబ్-ట్రిగ్గరింగ్ బటన్, 'సెల్ఫ్ డిస్ట్రక్ట్' బటన్ వంటి సాంకేతికతను కలిగి ఉన్న అడ్వాన్స్‌డ్ అంటెనా హెల్మెట్లను చైనా కలిగి ఉన్నదని కొన్ని నివేదికలు చెప్తున్నాయి.


నవతెలంగాణ

ఒక దీపం తనంతటికది నిరంతరం వెలుగుతూ ఉంటే తప్ప
అది మరో దీపాన్ని వెలిగించలేదు - రవీంద్రనాథ్ ఠాగూర్

గురువారం 24 అక్టోబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

గురివిందలు



చెప్పేవాడికి వినేవాడు లోకువ..బహుశా ఈ సామెత బీజేపీ రాష్ట్ర నేతలకు బాగా నప్పినట్టుంది. తెలంగాణ ప్రజానీకం తామేం చెప్పినా వింటారు..'ఊ' కొడతారనే ధోరణితో వారు వ్యవహరిస్తున్నారు.ఇటీవల కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న పలు ఘటనలు, వాటికి సంబంధించి కేంద్ర మంత్రులు గంగవరపు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. కేంద్రంలో గత పదకొండేండ్ల నుంచి కుర్చీ మీద కూర్చున్న పార్టీ బీజేపీ.అది 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ముఖ్యంగా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తెస్తాం, ప్రతీ ఒక్క భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పటమనే అంశాల్లో ఒక్కటంటే ఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడు ఈ వాస్తవాలను పక్కనబెట్టి... తగుదునమ్మా అంటూ కిషన్‌రెడ్డి, సంజయ్, రాజేందర్‌లు రాష్ట్ర ప్రభుత్వం మీద దుమ్మెత్తి పోస్తున్నారు. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి రేవంత్ సర్కార్... పెద్ద కితాబులివ్వాల్సిన పనులేవీ చేయకపోయినా మాటమీద నిలబడని బీజేపీ, కాంగ్రెస్ హామీల అమలు గురించి మాట్లాడటం విడ్డూరమే మరి. పైగా కొన్నిచోట్ల చోటు చేసుకున్న ఘటనల ఆధారంగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు చూడటం ఆ పార్టీ నేతల అవకాశవాదానికి పరాకాష్ట.

> తెలంగాణలో బాధ్యతగల ప్రతిపక్షంగా బీజేపీ... రేవంత్ సర్కారుకు నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వటాన్ని ఎవ్వరూ తప్పుబట్టరు. కానీ అందుకు భిన్నంగా కాషాయ పార్టీ వ్యవహారించటం ప్రమాదకరం. ఇక మోడీ ఏలుబడిలో వివిధ రాష్ట్రాల్లో కొనసాగిన మత కల్లోలాలు, ఉద్రిక్తతలు, మైనారిటీలు, దళితులపై దాడులు దేశ ప్రజానీకం మొత్తానికి ఎరుకే. వాటిని మరిచి, ఇప్పుడు ఈటల రాజేందర్... 'ఒక మతానికి' చెందిన ఆత్మగౌరవం దెబ్బతిన్నది, సంస్కృతి, సంప్రదాయాలను మంటగలుపుతున్నారంటూ వ్యాఖ్యానించటం దేనికి సంకేతం.

కొద్దిరోజుల క్రితం కేంద్రమంత్రి బండి సంజయ్... గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు ప్రకటించి, నానా యాగీ చేశారు. వారిపట్ల రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయన తూర్పారబట్టటమేగాక, ఆ పరీక్షను వాయిదా వేసి తీరాల్సిందేనని పట్టుబట్టారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దాకా వెళ్లింది కాబట్టి, దానిపై ఎవరూ మాట్లాడకూడదు. కానీ 2014 ఎన్నికల్లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ గద్దెనెక్కిన ప్రధాని మోడీ... ఇప్పటి వరకూ 22 కోట్ల ఉద్యోగాలివ్వాలి కదా? పదకొండేండ్ల ఏలుబడిలో కొత్త ఉద్యోగాల సంగతి తర్వాత, ఉన్న కొలువులను ఊడబెరుకుతున్నది ఎవరు? రైల్వేలో 25 వేలకు పైగా ఖాళీలుంటే వాటిని భర్తీ చేయకుండా వదిలేస్తున్నది ఎవరు? పైగా స్కేల్ 1 నుంచి 7 వరకు (నాన్ గెజిటెడ్ పోస్టులు) ఉన్న విశ్రాంత ఉద్యోగులతో వాటిని భర్తీ చేస్తున్నారు తప్పితే చదువుకున్న యువతీ యువకులక ఉద్యోగాలిస్తున్నారా? చివరకు సైన్యంలో 'అగ్నివీరుల' పేరిట కాంట్రాక్టు వ్యవస్థను తీసుకొచ్చింది ఇదే బీజేపీ కాదా? ఐదేండ్ల కాంట్రాక్టు పేరుతో ఆ అగ్నివీరులను వాడుకునేది, కనీసం చనిపోతే అధికారిక అంత్యక్రియలకు కూడా నోచుకోకుండా చేస్తున్నది మోడీ సర్కారే కదా? వీటన్నింటికీ బండి సంజయ్ సమాధానమేంటి?

ఇదే సమయంలో తెలంగాణలో జీవో 29లోని తప్పొప్పుల గురించి ఆయన ప్రస్తావించటం ఒక ఎత్తయితే, ఇక్కడ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందంటూ వితండ వాదన చేయటం మరో ఎత్తు. దేశంలోని ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వేషన్లను ఎత్తేసే అధికారం లేదనే విషయం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయిన బండి సంజయ్‌కు తెలియదా? అంటే కచ్చితంగా తెలుసు. కానీ ఉద్దేశపూర్వకంగానే గ్రూప్ అభ్యర్థులను ఆయన తప్పుదోవపట్టిస్తున్నారు. ఇది మరింత దుర్మార్గం.

ఇక గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టిన బీజేపీ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి... ఇక్కడ మాత్రం మూసీనది ప్రక్షాళన, దాని పునరుజ్జీవాన్ని వ్యతిరేకిస్తుండటం హాస్యాస్పదం. పైగా కేంద్ర ప్రభుత్వ పెద్దలే ధర్నాకు పూనుకుంటామంటూ ప్రకటించటం విడ్డూరం. మూసీ బాధితులు, నిర్వాసితుల పక్షాన నిలబడాలన్న చిత్తశుద్ధి నిజంగా ఉంటే, కేంద్రం వారి చేతిలోనే ఉంది కాబట్టి, అక్కడినుంచి చాలినన్ని నిధులిప్పించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడాలి. తెలంగాణలో బాధ్యతగల ప్రతిపక్షంగా బీజేపీ... రేవంత్ సర్కారుకు నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వటాన్ని ఎవ్వరూ తప్పుబట్టరు. కానీ అందుకు భిన్నంగా కాషాయ పార్టీ వ్యవహారించటం ప్రమాదకరం. ఇక మోడీ ఏలుబడిలో వివిధ రాష్ట్రాల్లో కొనసాగిన మత కల్లోలాలు, ఉద్రిక్తతలు, మైనారిటీలు, దళితులపై దాడులు దేశ ప్రజానీకం మొత్తానికి ఎరుకే. వాటిని మరిచి, ఇప్పుడు ఈటల రాజేందర్... 'ఒక మతానికి చెందిన ఆత్మగౌరవం దెబ్బతిన్నది, సంస్కృతి, సంప్రదాయాలను మంటగలుపుతున్నారంటూ' వ్యాఖ్యానించటం దేనికి సంకేతం? తద్వారా ఆయన తెలంగాణ సమాజానికి ఏం సందేశం ఇవ్వదలిచారు?

బీజేపీకి చెందిన ఈ ముగ్గురు అగ్రనేతలు, వారు చేసిన ప్రసంగాలు, వ్యాఖ్యలనుబట్టి వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బలపడేందుకు కమలదళం ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టిందని విదితమవుతున్నది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీలు గెలిచిన ఆ పార్టీ... వచ్చేసారి ఎలక్షన్ల కోసం 'ఏమైనా చేస్తాం, ఎంతకైనా తెగిస్తాం...' అనే రీతిలో వ్యవహరిస్తోంది. ఆ వ్యూహంలో భాగంగానే రెచ్చగొట్టుడే లక్ష్యంగా, ఉద్రిక్తతలు రేపటమే ఉద్దేశంగా దాని కార్యక్రమాలుండటం ఆందోళనకరం, అభ్యంతరకరం. ఇది మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న తెలంగాణకు, హైదరాబాద్‌కు ఎంతమాత్రమూ క్షేమదాయకం కాదు. అందువల్ల 'గురివింద తన నలుపెరగదన్నట్టు' తామిచ్చిన హామీలు, వాగ్దానాల గురించి నోరు మెదపకుండా, ప్రజల దృష్టిని వాటిపై నుంచి మరల్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ పరివారం ఆటల్ని సాగనివ్వొద్దు. అందుకే సాయుధ పోరాట వారసులైన తెలంగాణ పౌరులారా.. తస్మాత్ జాగ్రత్త...

దాన ధర్మాలకు ధనం ఎక్కడిది?




రంగనాయకమ్మ

ఈ మధ్య 'రతన్ టాటా' అనే ఒక 'శత కోటీశ్వరుడైన', కోట్లు, కోట్లు, కోట్లు, కోటాను కోట్లు గల, పారిశ్రామికవేత్త మరణానికి సంబంధించిన వార్తల్ని, అన్ని భాషల పత్రికలూ ప్రచురించడాలూ, టీవీ చానళ్ళు ప్రసారాలు చెయ్యడాలూ, రెండు మూడు రోజులపాటు నిర్విరామంగా జరిగింది. ఆ శత కోటీశ్వరుడి బాల్యం నించీ, వృద్ధాప్యం వరకూ, ఫొటోలతో సహా సమస్త వివరాలనూ, ఆయా కాలాల లెక్కలతో నిరంతరాయంగా ఇచ్చుకుంటూ వచ్చాయి! పాఠకులూ! ఒక మామూలు వార్త కూడా చదవండి! జెంషెడ్‌పూర్‌లోని, టాటా ఉక్కు ఫ్యాక్టరీలో, మొన్న జులై 7న, నరేష్ ప్రసాద్ అనే 32 ఏళ్ళ కార్మికుడు పని ఒత్తిడిలో, క్రేన్ మీద నించీ జారిపడి, చచ్చిపోతే, అది మాత్రం, అతి చిన్న సాధారణ స్థానిక వార్త అయింది! ధనికుడి మరణానికీ, పేదవాడి మరణానికీ, విలువల్లో ఎంత తేడాయో చూడండి! ఆ యువకుడు, ఈ టాటా కంపెనీలో ఉద్యోగంలో ఎందుకు చేరాడంటే, ఈ కంపెనీలో వున్న ఒక పథకం వల్ల. అదేమిటంటే, 'ఒక ఉద్యోగం వదులుకో, ఒక ఉద్యోగం అందుకో!' ('లీవ్ ఎ జాబ్, గెట్ ఎ జాబ్') అనే పథకం అది! ఆ పథకం కింద, ఆ యువ కార్మికుడు ఆ ఉద్యోగంలో చేరాడట! అంటే, అప్పటిదాకా ఆ ఫ్యాక్టరీలో పనిచేస్తూవుండిన అతని తండ్రి, తన ఉద్యోగాన్ని వదులుకుంటే, ఆ ఉద్యోగాన్ని కొడుక్కి ఇచ్చే పథకం- అన్నమాట అది! ఎందుకా పథకం? కొంచెం పెద్ద వయసు వాళ్ళు పోయి, చిన్న వయసు వాళ్ళు వస్తే, పని ఎక్కువగా జరగవచ్చనీ, కొత్త వాళ్ళకి జీతం తగ్గ వచ్చనీ, కూడా!

రతన్ టాటా బాల్యమూ, యవ్వనమూ, విదేశాల్లో అతడి చదువూ, అతడి ప్రేమ ఉదంతమూ, అతడి అమ్మమ్మ చచ్చిపోవడమూ, అతడి జంతు ప్రేమా! ఒకటేమిటి? ఆహా! ఆ గొప్ప గొప్ప జీవిత విశేషాలు ప్రచురించాయి పత్రికలు! వినిపించాయి టీవీలు! అతణ్ణి, 'పారిశ్రామిక రత్నం' అని ఒక పత్రికా, 'పారిశ్రామిక దిగ్గజం' అని మరొక పత్రికా, 'ఆదర్శనీయుడైన పారిశ్రామిక వేత్త' అని ఇంకో పత్రికా...ఇలా శక్తివంచన లేకుండా అనేకానేక ప్రశంసలు కురిపించాయి!

అన్ని పత్రికలూ, ప్రత్యేకించి ప్రస్తావించిన విషయం, ఒకటి వుంది! ఏమిటంటే, రతన్ టాటా, తన ఆదాయంలోనించీ నూటికి అరవై శాతాన్ని 'ధార్మిక కార్యక్రమాలకి' ఖర్చుపెట్టిన 'ధర్మదాత' అని! ఈ వార్తా కథనాల సందర్భంగా తెలిసిన ఇంకో విషయం: ఇటువంటి 'ధర్మదాతలు', ఈ దేశంలోనే కాదు, అమెరికాలో కూడా వున్నారని!

అమెరికా ధర్మదాతల్ని చూడండి! 'ఫోర్డ్' అనే ఒక పేద్ద కార్ల



పెట్టుబడిదారుడు అక్కడ వున్నాడు! అతడు కూడా, తన పేరుతోనే 'ఫోర్డ్ ఫౌండేషన్' అని ఒక సంస్తని పెట్టి, కొన్ని వందల కోట్ల డబ్బుని ప్రపంచవ్యాప్తంగా, 'దాతృత్వ కార్యాలకు' ఖర్చు పెడతాడని సమాచారం! ఈ ఫోర్డ్ దాతృత్వానికి ఒక ఉదాహరణ: ఇక్కడి తెలుగు యూనివర్శిటీకి జానపద సాహిత్యం మీద కొన్ని పనులు జరగడానికి, 1986లో, 25 లక్షలు సహాయం గా ఫోర్డ్ ట్రస్టు ఇచ్చిందట! ఈ విధంగా, ఒక దేశంలో ధనికులు, విదేశీ యూనివర్శిటీలలో జరగవలిసిన పరిశోధనల కోసం దానాలు ఇవ్వడం వల్ల, ఆ పరిశోధనల్లో, ఆ దానాలు పొందే దేశాల్లో దానాలు ఇచ్చే దేశాల పెట్టుబడులు విస్తరించడానికి కావలిసిన సమాచారం దొరుకుతుంది! ఇదీ, ఈ రకం దానాల అర్థం! ఇతర దేశాలనించీ అమెరికాకీ, అమెరికా నించీ ఇతర దేశాలకీ, ప్రొఫెసర్లని కొన్నాళ్ళకోసారి పరిశోధనల పేరుతోనో, మరో పేరుతోనో పంపి, ఫెలోషిప్పులు ఇవ్వడం కూడా ఈ 'ఫోర్డ్ ట్రస్టు' చేస్తుంది.

ఫోర్డే కాకుండా అక్కడ ఇంకో ఇద్దరు ప్రసిద్ధ పెట్టుబడిదారీ దాతలు కూడా వున్నారు. 'రాక్ ఫెల్లర్' అనే మానవుడు, పేద్ద పెట్రోల్ పారిశ్రామికవేత్త! ఇతను కూడా తన పేరుతోనే 'రాక్ ఫెల్లర్ ఫౌండేషన్' అని ఒక సంస్థని పెట్టి, అదే పని చేస్తున్నాడు! యూనివర్శిటీలలో, కొంతమంది ప్రొఫెసర్ల గురించి, 'ఆయనకి ప్రతిష్టాత్మకమైన రాక్ ఫెల్లర్ ఫెలోషిప్ వచ్చిందండీ!' అని గొప్పగా చెపుతుంటారట! ఆ పెట్టుబడిదారుడి పేరు వినికిడి చాలు!

> అమెరికా ధర్మదాతల్ని చూడండి! 'ఫోర్డ్' అనే ఒక పేద్ద కార్ల పెట్టుబడిదారుడు అక్కడ వున్నాడు! అతడు కూడా, తన పేరుతోనే 'ఫోర్డ్ ఫౌండేషన్' అని ఒక సంస్తని పెట్టి, కొన్ని వందల కోట్ల డబ్బుని ప్రపంచవ్యాప్తంగా, 'దాతృత్వ కార్యాలకు' ఖర్చు పెడతాడని సమాచారం! ఈ ఫోర్డ్ దాతృత్వానికి ఒక ఉదాహరణ: ఇక్కడి తెలుగు యూనివర్శిటీకి జానపద సాహిత్యం మీద కొన్ని పనులు జరగడానికి, 1986లో, 25 లక్షలు సహాయంగా ఫోర్డ్ ట్రస్టు ఇచ్చిందట! ఈ విధంగా, ఒక దేశంలో ధనికులు, విదేశీ యూనివర్శిటీలలో జరగవలిసిన పరిశోధనల కోసం దానాలు ఇవ్వడం వల్ల, ఆ పరిశోధనల్లో, ఆ దానాలు పొందే దేశాల్లో దానాలు ఇచ్చే దేశాల పెట్టుబడులు విస్తరించడానికి కావలిసిన సమాచారం దొరుకుతుంది! ఇదీ, ఈ రకం దానాల అర్థం!

పాఠకులారా! ఇంకో దానశీలుణ్ణి చూడండి! అతనే 'కానగీ' అని ఒక పేద్ద ఉక్కు పారిశ్రామికవేత్త! ఇతడూ ధర్మత్ముడే! ఇతని సంస్థా దాన ధర్మాల సంస్థే!

పారిశ్రామిక వేత్తలందరూ ట్రస్టుల్ని తమ పేర్లతో పెట్టి, విద్యా, వైద్యం- ఇంకా అలాంటి సౌకర్యాలకోసం ప్రపంచ వ్యాప్తంగా, ధర్మ కార్యాలు చేస్తూ వుంటారు! ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని పేద దేశాలకి! వీళ్ళ దానాలు, వేలల్లో, లక్షల్లో కాదండీ! ఇంకా నయం, వందల్లో అనుకున్నారు కాదు! కోట్లలో, శత కోట్లలో! ఈ శత కోటీశ్వర పారిశ్రామికవేత్తల గురించి పేపర్లలో చదివి, వాళ్ళ సంపదల్ని చూసీ, వాళ్ళ 'దాతృత్వాల్ని' చూసీ, మూర్ఛలు పడిపోయే వారు వుంటారు!

మొన్న రతన్ టాటా పోయినప్పుడు కూడా ఇదే జరిగింది కదా! పత్రికలూ, టీవీలూ ఎంతెంత ముచ్చట్లలో పడ్డాయి! ఒక ప్రొఫెసరు గారైతే, ఏకంగా, 'రతన్ టాటాని ఆదర్శంగా తీసుకోవాలి' అని బోధించారు. ఎందుకూ ఆదర్శం? దాన ధర్మా ల దాత అట మరి! ఇంతకీ అసలు ప్రశ్నకి పోదాం!

ఈ పెట్టుబడిదారీ దాతలందరికీ, ఆ దానధర్మాలు చేసేసి, కీర్తులు సంపాదించ డానికి కావలిసిన కోట్లూ, శత కోట్లూ ఎలా వచ్చాయం టారూ? ఆ నిజాన్నే ఆ రహస్యాన్నే, మనం తెలుసుకోవాలి! పత్రికల వారికీ, టీవీల వారికీ, అది రహస్యం అవదులెండి! ఎందుకంటే, వీరు కూడా చిన్నా-పెద్దా పరిశ్రమదారులే కదా? కాబట్టి, ఆ రహస్యాన్ని మనం మార్క్సు ద్వారా తెలుసుకోవాలి!

దానధర్మాల్ని అందుకునే 'దరిద్రులు' వుంటేనే కదా, దానాల కోసం అవసరం అయ్యేది? దరిద్రులైన వారు వుంటేనే కదా దానాల్నీ, బిచ్చాల్నీ అందుకునేది? అంటే, ధర్మ దాతలకు కోట్లూ, కీర్తులూ, రావడానికి దరిద్రులు వుండి తీరాలి! నిజానికి సమాజంలో, ఏ 'రహస్యమూ' వుండదు. ప్రతి విషయమూ, సమాజంలో సత్యంగా జరిగేదే! నిత్యం సూర్యోదయం ప్రత్యక్షమైనంత సహజమైన సత్యమే! సమాజంలో నిత్యం దానిని చూస్తూనే వుంటాం. కానీ, దాన్ని గ్రహించం! అందుకే అది రహస్యం! దాన్ని గ్రహించడమే చైతన్యం!

అసలు, ఏ పారిశ్రామికవేత్త అయినా, చేసే పని ఏమిటి? ఆ శత కోట్ల డబ్బు ఎలా సంపాదిస్తారు? ఏదో ఒక 'సరుకు'ని తయారు చేయించి, దాన్ని అమ్మించి, ఎక్కువ డబ్బుని సంపాదిస్తారు!

అమ్మే సరుకుని తయారు చేయించాలంటే మొదట, కొన్ని ముడి పదార్థాలూ, యంత్రాలూ, కావాలి. అవి, ఇతర పనిస్తలాల్లో తయారై వుంటాయి కాబట్టి, వాటిని డబ్బుతో కొనాలి! వాటి కోసం కొంత డబ్బు ఖర్చు పెట్టాలి. దుస్తుల్ని తయారు చేయించడానికి మొదట 'బట్ట' కావాలి కదా? అలాగే, స్టీలుని (ఉక్కుని) తయారు చేయించాలంటే, 'గనుల్లో తవ్వితే' ప్రకృతి సహజంగా దొరికే 'ముడి పదార్థం' యేదో కావాలి! ఇలా, మొదట అవసరం అయిన వస్తువులు, కొత్త ఉత్పత్తి కోసం కావలిసిన వాటిని, ఇతర చిన్నా పెద్దా పని స్తలాల నించి కొనవలసి వస్తుంది. ఇవి, కొత్త సరుకు తయారీ కోసం మొదట కావలసిన 'ఉత్పత్తి సాధనాలు.' ఈ సాధనాలు వుంటేనే కొత్త సరుకుని తయారు చెయ్యడం జరుగుతుంది. 'కొత్త సరుకు' వాళ్ళు, వాటి కోసం కావలిసిన సాధనాల్ని కొనడానికి పెట్టే డబ్బు, మొదటి ఖర్చు!

> ఈ పెట్టుబడిదారీ దాతలందరికీ, ఆ దానధర్మాలు చేసేసి, కీర్తులు సంపాదించ డానికి కావలిసిన కోట్లూ, శత కోట్లూ ఎలా వచ్చాయంటారూ? ఆ నిజాన్నే ఆ రహస్యాన్నే, మనం తెలుసుకోవాలి! పత్రికల వారికీ, టీవీల వారికీ, అది రహస్యం అవదులెండి! ఎందుకంటే, వీరు కూడా చిన్నా-పెద్దా పరిశ్రమదారులే కదా? కాబట్టి, ఆ రహస్యాన్ని మనం మార్క్సు ద్వారా తెలుసుకోవాలి! దానధర్మాల్ని అందుకునే 'దరిద్రులు' వుంటేనే కదా, దానాల కోసం అవసరం అయ్యేది? దరిద్రులైన వారు వుంటేనే కదా దానాల్నీ, బిచ్చాల్నీ అందుకునేది? అంటే, ధర్మ దాతలకు కోట్లూ, కీర్తులూ, రావడానికి దరిద్రులు వుండి తీరాలి! నిజానికి సమాజంలో, ఏ 'రహస్యమూ' వుండదు. ప్రతి విషయమూ, సమాజంలో సత్యంగా జరిగేదే! నిత్యం సూర్యోదయం ప్రత్యక్షమైనంత సహజమైన సత్యమే! సమాజంలో నిత్యం దానిని చూస్తూనే వుంటాం. కానీ, దాన్ని గ్రహించం! అందుకే అది రహస్యం! దాన్ని గ్రహించడమే చైతన్యం!

తర్వాత, ఆ సాధనాలతో కొత్త సరుకుని తయారు చేయించాలి. ఇక్కడ కొత్త సరుకుని 'స్టీలు' (ఉక్కు) అనుకుందాం. దీన్ని తయారు చేయడానికి, ఆ పని తెలిసిన, ఆ ఇంజనీరింగు ప్రాక్టీసులు తెలిసిన పనివారు కావాలి! యజమానుల ఆర్డర్ల ప్రకారం పని చేయవలిసిన వారు, యజమాని దృష్టిలో పనివాళ్ళే (వర్కర్స్)! ఆ పనివారిని 'కార్మికులు' అనీ, 'శ్రామికులు' అనీ, అనవచ్చు.

స్టీలుని చేయించే పరిశ్రమ దారుడు, ఆ పనిచేసే వారికి 'జీతాలు' ఇవ్వాలి! పరిశ్రమ దారుడు చేయించే కొత్త సరుకు కోసం, ఈ జీతాలది రెండో ఖర్చు!

మొదట సాధనాలూ, తర్వాత జరిగే కొత్త సరుకూ, ఈ రెండూ శ్రమలతో తయారైనవే అయినా, సాధనాలు అప్పటికే తయారై వచ్చినవి కాబట్టి, వాటిని చేసిన శ్రమకి, మార్క్సు ప్రకారం, 'పాత శ్రమ'గా లెక్క. వాటితో జరిగే కొత్త సరుకుని చేసిన శ్రమకి 'కొత్త శ్రమ'గా మరో లెక్క. శ్రమలకు 'పాతా-కొత్తా' లెక్కలు ఎందుకంటే, 'కొత్త సరుకు' కోసం 'మొత్తం శ్రమ' ఎంతో, ఆ మొత్తం శ్రమకి మొత్తం విలువ ఎంతో తెలియడానికి!

ఇక, తర్వాత చూడవలిసింది ఏ పారిశ్రామికవేత్త అయినా చేసే పని ఏమిటి-అని! ఏదో ఒక 'కొత్త సరుకుని తయారు చేయించి- ఇక్కడ ఉక్కునే అనుకున్నాం- తయారైన సరుకుని అమ్మించి, దాని కోసం పెట్టిన ఖర్చుల కన్నా 'ఎక్కువ డబ్బు'ని సంపాదించాలన్నదే పారిశ్రామికవేత్తల ఏకైక ఆదర్శం! ఆదర్శనీయులు కదా?

ఆ 'ఆదర్శాన్ని' నెరవేర్చేటట్టుగానే, పరిశ్రమల ద్వారా 'ఎక్కువ డబ్బు' కూడా వస్తుంది!

ఇదేమిటి! ఇదెలా జరుగుతుంది? కొత్త సరుకు కోసం పెట్టే ఖర్చులు 2 మాత్రమే కదా? ఆ 2 శ్రమల వల్లే, కొత్త సరుకు తయారవుతుంది కదా? ఆ 2 శ్రమల కోసం జరిగిన 2 ఖర్చులతో తయారైన సరుకుని అమ్మితే, ఆ 2 ఖర్చుల కోసం పెట్టిందే వెనక్కి వస్తుంది గానీ, అంత కన్నా ఎక్కువ కూడా వస్తుందా? ఇదెలా జరుగుతుంది?

అదెలా జరుగుతుందో ఈ నాడైతే మనం తెలుసుకోవచ్చు. కానీ, నిన్న మొన్నటిదాకా, అది ఒక రహస్యమే! ఆ రహస్యం 150 సంవత్సరాల కిందట ఒక మేధావి కృషి ద్వారా బైటపడింది! ఆ మేధావి పేరు 'కార్ల్ మార్క్స్'.

(ఇంకావుంది)

మనిషిగా అన్నం తింటున్నప్పుడు
దేశానికి కన్నం వేస్తున్న
దోపిడి దొంగల్ని చూడవా...?
దోపిడి అనంతమైతే
నీకు నాకే కాదు
రాసులు పండించే
రైతుకూ అన్నం దక్కదు.
చేతికి నోటికి మధ్య ముద్దను
'ఆ' గద్దలే తన్నుకుపోతాయి
మార్కెట్ మాయను
గమనించకపోతే ఎలా...?
ఎంతకాలం మూఢనమ్మకాల
ప్రాప్తకాలజ్ఞత
ముసుగు దుప్పట్లో దాక్కుంటావు?
పోరాట చేతనం లేని

నిస్సార బతుకు



నిర్జీవ నిస్సార బతుకు
అసహ్యం కాదా...?
నీవు సరే! నీ పిల్లలకూ
అదే గతా..?
ఆ లేత కళ్లల్లోకి సూటిగా చూడు.
నీ భయాన్ని పిరికితనాన్నే
నూరి పోస్తున్నావుగా...
జీవితం పట్ల ఆశను ధైర్యాన్ని
చిగురింప చేయవా...?
ప్రాపంచిక దృక్పథం కరువైతే
కడకు మిగిలేది కటిక భయమే!
పోరాట వెలుగు కనలేకపోతే
అలముకునేది అంధకారమే!

- కె.శాంతారావు,
9959745723

శామ్‌సంగ్ కార్మికుల పోరాటం చారిత్రాత్మక విజయం



జి.బాలసుబ్రహ్మణ్యం
9490300758

'పోరాడితే పోయేదేమీ లేదు..బానిస సంకెళ్ల తప్ప'-కార్ల్‌మార్క్స్ చెప్పిన మాటల్ని స్ఫూర్తిగా తీసుకున్నారు ఈ కార్మికులు. తమిళనాడులోని కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూర్‌లోని బహుళజాతి సంస్థ అయిన శామ్‌సంగ్ కంపెనీలో 37 రోజుల పాటు జరిగిన చారిత్రాత్మక సమ్మెలో అద్భుత విజయం సాధించారు. వేతనాలు పెంచాలని, యూనియన్‌ను గుర్తించాలని సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన ప్రారంభమైన ఈ సమ్మెకు సీఐటీయూ నాయకత్వం వహించింది. సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి, పోరాడుతున్న కార్మికులను లోబరుచుకోవటానికి, బెదిరించటానికి యాజమాన్యం విశ్వప్రయత్నాలు చేసింది. ప్రభుత్వం, పోలీసులు ప్రత్యక్షంగా యాజమాన్యానికి మద్దతు ప్రకటించారు. సమ్మెలో ఉన్న కార్మికులు చెక్కు చెదరని విశ్వాసంతో, సడలని పట్టుదలతో పోరాటాన్ని కొనసాగించటంతో 'శామ్‌సంగ్ యాజమాన్యం, తమిళనాడు ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చాయి. కార్మికులతో చర్చలు జరిపి..అన్ని డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని, సమ్మెలో ఉన్న ఏ ఒక్క కార్మికుడిని తొలగించబోమని, కక్ష సాధింపులకు పూనుకోబోమని రాతపూర్వక సమాధానం అందించాయి. దీంతో కార్మికులు సమ్మెను విరమించి అక్టోబర్ 17వ తేదీ నుంచి విధులకు హాజరయ్యారు.

దక్షిణ కొరియాకు చెందిన శామ్‌సంగ్ కంపెనీకి భారతదేశంలో ఉన్న రెండు ప్లాంట్లలో ఒకటి తమిళనాడు కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు సమీపంలోని శృంగేరి చత్రంలో వుండగా, రెండవది ఢిల్లీ సమీపంలోని నోయిడాలో వున్నది. శామ్‌సంగ్ ఆదాయం రూ.5 లక్షల కోట్లు. ప్రపంచమంతటా ఏడాదికి రూ.4 లక్షల కోట్ల ఆదాయం వస్తే భారతదేశం నుండి రూ.లక్ష కోట్లు వస్తుంది. 30 శాతం వస్తువులు భారతదేశంలోనే ఉత్పత్తవుతాయి. ఇక్కడి నుంచి 15 దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఇక్కడ అత్యంత అధునాతన ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు ఉత్పత్తి అవుతాయి. 1700 మంది పర్మినెంట్, మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఇందులో పనిచేస్తారు. మొత్తం 4700 మంది పదిహేడేండ్లుగా పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ ఏ ట్రేడ్ యూనియన్ లేదు. అధిక పని గంటలు, పని భారం, జీతాల కోత, తక్కువ జీతం, కక్ష సాధింపులను కార్మికులు ఆత్మగౌరవం చంపుకుని ఇప్పటిదాకా భరించారు. తక్కువజీతం అది కూడా అసమానతలతో కూడిన వేతనాలు ఇస్తున్నారు. ఒకే సర్వీసు ఉన్నప్పటికీ యాజమాన్యం ఇష్టం వచ్చిన రీతిన జీతాలు చెల్లిస్తున్నది. విశ్రాంతి గదులు లేవు. బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు అంత కన్నా లేవు.

ప్రపంచంలో వారానికి 35 పని గంటల పని విధానం ఉండగా భారతదేశంలో 48 గంటలు, దక్షిణ కొరియాలో 42 గంటలుగా ఉంది. కానీ ఈ కంపెనీలో 66 గంటలుగా ఉంది. వారాంతపు సెలవులు, పండుగలు, జాతీయ సెలవులు లేనే లేవు. ఇక్కడ రెండు షిప్టులు వుంటాయి. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుండి ఉదయం 8 గంటల వరకు 12 గంటలుగా ఉంటుంది. హఠాత్తుగా డబుల్ డ్యూటీ వేస్తారు. ఏకబిగిన 24 గంటల పని చేయమంటారు. ఇది చాలా కష్టంగా ఉంటుందని కార్మికులు చెబుతున్నారు.

శ్రీపెరంబదూర్ చుట్టుపక్కల గ్రామాల నుండి కార్మికులు పనికి వస్తుంటారు. ఉదయం 8 గంటల షిఫ్టుకు రావాలంటే 5 గంటలకే నిద్ర లేవాలి. రాత్రి 8 గంటలకు దిగి తమ గ్రామాలు చేరాలంటే రాత్రి 10 దాటుతుంది. పడుకునేటప్పటికి 11 గంటలు దాటుతుంది. కేవలం 5 గంటలు మాత్రమే నిద్రపోవ డానికి ఉంటుంది.ఈ కారణంగా కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు.ఒక వస్తువును బిగించడానికి 'రోబో'కి 9.3 నిమిషాలు కేటాయిస్తారు. అదే కార్మికుడికి అయితే 9 నిమిషాలు మాత్రమే. రెప్పపాటున ఏ మాత్రం ఏమారినా మిషన్ ముందుకు వెళ్లిపోతుంది. అలా వెళ్లిపోయిందంటే నెగిటివ్ మార్కులు వేసి జీతాలలో కోత విధిస్తారు. కనురెప్ప వేయకుండా 12 గంటలు పనిచేయాలి. సిబ్బంది కొరత ఉంటుంది. సహాయకులుండరు. కాలకృత్యాలు కూడా బిగపట్టాల్సిందే. రోబోకంటే స్పీడుగా కార్మికులతో పని చేయించుకుంటున్నారు.

దక్షిణకొరియాలో శిక్షణ పూర్తి చేసుకుని పదహారేండ్ల సర్వీసు ఉన్న స్కిల్డ్ కార్మికుడి జీతం రూ.26 వేలు. కాగా దక్షిణ కొరియా సియోల్‌లో పనిచేస్తున్న శామ్‌సంగ్ ఉద్యోగి రూ. జీతం 3 లక్షలా 50 వేలు. యాజమాన్యం ఇష్టానుసారంగా జీతాలు నిర్ణయిస్తుంది. జర్మనీలో ఒక ఉద్యోగికి ఇచ్చే సంవత్సర జీతంతో ఇద్దరు అమెరికన్లకు, నలుగురు యూరోపియన్లకు.. అదే ఇండియన్లు అయితే 118 మందికి చెల్లిస్తారు. భారతీయ కార్మిక శక్తి అంత చౌక. అందుకే దోపిడీ చేయడానికి ఈ కార్పొరేట్ సంస్థ ఇక్కడకు వచ్చింది. గత పదిహేడేండ్లుగా ఈ కష్టాలు భరించలేని శామ్‌సంగ్ కార్మికులు తమ బతుకు భద్రత కోసం సీఐటీయూ నాయకత్వాన 'శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్'ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కార్మిక సంఘం పెట్టుకోవడానికి యాజమాన్యం ఒప్పుకోలేదు. పైగా సీఐటీయూ అసలు అవసరం లేదని కార్మికులను గదులలో నిర్బంధించి బెదిరించింది. యూనియన్ రిజిస్టర్ కాకుండా అనేక ఆటంకాలు కల్పించింది. పేరులో శామ్‌సంగ్ ఉన్నందున యూనియన్ ఏర్పాటు చెల్లదన్నారు. తమకు పేటెంట్ హక్కు ఉందని, కార్మిక చట్టాలు వర్తించవని అభ్యంతరం చెప్పారు. వస్తువులపై పేటెంట్ గానీ చట్టాలపై వర్తించదని సీఐటీయూ వాదించింది. సంఘానికి సీఐటీయూ కార్యాలయ చిరునామా ఉందని, అది రాజకీయ కార్యాలయంగా ఉందని, తమ సంస్థలో రాజకీయ పార్టీలకు ప్రవేశం లేదని చెప్పారు.

యూనియన్‌లో ఫ్యాక్టరీ కార్మికులే ఉండాలి, బయటి వారు ఉండకూడదన్నారు. బయటి వ్యక్తులకు గాని, నాయకులకు గాని, సంఘా లకు గాని అనుమతి లేదని ఆక్షేపించారు. భారత కార్మిక చట్టాలు-1926, సెక్షన్ 22 ప్రకారం 1/3 వంతు మంది (ఐదుగురు) బయటి వారు ఉండవచ్చు. 1929లో ఏర్పడిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐ.ఎల్.ఓ) ప్రకారం కూడా ఉండవచ్చు. అయితే శామ్‌సంగ్ యాజమాన్యం భారత కార్మిక చట్టాలను, అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించింది. దీన్ని ప్రశ్నించాల్సిన లేబర్ అధికారులు కంపెనీకి ఊడిగం చేస్తూ 45 రోజులు దాటినా కాలయాపన చేశారు. కాంచీపురం జిల్లా కలెక్టర్ అతి నిరంకుశంగా వ్యవహరించారు.

సంబంధం లేని పోలీ సులు శామ్‌సంగ్‌కు దాసోహమై కార్మికులపట్ల అమానుషంగా వ్యవహరించారు. రిజిస్ట్రేషన్ చేయాలని సంఘం కోర్టును ఆశ్రయించింది. కోర్టు కూడా రెండు వారాలు శామ్‌సంగ్ యాజమాన్యానికి వ్యవధి ఇచ్చింది. ప్రభుత్వంపై కార్మిక సంఘం కేసు వేస్తే ప్రభుత్వ న్యాయవాది శామ్‌సంగ్ యాజమాన్యాన్ని థర్డ్ పార్టీగా అడ్డుకోమని కోరడం హాస్యాస్పదం.గత్యంతరం లేని పరిస్థితులలో గత నెల తొమ్మిదవ తేదీ నుండి కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. 1700 మంది కార్మికులలో 1550 మంది సమ్మెలో ఉన్నారు. యాజమాన్యం యూనియన్‌లో చీలికలు తెచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేయగా ఫలించలేదు. తమకు తొత్తులుగా ఉండే ఒక గ్రూపుతో యూనియన్ పెట్టించింది. ప్లాంట్‌కు సమీపంలో శిబిరం వేసుకుని శాంతియుతంగా సీఐటీయూ పోరాడుతుంటే, తొత్తు యూనియన్ సమ్మె విచ్ఛిన్నానికి డ్యూటీలు చేసింది.

ఈ న్యాయమైన పోరాటానికి డి.ఎం.కె మినహా కూటమిలోని అన్ని పక్షాలూ బలపరిచాయి. అన్ని కార్మిక సంఘాలూ మద్దతు తెలిపాయి. రాష్ట్రంతో పాటు దేశమంతటా నిరసన కార్యక్రమాలు జరిగాయి. జిల్లా కలెక్టర్, ప్రభుత్వం, కార్మిక శాఖ సమస్య పరిష్కారానికి పూను కోకుండా శామ్‌సంగ్ యాజమాన్యం మెప్పుకోసం సమ్మెలో ఉన్న 640 మంది కార్మికులను అరెస్టు చేశాయి. తమిళనాడు సీఐటీయూ అధ్యక్షులు ఎ.సౌందర్యరాజన్, శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇ.ముత్తుకుమార్‌లను అరెస్టు చేసి నిర్బంధించారు. అర్ధరాత్రి నాయకుల ఇళ్ల దగ్గరకు వెళ్లి వారి కుటుంబాలను, స్త్రీలను, పిల్లలను, వృద్ధులనూ కూడా భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యంగా నాయకులను పోలీసులు తీసుకెళ్లారు. సమ్మె చేస్తున్న కార్మికుల పోరాట శిబిరాన్ని కూల్చివేశారు. అది ప్రభుత్వ భూమి..అందుకే ధ్వంసం చేశామన్నారు. వాస్తవానికి ఆ స్థలం ఒక ప్రయివేటు యజమానిది. తను ఇష్టపూర్వకంగా ఇచ్చానని, నా స్థలంలో ఉన్న శిబిరాన్ని కూల్చడం చట్ట విరుద్ధమని, రౌడీల కంటే ఘోరంగా పోలీసులు చేయడం దుర్మార్గమని చివాట్లు పెట్టారు. సోదర సంఘాలు నిధి సహాయం చేశాయి. కోర్టు కూడా శాంతియుతంగా కార్మికులు పోరాటం చేయవచ్చన్నది. దాంతో ప్రభుత్వం కొత్త అవతారమెత్తింది. ముగ్గురు మంత్రులతో కమిటీ వేసింది. వీరు సమ్మె చేస్తున్న కార్మికులతో కానీ, వారి నాయకులైన సీఐటీయూ వారితో కానీ మాట్లాడలేదు. మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసుకున్న తొత్తు యూనియన్ నేతలతో మంతనాలు జరిపారు. అంతటితో ఆగకుండా -అగ్రిమెంట్ (18/1) చేసుకున్నారు. మంచి ఒప్పందం జరిగిందని, సిఐటియు యూనియన్ రిజిస్ట్రేషన్ కోర్టులో ఉందని, డిమాండ్లన్నిటినీ యాజమాన్యం ఉదారంగా ఒప్పేసుకున్నదని-ప్రకటించారు. ఇది బ్రహ్మాండమైన విజయమని కార్మికులు సంతోషంగా ఉరుకులు వేసుకుంటూ పనిలో చేరిపోయారని అబద్ధపు పత్రికా ప్రకటన చేశారు.

నిజానికి ఏ ఒక్క కార్మికుడూ సమ్మె విరమించలేదు. పోరాట శిబిరాన్ని వీడలేదు. తామే కాకుండా పిల్లలతో సహా తమ కుటుంబ సభ్యులను పోరాటంలోకి దింపారు. వీరికి మద్దతుగా ఇరుగు పొరుగు వారు, స్నేహితులు, వారి కుటుంబాలు పాల్గొన్నాయి. కార్మికుల కుటుంబ సభ్యులు కాంచీపురం బజారులో నిరసన తెలపడానికి పూనుకున్నారు. అక్కడ పోలీసులు అనుమతి లేదన్నారు. అడ్డగించారు. అందరూ ప్లాంట్ సమీపంలోని పోరాట శిబిరం వద్ద పాల్గొన్నారు.భారత రాజ్యాంగాన్ని, సార్వభౌమాధికారాన్ని కాపాడతామని ప్రమాణం చేసిన మంత్రులు..ముద్దాయి శామ్‌సంగ్ పక్షాన నిలవడం ద్రోహం చేయటమే. ప్రభుత్వ పెద్దలు, బీజేపీ, శామ్‌సంగ్ యాజమాన్యం అదే పనిగా దాడి చేస్తున్నా కార్మికులు ఏ మాత్రం సంకోచించకుండా, వీరోచితంగా పోరాడారు. శామ్‌సంగ్ కార్మికుల పోరాటానికి తమిళనాడు రాష్ట్ర ప్రజల నుంచేగాక, దేశ వ్యాప్తంగా మద్దతు లభించింది. దాంతో శామ్‌సంగ్ కంపెనీ ఎట్టకేలకు దిగొచ్చి కార్మికులు సంఘం పెట్టుకోవడానికి అంగీకరించి, వారి డిమాండ్లపై చర్చించేందుకు సిద్ధమైంది. విజయం సాధించిన కార్మిక వర్గానికి జేజేలు.



పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో చిరుమర్రిలో పశువైద్య,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు బుధవారం గాలికుంటు నివారణ వ్యాధి టీకాల పంపిణీతోపాటు, గోపాలమిత్ర పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 44 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు నిర్వహించి, 22 గేదెలకు సాధారణ వైద్య చికిత్సలు చేశామని పశువైద్యాధికారి పి.అశోక్ తెలిపారు. కార్యక్రమంలో డిఎల్డిఏ ఏడి, వైరా ఈఓ డాక్టర్ కొర్లకుంట కిషోర్, వనంవారికిష్టాపురం పశు వైద్యాధికారి మన్యం రమేష్‌బాబు, గోపాలమిత్ర సూపర్వైజర్ జె.శంకరయ్య, పశు వైద్య సిబ్బంది ఆర్.బాలాజీ సింగ్, అనిత, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మం

సెప్టెంబర్ 21న కొణిజర్ల పోలీస్ స్టేషన్ విధినిర్వహణలో ఉన్న 2000 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ లోకేష్ అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులకు ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతు సహాయంగా 2 లక్షల ఆర్థిక సహాయాన్ని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చేతుల మీదుగా అందించారు. అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా దూరమయ్యాడం...ఆయన్నే నమ్ముకున్న ఆ కుటుంబం రోడ్డున పడవద్దని... తోటి మిత్రులు ఒక్కటయ్యారు. ఆ కుటుంబానికి తామున్నామని అండగా నిలిచారు. తలా కొంత చేయి వేసి పిల్లల భవిష్యత్తుకు తమవంతు భరోసా కల్పించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం ఛైర్మెన్ కూసంపూడి మహేశ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పట్టణంలో కుక్కల బెడద తదితర సమస్యలపై సమావేశంలో చర్చించారు. సమస్యలను అధిగమించడానికి గౌరవ సభ్యుల నుంచి సూచనలు, సలహాలను ఛైర్మెన్ మహేశ్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కమిషనర్ మంద రవిబాబు, కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, ఎస్కే చాంద్‌పాషా, కంటె నాగలక్ష్మి, అమరవరపు విజయనిర్మల, మారుతి సూరిబాబు, మేకల భవాని, ఎండీ అనీస్, నాగుల్‌మీరా, గుండ్ర రాఘవేంద్ర, ఎండీ సలీమా ఖాతూమ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం తోపుడబండి ఫౌండేషన్ అధినేత సాధిక్ ఆలీ విద్యార్థిని, విద్యార్థులకు సుమారు 10వేల విలువగల టై, బెల్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసిరెడ్డి నాగ పద్మ, ఉపాధ్యాయులు వరక రామారావు, రమాదేవి, అనితకుమారి, ఫణిశెంకర్ రెడ్డి, వీరవేణి పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు

నవతెలంగాణ-ముదిగొండ

పత్తి కొనుగోలు కేంద్రాన్ని(సిసిఐ) రైతులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలో న్యూలక్ష్మీపురం ఉషశ్రీ కాటన్ మిల్లులో బుధవారం రెవిన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డితో కలిసి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులు, పత్తి మిల్లు యాజమాన్యం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలన్నారు. దళారులను రైతులు నమ్మకుండా నేరుగా పత్తి కొనుగోలు కేంద్రంకు పత్తిని తీసుకెళ్లి క్రయవిక్రయాలు చేసుకొని మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ముదిగొండ వ్యవసాయ అధికారులు మందుల రాధ, నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల రంగారావు, బెజవాడ వంశీ, జూలకంటి సంజీవరెడ్డి, కట్టకూరి ఉమారావు, వాకా వెంకటేశ్వరరెడ్డి, వాకదాని కన్నయ్య, ఎస్డి రఫీ, దేవరపల్లి అనంతరెడ్డి, ఏలూరి హనుమంతరావు, ఊరుకొండ రాజు, తోటమల్ల ఉదయ్ రాజు, చిలకల రామకృష్ణ, పంజాల రాజేష్, సిసిఐ అధికారులు, పత్తి మిల్లు ఓనర్ చెరుకూరి శ్రీధర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆటోను దగ్ధం చేసిన దుండగులు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోకు నిప్పంటించారు. ఆటో ఫ్రంట్ పార్ట్ కాలిపోయింది. కారుమంచి శివ తన ఆటోను మంగళవారం రాత్రి ఇంటిముందు నిలిపి నిద్రిస్తున్న సమయంలో, అర్ధరాత్రి ఆటో కాలిపోతున్నదని ఇరుగుపొరుగువారు లేపడంతో లేచి చూడగా ఆటో దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందంటూ బుధవారం తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

అంబులెన్స్, లారీ ఢీ

ఆరుగురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-తల్లాడ

అంబులెన్స్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తల్లాడ బస్టాండ్ అవుట్ గేటు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఏపీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ళ గ్రామానికి చెందిన సిహెచ్ కనకమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ప్రైవేటు అంబులెన్స్‌లో తిరువూరు నుండి ఖమ్మం వైద్యం కోసం తీసుకొని వెళ్తుండగా తల్లాడ బస్టాండ్ వద్ద లారీని అధిగమించే క్రమంలో డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న గ్రామీణ వైద్యుడు డి.గోపి, సిహెచ్ కోటయ్య, కనకమ్మ, కృష్ణమ్మ, కృష్ణవేణి, అంబులెన్స్ డ్రైవర్ ఎస్ ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డారు, సంఘటన స్థలానికి ఎస్సై బి.కొండల్‌రావు చేరుకొని క్షతగాత్రులను తల్లాడ, ఏన్కూర్ 108 వాహనాలలో ఖమ్మం తరలించి, అంబులెన్సును జెసిబి సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అర్ధగంట వరకు రాష్ట్రీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్‌లు పంపిణీ

నవతెలంగాణ- కల్లూరు

ఇటీవల డీఎస్సీ ద్వారా మండలానికి ఎంపికైన 42 మంది నూతన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్లు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయుల సహకారంతో నూతన ఉపాధ్యాయులకు అందిస్తున్న సేవల్లో భాగంగా సర్వీస్ సర్వీస్ రిజిస్టర్లు ఆయా పాఠశాలకు వెళ్లి బుధవారం యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు అందించారు. అదే విధంగా ఎంప్లాయ్ ఐడి కోసం ఐడి అప్లికేషన్లు పూర్తి చేయించి కాంప్లెక్స్‌లో ఇవ్వడం జరిగింది. వాటికి కాంప్లెక్స్ హెచ్‌ఎంతో కవరింగ్ లెటర్ రాయించి, ఎస్‌టిఓ మరియు డిటిఓకి సబ్మిట్ చేసి ఎంప్లాయి ఐడి తీసుకురావడం జరుగుతుందని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాయల్ నాగేశ్వరరావు, కే.విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బి.సోమ్లానాయక్, కోశాధికారి వి.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.సుధీర్, సీనియర్ కార్యకర్తలు జూపల్లి వెంకటేశ్వర్లు, టి.రాంబాబు, టి.రవికుమార్, చావా.శ్రీనివాసరావు, పొంగా శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు...

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తృతీయ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగత వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ ముఖ్యఅతిథిగా కూసుమంచి జూనియర్ కళాశాల కూసుమంచి ప్రిన్సిపాల్ కె.శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ... విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధి జరగాలంటే విలువలతో జీవించాలని, జీవితంలో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలంటే కళాశాల స్థాయిలోనే బీజం పడి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థినులు ప్రణాళికతో కష్టపడి చదువుతూ విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలన్నారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థినులు "మిస్ ఫ్రెషర్స్" పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుపొందారు. శ్లోకాలు, పాటలతో విద్యార్థినులు చేసిన నృత్యాలు ఎంతో అలరించాయి. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్లో కళాశాల విద్యార్థినులు పాల్గొని అనేక బహుమతులను గెలుపొందారు. ఆ బహుమతులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ విజేతలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఆ దొంగల టార్గెట్ 'దేవాలయాలే'

- గుళ్లో గంటలను సైతం వదలరు
- వెంబడించి దొంగలను పట్టుకున్న ఖాకీలు
- కిరీటాలు, శఠగోపాలు, ఆభరణాలు, రూ. 1.50లక్షల నగదు, 2 బైకులు స్వాధీనం
- విలేకర్లకు వివరించిన ఏసీపీ రఘు, సీఐ ముత్తులింగం

నవతెలంగాణ-సత్తుపల్లి



దేవాలయాల్లో చోరీలకు పాల్పడటమే ఆ దొంగల టార్గెట్. గుళ్లలో చోరీ చేశారంటే అక్కడ దేన్నీ వదలరు. ఆఖరికి గుడిలోని గంటను సైతం హాంఫట్టే. ఆరు దొంగలు వారు చేసిన చోరీ ఘటనలను ఏసీపీ అనిశెట్టి రఘు తన కార్యాలయంలో మంగళవారం రూరల్ సీఐ ఎంఎల్ ముత్తులింగంతో కలిసి విలేకర్లకు వివరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జల్సాలకు అలవాటుపడిన ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, పరిసర గ్రామాలకు చెందిన ఆరుగురు యువకులు గత కొంత కాలంగా గుళ్లను టార్గెట్ చేసుకొని వాళ్ల చోరకళతో ఎవరికి అనుమానంగా రాకుండా ఉమ్మడి రాష్ట్రంలో గుళ్లలోనే చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 28న వేంసూరు మండలం వెంకటాపురంలోని అంకమ్మతల్లి గుడి తలుపులు పగులగొట్టి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి అమ్మవారి నాలుగు కిరీటాలు, వెండిగిన్నె, చెమ్బా, బంగారు గొలుసు, సూత్రాలు, హుండీలోని నగదును అపహరించుకుపోయారు. ఇది ఆరోజు జరిగిన చోరీ ఉదంతం కాగా మంగళవారం (22న) వేంసూరు మండలంలోని వెంకటాపురంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో చోరీ చేసేందుకు రాత్రి 8గంటల సమయంలో ఆ దొంగల ముఠా మోటారుసైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వేంసూరు ఎస్సై వీరప్రసాద్ తన సిబ్బందితో ఆలయ ప్రాంతానికి వెళ్లగా పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి మరీ పారిపోతున్న ఎల్లబోయిన గోపీ, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ (కిట్టు),తో పాటు మరో బాల నేరస్తుడుతో సహా ఆరుగురిని పట్టుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా వాళ్ల వెంకటాపురం అంకమ్మ గుడిలో చోరీతో సహా ఇంతకు ముందు ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడ్డారో పూసగుచ్చినట్లు పోలీసులకు వివరించారు. దొంగలు తెలిపిన వివరాల ప్రకారం పెనుగంచిప్రోలులో దేవాలయ సమీపంలో వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారని, చెడు వ్యసనాలను అలవాటుపడ్డారు. ఇదిలా ఉంటే గతంలో గోపీ, బాల నేరస్తుడు కలిసి మధిర, బోనకల్లు, వత్సవాయి ప్రాంతాల్లోని గుళ్లలో గంటలు, హుండీలు పగులగొట్టి నగదును అహరించుకుపోతున్న క్రమంలో ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదవడం జరిగాయి. చోరీ కేసుల్లో గోపీ జైలుకి వెళ్లడం జరిగింది. అచ్చంపేట ఏరియాలో బంధువులు ఉండటం వల్ల సత్తెమ్మతల్లి ఆలయం గురించి గోపీకి అవగాహన ఉంది. చెడు వ్యవసనాలకు అలవాటుపడిన గురవయ్య, శివ, రాము, కృష్ణ, బాల నేరస్తుడితో సహా ఐదుగురిని కలుపుకున్న గోపీ ఆగస్టు 20న రెండు మోటారు సైకిళ్లపై అచ్చంపేట అటవీ ప్రాంతంలో ఉన్న సత్తెమ్మతల్లి గుడి తలుపులు పగులబొట్టి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి అమ్మవారి కిరీటాలు, వెండి శఠగోపం, బంగారు ఆభరణాలు, హుండీలు పగులగొట్టి నగదును దొంగిలించారు. దొంగిలించి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకోగా కరిగించిన వెండి, హుండీల్లో దొంగిలించిన రూ. 1.50లక్షలు పెనుగంచిప్రోలులోని తన ఇంట్లో గోపీ దాచి ఉంచాడు. ఎస్సై వీరప్రసాద్ సిబ్బందితో పెనుగంచిప్రోలు వెళ్లి 3.3 కిలోల వెండి ముద్ద, నగదును రూ. 1.50లక్షలతో పాటు రూ. 20వేలు విలువ చేసే సత్తెమ్మతల్లి బంగారు సూత్రాలు, 2 పల్సర్ మోటారు సైకిళ్లు, దొంగతనాలకు ఉపయోగించే కటింగ్ ప్లేయర్, ఇనుపరాడు, స్క్రూ డ్రైవర్‌ను స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు. ఈ కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందికి ఏసీపీ రఘు నగదు పారితోషికాలు అందించారు.



ఉద్యోగుల సమారాధనను విజయవంతం చేయండి

- విలేకరుల సమావేశంలో జెఏసి నాయకులు కొణిదెన శ్రీనివాస్, కాస్తాల సత్యనారాయణ

నవతెలంగాణ-ఖమ్మం

నవంబర్ 3వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెఏసి నాయకులు కొణిదెన శ్రీనివాస్, కాస్తాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలోని టిఎన్జిఓస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సకల ఉద్యోగుల సమ్మేళనంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లాల నుండి జెఏసి నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సుమారు కనీసం 15 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామని అన్నారు. అలాగే జెఏసిలో భాగస్వామ్యం కలిగిన రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉన్న టిఎన్జీవోస్, టిజీవోస్ సంఘాల నాయకులతో పాటు వివిధ ఉపాధ్యాయ, సెర్ప్, కాంట్రాక్టు, రిటైర్డ్, ఉద్యోగ సంఘాల నాయకులు, బాధ్యులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్ నుండి గెజిటెడ్, ఉన్నతాధికారుల వరకు సమారాధనలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. వనసమారాదనకు వచ్చి ఉద్యోగ కుటుంబాలను ఆశీర్వదించేందుకు గాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా కార్పొరేషన్ చైర్మన్‌లు, హాజరవుతున్నారని వివరించారు. ఈ సమ్మేళనానికి ఉద్యోగులతో పాటు విలేకరులూ ఆహ్వానితులే అన్నారు. అనంతరం సకల ఉద్యోగుల సమారాధన వనసమారాధనకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రిలను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ రెడ్డి, జమ్మి ఎస్ జయపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, ఎం.వేలాద్రి, ప్రముఖులు వైద్యులు డాక్టర్ బాబురత్నాకర్, జెఏసి రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, వై.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కె కృష్ణారావు, విజయ్, వాసిరెడ్డి, శ్రీనివాసరావు, కోప్పిసెశెట్టి సురేష్, నాగమల్లేశ్వరరావు, పమ్మి వెంకటేశ్వరరావు, వీరాస్వామి, నాగేశ్వరరావు, జి.యాదగిరి, మల్లెల రవీంద్రబాబు, ఎం.రాజేష్, కొమరగిరి దుర్గాప్రసాద్, చందాకాని రమణ యాదవ్, ఆంజనేయులు, శ్రీధర్ సింగ్ పాల్గొన్నారు.

మహాసభకు ముస్తాబైన మోటాపురం

- మహాసభకు 200 మంది ప్రతినిధుల ఎంపిక
- నేడు భారీ ప్రదర్శన బహిరంగ సభ
- హాజరుకానున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ-నేలకొండపల్లి



నేలకొండపల్లి సిపిఐ(ఎం) మండల 9వ మహాసభ గురువారం మోటాపురంలో జరగనుంది. దీంతో మహాసభకు గ్రామం ముస్తాబయింది. పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని రహదారుల కిరువైపులా ఎర్రటి తోరణాలు, స్వాగత బ్యానర్లు, పార్టీ జెండాలతో అలంకరించారు. మండల వ్యాప్తంగా 200 మంది పార్టీ ప్రతినిధులతో జరగనున్న మహాసభ ప్రాంగణానికి ఇటీవల గ్రామంలో గుండెపోటుతో మరణించిన పార్టీ మాజీ మండల కమిటీ సభ్యులు చావా లెనిన్ బాబు నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి మాట్లాడారు. మహాసభను పురస్కరించుకొని 1500 మంది పార్టీ కార్యకర్తలు, నాయకులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో అంతర్జాతీయంగా వస్తున్న రాజకీయ పరిణామాలు, సమీకరణలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ్మినేని ప్రసంగిస్తారన్నారు. ఈ మహాసభలో గత మూడు ఏళ్లుగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు ఫలితాలపై మండల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ముసాయిదాను విడుదల చేస్తారన్నారు. రాబోయే మూడేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. మహాసభ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, గుగులోతు వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్షతను విడనాడాలి

స్కాలర్షిప్, రీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మునగడ సాధించలేదని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కలెక్టరేట్లోకి చొచ్చుకు పోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకి విద్యార్థులకు మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 200 కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉండడంతో విద్యార్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోతే మంత్రులు ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు ఎస్‌కె నాగులమీరా, మధు, శివ నాయక్, జిల్లా నాయకులు మనోజ్, రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, గోపి, సాయి, నరేష్ పాల్గొన్నారు.

నగర సమస్యలపై దృష్టి సారించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరం సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కారం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం 44వ డివిజన్ పార్టీ శాఖ మహాసభలు పాత పిఆర్టీయు కార్యాలయంలో నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకుడు జాన్‌ఖాన్ ఎగురవేశారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రధాన రహదారిగా బస్సు డిపో రోడ్ 100 అడుగులు రోడ్‌గా చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. చిన్నగా ఉన్న డిపో రోడ్‌లో కాంట్రాక్టర్‌ల లాభాలు కోసం గత ప్రభుత్వం డివైడర్ కట్టి విపరీతమైన ట్రాఫిక్ స మస్యను తెచ్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో అయినా వెంటనే ఖమ్మం మంత్రి చొరవ చేసి 100 అడుగుల రోడ్‌గా డిపో రహదారిని చేసి నగర ప్రజలను ట్రాఫిక్ నుంచి విముక్తి చేయాలని కోరారు. వైరా రోడ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సరితా క్లీనిక్ సెంటర్ వరకు ఎన్ఎస్టీ రోడ్‌ను 80 అడుగుల రహదారిగా విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమైన హాస్పిటల్స్ ఉండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, టూ వీలర్ వాహనదారులు తప్ప కార్లు వెళ్ళే పరిస్థితి ఎన్ఎస్టీ రోడ్‌లో లేదని, వెంటనే రోడ్ వెడల్పు చేయాలని, నగరంలో పలుచోట్ల భారీ వర్షాలు ఫలితంగా అంతర్గత రహదారులు గుంతలు ఫలితంగా పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో స్థానిక ప్రజా సమస్యలపై దశలవారీగా ప్రజా పోరాటాలు చేయవలసి అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఎస్కే హుస్సేన్, డి.నాగరాజు, షుఖుర్, మల్లికార్జున్ రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.



ఏఈ పి.వెంకట్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు విద్యుత్ శాఖ ఏఈగా పి.వెంకట్ బుధవారం బాధ్యత స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ గణేష్ ఎర్రుపాలెం మండలం విద్యుత్ ఏఈగా బదిలీ కావడంతో ఖమ్మం లో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పి వెంకట్ కల్లూరుకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సహకారంతో ఎలాంటి సమస్యలు రాకుండా నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది సహకారంతో వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను తమ పరిధిలో వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏ ఈ కి సిబ్బంది సాధారణంగా స్వాగతం పలికి పుష్పగుచ్చాల అందించి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్ట నమోదు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు రైతుల వినతి
- సమగ్రంగా విచారణకు జెడిఏకు ఆదేశాలిస్తా: కలెక్టర్

నవతెలంగాణ - బోనకల్

పంట నమోదులో అక్రమాలకు పాల్పడిన మండల వ్యవసాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని రాపల్లి గ్రామ రైతులు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా వినతి పత్రం కూడా అందజేశారు. సమగ్ర సర్వేకు జేడీఏకు ఆదేశాలు ఇస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. అదే విధంగా ఆళ్లపాడు రైతులు ఖమ్మంలోనే జేడిఏ కార్యాలయంలో జేడీఏ పుల్లయ్యకు పంట నమోదు అక్రమాలపై ఫిర్యాదు చేసి, వినతిపత్రం అందజేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాపల్లి, ఆళ్లపాడు గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం... రాపల్లి గ్రామంలో పంటలు సాగు చేయని వారికి పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారులు నమోదు చేశారని కానీ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు మాత్రం పంట నష్ట నమోదు చేయలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. పంట సాగు చేసి అతి తక్కువ నష్టపోతే పూర్తిగా నష్టపోయినట్లు నమోదు కూడా చేశారన్నారు. పంట నష్టం పూర్తిగా జరిగినా రైతులకు మాత్రం పంట నష్టపోయినట్లు నమోదు చేయలేదని దీనివలన అర్హులైన రైతులుగా తాము తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తోట చలపతి, కొనకల్ల హనుమంతరావు, తోట ప్రభాకర్, సాదినేని సీతారామకృష్ణ, ఏనుగు జనార్ధన్ రావు గంగవరపు ప్రసాద్ తదితరులు ఉన్నారు. మండల పరిధిలోని ఆళ్లపాడు రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను, జెడిఏ పుల్లయ్య, టెక్నికల్ ఏడిఏ వాసుకి రాణికి జేడీఏ కార్యాలయంలో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నిర్వహించిన వ్యవసాయ విస్తరణ అధికారి పక్షపాతంగా, నిర్లక్ష్యంగా పంట నష్ట నమోదు చేసిందని, అర్హులైన రైతులకు నష్టం చేకూర్చే విధంగా సర్వే చేసిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో జెడిఏ స్పందిస్తూ తిరిగి సమగ్ర సర్వే కోసం ప్రభుత్వాన్ని కోరతానని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన రైతులకు న్యాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. తన పక్కనే ఉన్న జెడిఏ పుల్లయ్యకు వెంటనే సమగ్ర సర్వే చేయాలని ఆదేశించినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు తోటకూర వెంకటేశ్వరరావు, పారా వెంకట మోహన్ రావు, బుంగ రాములు, మంద కృష్ణయ్య, మరీదు వెంకటేశ్వర్లు, పదిలం నరసింహారావు, మల్లాది లింగయ్య, మంద కృష్ణ, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, జేడీఏలకు ఫిర్యాదు చేసిన ఆళ్లపాడు రైతులు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

చేపల వేటకు వెళ్లి కట్టలేరు ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్య మైంది. ఎర్రుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన గంతాల వెంకటేశ్వరరావు(30) మంగళవారం ప్రమాదవశాత్తు నీటి ఉద్రితికి కొట్టుకుపోయిన సంగతి పాఠకులకు విధితమే. పోలీస్ శాఖ, రెస్క్యూటీం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టగా బనిగండ్లపాడు బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | అక్టోబర్ 24, 2024 | www.navatelangana.com

శానిటేషన్ విజిట్ చేసిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



శానిటేషన్, ఇంజనీర్ విజిట్‌లో భాగంగా 36, 37 వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పర్యటించారు. ఈ డివిజన్లల్లో రైల్వే ట్రాక్ మూడో లైన్ సర్వే, నిర్మాణ పనులను ఎలా చేస్తున్నారు.. ట్రాక్ విస్తరణ కోసం ఎంత భూమిని సేకరించారు, కాంక్రీట్ వాల్ ఎన్ని మీటర్ల దూరంలో నిర్మిస్తున్నారు అనేది పరిశీలించారు. అంతే రైల్వే ట్రాక్ కింద నుంచి వెళ్తున్న డ్రైన్లలలోకి ఏ డివిజన్లో నుంచి డ్రైన్ వాటర్ ఆ డ్రైన్‌కి వస్తున్నదనది, వర్షం పడినప్పుడు వచ్చే వాటర్‌కి ఈ డ్రైన్ సిస్టం సరిపోతుందా లేదా, ఈ డ్రైన్‌ని ఇంకెక్కడ నుంచి వచ్చే డ్రైన్‌లకి ఈ డ్రైనేజీ కలిపారు అనేది పరిశీలించారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి వస్తున్న డ్రైన్ వేరే అండర్ పాస్ ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్క నుంచి కొత్తగా పెద్ద డ్రైన్‌ని నిర్మించి అక్కడి నుంచి పోయేలా డిజైన్ చేయాలని ఈఈని ఆదేశించారు. అంతే జీవిమాల్ నుంచి వస్తున్న వరద నీటి కోసం ఉన్న డ్రైవ్ సిస్టంని కూడా పరిశీలించి ఆ డ్రైన్‌ని కూడా డ్రైన్ వెడల్పు పెంచేలా డిజైన్ చేయాలని అన్నారు. వాన పడినప్పుడు వచ్చే నీరు ఎక్కడ ఆగకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈ ఏఎంసీ, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

- వైరా జీజేసీలో అవగాహన సమావేశం

నవతెలంగాణ-వైరాటౌన్

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, బంగారం లాంటి జీవితాన్ని పాడు చేసుకోవద్దని స్థానిక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి విద్యార్థులను కోరారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లా మహిళ, శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులో కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడినవారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14446 ఫోన్ చేయాలని కోరారు. విద్యార్థులు అడిగిన పలు అనుమానాలకు సమాధానాలు చెప్పారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-ఎర్రుపాలెం

టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎర్రుపాలెంలో జరిగిన టిపిటి ఎఫ్ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులుగా పి. భూషణ్ రా జు, ప్రధాన కార్యదర్శిగా అన్నవరపు దామోదర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు, సీతారాములు, హనుమంతరావు, శ్యాంసుందర్, ముత్తయ్య, సంధ్యారాణి, ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి శు భాకాంక్షలు తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

నగరంలోని తహసీల్దార్ కార్యాలయం, గవర్నమెంట్ హాస్పిటల్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌నీ నగర మేయర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేకగస్త్య బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, గవర్నమెంట్ హాస్పటల్ సూపరిండెంట్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

నది పరివాహక ప్రాంతంలో పంట నష్ట సమగ్ర సర్వే నిర్వహించాలి

నవతెలంగాణ-బోనకల్

వైరా నది పరివాహక ప్రాంతంలో పంట నష్ట సమగ్ర సర్వే నిర్వహించాలని సిపిఐ జిల్లా నాయకులు కొంగర రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోనే బ్రాహ్మణపల్లి లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరివాహక ప్రాంతమైన రాపల్లి, బ్రాహ్మణపల్లి ముంపుకు గురైన వ్యవసాయ భూములతో పాటు, జానకిపురం, చిన్నబీరవెల్లి , కలకోట గ్రామాలలో వాగుకు సమీపంలో ముంపు గురైన వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. గ్రామాల్లో ఏఈఓ లు సక్రమంగా సమగ్ర పంట నష్ట సర్వే చేయకపోవడంతో అర్హులైన రైతులు నష్టపోయారన్నారు. తిరిగి మరల పంట నష్ట సమగ్ర సర్వే చేపట్టి అర్హులైన వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ నాయకులు ఏలూరి రమేష్, వంగాల సురేష్, కొంగర కృష్ణయ్య తదితురులున్నారు.

ముగిసిన ఫార్మా కౌన్సిలింగ్

నవతెలంగాణ-ఖమ్మం

గత మూడు రోజులుగా ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన టీజీ ఎప్సెట్ 2024 ద్వారా బి.ఫార్మసీ, ఫార్మా డి ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రక్రియ బుధవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. చివరిరోజు 197మంది విద్యార్థులకు 185 మంది హాజరయ్యారని వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-వేంసూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు గత ఏడు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం మర్లపాడు సెంటర్‌లో మండల కమిటీ సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ ఆందోళన చేపట్టారు. గ్రామ సభలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలని ఆందోళన చేపట్టడంతో అధికారులు బహిరంగ ప్రదేశంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సాదు శరత్ బాబు, రాజేష్, సాధు కృష్ణయ్య, జొన్నలగడ్డ ఇస్తరయ్య, భీమిరెడ్డి మురళిరెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.

చల్లపల్లి రాధమ్మకు నివాళులర్పించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని పెద్దతండా గ్రామానికి చెందిన చల్లపల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బుధవారం రాధమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడారు. రాధమ్మ కుటుంబం సీపీఐ(ఎం)కి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాధమ్మ కుమారులు, కోడళ్లు విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరులో భర్త శ్రీరాంమూర్తికి, తదనంతరం కుమారులకు, కోడళ్లకు అండగా ఉండటంలో రాధమ్మ పాత్ర అమోఘమన్నారు. వారి కుటుంబ సభ్యులకు సీపీఐ(ఎం) తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పీ.సోమయ్య, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, రాధమ్మ కుటుంబ సభ్యులు చల్లపల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, సీతారామయ్య, నాగేశ్వరరావు, దేవేందర్, సంధ్యారాణి, ఉదయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఏఆర్' యాజమాన్యం ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి

- సీఎంఆర్ బియ్యం కుంభకోణ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- తేమ, తాలు పేరుతో కోత పెట్టిన డబ్బు రైతులకు తిరిగి ఇవ్వాలి
- రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

నవతెలంగాణ-కొణిజర్ల



ఖమ్మం జిల్లాలో 200 కోట్ల రూపాయలు విలువచేసే సీఎంఆర్ బియ్యం కుంభకోణంలో బాధ్యులను అరెస్టు చేయకుండా ఇంకా ఎన్నిరోజులు తాత్సారం చేస్తారని, ఎస్‌ఏఆర్ రైస్ మిల్లు యాజమాన్యం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో లాలాపురం సమీపంలో గల ఎస్ఎఆర్ రైస్ మిల్లు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నుంచి లాలాపురం సమీపంలో ఎస్‌ఏఆర్ రైస్ మిల్లుకు ధాన్యం పంపగా క్వింటాలకు ఐదు నుంచి పది కేజీలు తేమ తాలు పేరుతో కోత పెట్టి 82 కోట్ల రూపాయలు రైతుల సొమ్ము మిల్లు యాజమాన్యం కాజేసి రైతులను అటు ప్రభుత్వాన్ని మోసం చేసిన రైస్ మిల్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సహకరించిన జిల్లా అధికారులను బాధ్యులు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఏఆర్ యాజమాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి వచ్చిన సొమ్ముతో వందలాది ఎకరాలు భూములు కొనుగోలు చేసి దర్జాగా అధికార పార్టీ మంత్రులు పేర్లు చెప్పుకుంటూ ఆర్థిక దోపిడీకి పాల్పడిన అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఆమెపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని మండిపడ్డారు. మండలంలో పలు గ్రామాల్లో రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారులను కూడా ఆక్రమించి ప్రహరీ గోడలు, ఫెన్సింగ్ నిర్మాణం చేసి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రైస్ మిల్లు యాజమాని రమాజ్యోతి దౌర్జన్యాలపై ప్రశ్నించిన రైతులను తప్పుడు కేసుల్లో ఇరికించి బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. బియ్యం కుంభకోణంపై దర్యాప్తు జరిపిన జిల్లా అధికారులు 200 కోట్ల అవినీతి జరిగినట్లుగా నిర్ధారణ చేసి ఎస్‌ఏఆర్ రైస్ మిల్లులో 82 కోట్ల రూపాయల విలువైన బియ్యం ప్రభుత్వానికి సరఫరా చేయకుండా మాయమైనట్లు గుర్తించి నెల రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యమన్నారు. ఇంకా ఎంతకాలం కాలయాపన చేస్తున్నారని రాజకీయ పలుకుబడి ఉపయోగించి వందల కోట్ల అవినీతికి పాల్పడుతుంటే జిల్లా మంత్రులు మౌనం వహించటం తగదన్నారు. రైతులు నుంచి ప్రభుత్వం ధ్యానం కొనుగోలు చేసి రైస్ మిల్లుకు పంపిన తర్వాత తేమ, తాలు పేరుతో క్వింటాలకు ఐదు నుంచి పది కేజీలు కోత పెడుతున్న విషయాన్ని 2022లో నాటి సివిల్ సప్లై రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ వైరా వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తాము ఫిర్యాదు చేస్తే ఎస్‌ఏఆర్ రైస్ మిల్లును సీజ్ చేయాలని నాటి కలెక్టర్‌కి సిఫార్సు చేశారని, రాజకీయ పలుకుబడిన ఉపయోగించి అప్పటి జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బంధువునని చెప్పి ఆనాడు ఉన్న ప్రభుత్వం నుంచి తప్పించుకున్నారని తెలిపారు. ఇప్పుడు 82 కోట్ల కుంభకోణం జరిగితే ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు చెప్పుకుంటూ మళ్ళీ కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడ్డుకొని రమాజ్యోతి పై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వానికి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, సంక్రాంతి పురుషోత్తం, బోడేపూడి వీరభద్రం, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరావు, జట్ల ఆనందరావు, కట్టా రాంబాబు, చింతపల్లి ప్రసాద్, ఖాసిం బేగ్, పైడిపల్లి సాంబశివరావు, పాసంగులపాటి రవి, చింత నిప్పు ప్రసాద్, పారుపల్లి కృష్ణారావు, ఎస్‌కె.అఫ్జల్, కావూరి, సత్యనారాయణ, దుగ్గిని అజయ్, రామయ్య, ఎస్‌కె.నాగుల్ మీరా, బాబు నాగేశ్వరరావు, కొంగర సుధాకర్, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు, మాడపాటి రామారావు, సంక్రాంతి సతీష్, ఇమ్మడి సుధీర్ అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్. నాగేశ్వరరావు

నవతెలంగాణ-కొణిజర్ల



ఏన్కూర్ మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం, తిమ్మారావుపేట, బురద రాఘాపురం, ఏన్కూరు బాలుర బాలికల పాఠశాలలు, కేజీబివి, గురుకులాల పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ సందర్శించి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఫారాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి 2024 అక్టోబర్ వరకు మూడు సంవత్సరాలు బోధనా అనుభవం గల ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కు నమోదు ఫారాలు అందజేశారు. వరంగల్ - ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ బలపరుస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను విజ్ఞప్తి చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖలో పండిట్స్ పీఈటి పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని,అక్టోబర్ 26 న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయిపడ్డ ఐదు డిఏలను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, ఓపిఎస్ విధానాన్ని తీసుకురావాలని, సిఆర్టీల సర్వీసును రెగ్యూలర్ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బి.రామచందర్, శ్రీదేవి, కోశాధికారి ఎం నాగేశ్వరావు, మండల సీనియర్ నాయకులు ఏం. పుల్లయ్య రాఘవరావు, శంకర్రావు, పుల్లయ్య, నరసింహారావు, శ్యామ్ కుమార్, నాగరాజు, శోభన్, శ్యామలమ్మ, ఎం. చంద్రరావు, సింగ్యా, రమేష్, జే. నాగేశ్వరరావు, శ్రీరామ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి వరప్రసాద్

నవతెలంగాణ-ముదిగొండ



వాన వరదలకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వకుండా, రుణమాఫీ పూర్తి చేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ అన్నారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాతోపాటు మధిర నియోజకవర్గంలో వరదలకు నష్టపోయిన పంట నష్టాన్ని రైతులకు నేటి వరకు ఇవ్వలేదని, రూ. 2 లక్షలలోపు రుణమాఫీని ప్రభుత్వం పూర్తి చేయకుండా రైతులను మభ్యపెడుతుందన్నారు. రుణమాఫీకి, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఆంక్షలతోపాటు బ్యాంకర్లు ఆడిట్ చేయలేదని సాకుతో రైతులకు రుణమాఫీ చేయకుండా మాయమాటలు చెబుతున్నారన్నారు. ఎబిఎఫ్, ఎస్బిఎస్ బ్యాంకులో రైతుల రుణమాఫీకు ఆడిట్ జరగలేదని, రైతులకు రుణమాఫీ వర్తించటం లేదని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతుల రుణమాఫీని పూర్తి చేయడంతోపాటు,వరదలకు నష్టపోయిన పత్తి, వరి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టపరిహారం వెంటనే చెల్లించేలా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన రైతు సంఘం ఉద్యమిస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, రైతు సంఘం మండల అధ్యక్షులు కందుల భాస్కరరావు, నాయకులు చెన్ను అంజయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా కమిటీ సభ్యులు షేక్ బసిరుద్దీన్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ఈనెల 27 న పిండిప్రోలు గ్రామంలో నిర్వహించే సీపీఐ(ఎం) తిరుమలయపాలెం మండల తొమ్మిదవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పిండిప్రోలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట భవనంలో సీపీఐ(ఎం) నాయకులు బింగి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో బషీరుద్దీన్ మాట్లాడారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సీపీఐ(ఎం) మహాసభలు గ్రామం నుంచి ఆల్ ఇండియా దాకా జరుగుతాయని, దానిలో భాగంగా సీపీఐ(ఎం) ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 27 న మండల మహాసభలు పిండిప్రోలు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ మహాసభకు ముందు యువజన కవాతు, ర్యాలీ ప్రారంభ సభ ఉంటుందని, ఈ ప్రారంభ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ ప్రారంభోత్సవంకు మండలంలోని పార్టీ సభ్యులు సానుభూతిపరులు వెయ్యి మందికి పైగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ అనంతరం ప్రతినిధుల సభ ఉంటుందని, ఈ ప్రతినిధుల సభలో గత మూడు సంవత్సరాల పార్టీ కార్యక్రమాలను ఎత్తుకొలను చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు తీసుకుంటారని తెలియజేశారు. ఈ మహాసభలను పిండిప్రోలు గ్రామంలో అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ ఈ మండల మహాసభకు మండల వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలియజేశారు. మండల వ్యాప్తంగా 24 గ్రామ శాఖలు ఉన్నాయని, 24 గ్రామ శాఖలో 210 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రారంభ సభకు సభ్యులు, సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు అంగిరేకుల నరసయ్య, పద్మనాభల సుధాకర్, తుళ్లూరు నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, కొలిచలం స్వామి, కోట ఉపేందర్‌రెడ్డి, పప్పుల ప్రసాద్, శ్రీదేవి, వర్షపొంగ వీరన్న, గుగులోతు బాలు, గోపోజు రవి, కొత్తపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మర్లపాడులో పారిశుధ్యం అస్తవ్యస్థం

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతి


నవతెలంగాణ-వేంసూరు



మర్లపాడు గ్రామపంచాయతీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని వెంటనే శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి పుల్లారావుకి మండల కమిటీ సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారులు వ్యర్థాలతో దోమల బారిన పడటం వలన అనారోగ్యాలకు గురవుతున్నారని డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించటం లేదు. వీధులకు ఇరువైపులా పిచ్చి మొక్కలతో దర్శనాలు ఇస్తున్నాయని వెంటనే శానిటేషన్ పాగింగ్ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాదు శరత్ బాబు, రాజేష్, తిరుపతిరావు, విజయ్, పుల్లారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

'నర్సిరెడ్డిని గెలిపించండి'

నవతెలంగాణ-తల్లాడ



మొదటి ప్రాధాన్యత ఓటు అలుగుబెల్లి నర్సిరెడ్డికి వేసి గెలిపించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు రంజాన్ అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఓటు హక్కు నమోదుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ మాట్లాడుతూ..టీఎస్ యుటిఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎంపిక చేసామని, ఎలక్షన్లలో నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రతి పాఠశాలలో అర్హత కలిగిన వారందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు లాల్ సయ్యద్, తాళ్లూరు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కే.శ్రీకాంత్, మురళీకృష్ణ, ఝాన్సీ లక్ష్మీ పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణ కేంద్రంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్

నవతెలంగాణ-ఖమ్మం



ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడానికి మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శిక్షణలో భాగంగా పోలీస్ శిక్షణ కేంద్రంలో సివిల్, ఎఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ బుధవారం నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసీపీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

పామాయిల్ సాగు విధానంపై అధ్యయనం కోసం...
మలేషియా పర్యటనకు వెళ్లిన మంత్రి తుమ్మల



నవతెలంగాణ-దమ్మపేట

ఆయిల్ పామ్ సాగు విధానంపై మరింత అధ్యయనం కోరుతూ..రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా పర్యటనకు వెళ్లారు. పామాయిల్ సాగు విధానం, నూనె గింజల ఉత్పత్తి తదితర అంశాలపై అధ్యయనం చేయటానికి మంగళవారం రాత్రి మలేషియా బయలు దేరివెళ్లారు. మూడు రోజుల పాటు అక్కడ పర్యటించనున్నారు. ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆయిల్‌ఫామ్ ప్రాజెక్టును మరింత విజయవంతం చేయటానికిగాను తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధ్యయనం చేయనున్నారు. ఆయనతో పాటు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కమిషనర్ యాస్మిన్ భాషా, అధికారులు సరోజిని, ఓఎస్డీ శ్రీధర్ ఉన్నారు.



హిందుత్వం మహిళలపై హింస...పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

మాజీ ఎంపీ, ఐద్వా జాతీయ నాయకురాలు బృందాకారత్ రచించిన "హిందుత్వ మహిళలపై హింస" పుస్తకాన్ని ఐద్వా జాతీయ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆవిష్కరించారు. జాతీయ, రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. పుస్తకాన్ని అనువదించిన బోడపట్ల రవీందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా స్థానంలో తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతున్నాయని, అందులో భాగంగానే బిల్‌కిస్ భాను, ఆసిఫా భాను మీద, మణిపూర్‌లో జరిగిన దారుణ కృత్యాలు గానీ ఇవాళ మనకు దేశంలో కనిపిస్తున్నాయి. మహిళలపై జరుగుతున్న హింస ఎక్కువగా జరుగుతుందన్నారు. ఆదివాసీ, ముస్లిం మహిళలపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. దాడి చేస్తున్న నేరస్తులకు కొమ్ముకాస్తు, రక్షణ కల్పిస్తున్నారన్నారు. బాధితులకు బాసటగా ఉండాల్సిన ప్రభుత్వాలు, నాయకులు అండగా ఉండడం లేదన్నారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వ్యవహరిస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఆవరణ వ్యవస్థలో పాలకులు ఏర్పాటు చేసుకొని ముస్లిం మహిళలపై దాడులు చేస్తున్నారన్నారు. ముస్లిం యువతులను హిందువులు పెళ్లి చేసుకున్నట్లయితే వారిపై దాడి చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి అన్నారు. మహిళల పరిస్థితికి అద్దం పట్టే విధంగా 80 పేజీల పుస్తకంతో బృందా కారత్ పుస్తకాన్ని సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో రచించారు. దానిని అనువదించడం అదృష్టంగా భావిస్తున్నానని అనువాదకులు బోడపట్ల రవీందర్ స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నాయకున్ని పరామర్శించిన మెచ్చా



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని ముష్టిబండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకున్ని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. ముష్టిబండకు చెందిన బండారుపల్లి ప్రసాద్ తండ్రి శంకర్‌రావు ఇటీవల స్వర్గస్థులైన నేపథ్యంలో మెచ్చా నాగేశ్వరరావు బుధవారం వారి గృహానికి వెళ్లి శంకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంపాటి భరత్ తదితరులు పాల్గొన్నారు.



కోయగూడెం కార్మికుల సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఎల్ఎస్ఎన్ క్యాంపు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐఎన్‌టీయూసీ ఇల్లందు సింగరేణి ఏరియా సలహాదారులు కోరం సురేందర్ ఎల్ఎస్ఎన్ యాజమాన్యంతో కార్మికుల 25 డిమాండ్లను చర్చించి పరిష్కరించడం జరిగిందని బుధవారం తెలిపారు. కార్మికులందరికీ జీతాలు పెంచడం, వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు, వాల్వో డ్రైవర్లకు ఇచ్చే వేతనం ఇవ్వాలని, కంపెనీ బోనస్ వీలైనంత త్వరగా వేయాలని, ప్రతి కార్మికునికి పీఎఫ్ కట్ చేయాలని, పెండింగ్ పిఎఫ్ డబ్బులు కార్మికుని ఈపీఎఫ్ అకౌంట్లో జమ చేయాలని, దీపావళి పండుగకు ప్రతి కార్మికునికి రూ.5000 అడ్వాన్స్ ఇవ్వాలని, ఇలా మొత్తం 25 సమస్యల పైన ఎల్ ఎస్ ఎన్ కంపెనీ జీఎం శివతో, ప్రాజెక్ట్ మేనేజర్ రాజమోహన్ రెడ్డితో చర్చలు జరిపి పరిష్కారం చేయుటకు ఒప్పందం కుదిరించినారన్నారు. ఈ ఒప్పందానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులందరూ ఆనందోత్సాహంతో హర్షం వ్యక్తం చేశారు. ఎల్ఎస్ఎన్ కంపెనీ ఎండి నితిన్ జోసెఫ్, జీఎం శివ, పీఎం రాజమోహన్ రెడ్డి, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చి నాయకత్వం వహించి సహకరించిన కోరం సురేందర్ కతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చ సుధాకర్, యూనియన్ సభ్యులు, చంద్రమౌళి, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సతీష్, నాగేష్, సీతారాం పాల్గొన్నారు.

జన్మదినం నాడే మరణం




నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మనిషికి జననం, మరణం అనేది సహజం. కానీ జన్మదినం, మరణించే రోజు ఒక్కరోజు కావడం చాలా అరుదుగా జరుగుతుంటాయి. అలాంటి సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. సాయి కిషోర్ జన్మించిన రోజే మరణించడంతో వారి తల్లితండ్రులు పడే అవేదన అంత ఇంత కాదు. జన్మదిన వేడుక చేసుకునే ఆ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మండల పరిధిలోని నామవరం గ్రామంలోని శివాలయం పూజారిగా పని చేస్తున్న వెంకట శివరామ మూర్తి చిన్న కుమారుడు సాయి కిషోర్ (28) బుధవారం పుట్టిన రోజు కావడంతో తెల్లవారుజామునే తల్లి కుమారుడిని లేపి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడం, కుమారుడు కూడా ఆనందంగా పుట్టినరోజు వేడుక చేసుకోవడానికి తల స్నానం చేయడానికి వెళుతున్న సమయంలో ఒక్కసారే కుప్పకూలి పడిపోయాయి. గుండెల్లో నొప్పి అనడంతో తల్లిదండ్రులు ఒక్కసారే కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి హుటాహుటిన హాస్పటల్‌కి తరలించే సమయంలో మృతి చెందాడు. సాయి కిషోర్ రాజపురం గ్రామంలో ఆన్ లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

- అయోడైజ్డ్ ఉప్పు వాడండి
- డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్ నాయక్



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్ నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంకని ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ అయోడిన్ నివారణ లోపం కార్యక్రమం గురించి ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. అయోడైజ్డ్ ఉప్పు వాడటం వలన థైరాయిడ్ పెరగకుండ నియంత్రించవచ్చు అని, గర్భిణీలకు, పిండం అభివృద్ధికి, చిన్న పిల్లలు మెదడు చురుకుగా పనిచేసేందుకు పని చేస్తుందని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హేడ్ నర్స్ ఎస్తేర్ రాణి, హెచ్.యస్ ప్రకాష్ రావు, హేమ, ప్రసాద్, కళ్యాణ్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

దేశానికి లెక్కలేని సంపద అందిస్తున్న మహిళలు

- ప్రొఫెసర్ పద్మజాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

మహిళలు దేశానికి లెక్కలేని సంపద అందిస్తున్నారని, కానీ దీన్ని లెక్కల్లో ప్రభుత్వాలు చూపడం లేదనిప్రొఫెసర్ పద్మజాషా అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభల్లో బుధవారం సెమినార్ నిర్వహించగా "మహిళలపై జరుగుతున్న హింస" అనే అంశంపై ప్రొఫెసర్ పద్మజాషా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మహిళలను అనిచి వేసే విధంగా ఉన్నాయి అన్నారు. మహిళలు పనిచేసే స్థలాల్లో లైంగిక వేధింపులు పెరిగాయి అని, కనీస వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవణ నిర్మాణం, అడ్డా కూలీలు, మున్సిపల్ పారిశుద్ధంలో పనిచేసే కార్మికులు వీరంతా పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారని, వీటిని అరికట్టాలన్నారు. పనిచేస్తున్న మహిళలు వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని, కుటుంబ పోషణ మహిళలపై భారంగా మారిందన్నారు. ఈ తరుణంలో ఇంటి నుంచి బయటకు వచ్చి పనులు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో కుల వివక్షత వలన మహిళలు వివిధ రంగాలలో రాణించలేక పోతున్నారని, వాటిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి ఎదుగుదలకు కులం అడ్డుగోడగా మారిన సందర్భాలలో పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ లాంటి మత తత్వ రాజకీయ పార్టీలు మహిళల ఎదుగుదలకు గొడ్డలి పెట్టుగా ఉన్నాయి అని, అవి అనుసరిస్తున్న విధానాలు వారి ఎదుగుదలను అడ్డుకుంటున్నాయి అన్నారు. నేటి సమాజంలో కుటుంబాల్లో అమ్మాయిలను పెంచినట్లుగా అబ్బాయిలను పెంచాల్సిన పరిస్థితి పెరిగింది. అమ్మాయిలతో అబ్బాయిలు ఎలా ఉండాలో కుటుంబం నుండి నేర్పించాలి. కులం, మతం మహిళలకు ప్రాణ సంకటంగా మారిందన్నారు. హిందుత్వ రాజకీయాల వలన మహిళలకి నష్టం జరుగుతుందన్నారు. యూత్‌కి ఫోన్ ద్వారా విష సంస్కృతి మెదడులోకి ఎక్కుతున్నదని, ఫోన్‌లలో విపరీతమైన చెత్త వచ్చి చేరుకుపోతుందని, వాటి వలన యువత తీవ్రంగా నష్టపోతుందన్నారు. మహిళా చైతన్యం కోసం బస్తీల్లో, వాడల్లో, కార్యక్రమాలు చేయాలని, శాంతి యుత వాతావరణం కలిగించాలన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పద్మజాషా



మాట్లాడుతున్న డాక్టర్ నీలిమ

మహిళల ఆరోగ్యంతోనే దేశ భవిష్యత్తు

మహిళలు ఆరోగ్యం సెమినార్‌లో డాక్టర్ నీలిమ

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ ఆర్థిక అభివృద్ధి బాగుంటుందని డాక్టర్ నీలిమ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం క్లబ్, మల్లు స్వరాజ్యం నగర్, కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణంలో జరుగుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న ఐద్వా మహాసభలో బుధవారం "మహిళలు-ఆరోగ్యం" అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో డాక్టర్ నీలిమ మాట్లాడారు. మహిళలు అని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ వారి ఆరోగ్యం, ఆహారం పట్ల ఎక్కువగా నిర్లక్ష్యం వహిస్తుంటారు. నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్యాలు క్షీణించి పోతున్నాయి. పెరుగుతున్న అధిక ధరలు, కుటుంబ పోషణ భారంగా మారడంతో మహిళలు పూర్తి స్థాయిలో పౌష్టికాహారాన్ని తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. మానసికంగా, శారీరకంగా దృష్టి పెట్టినప్పుడే తన ఆరోగ్యం బాగుంటుందన్నారు. కౌమార దశలో ఉన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన మహిళలు వారి ఆరోగ్యం, వారి శరీరంలో వస్తున్న మార్పుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. మానసిక ఒత్తులను అధిగమించేందుకు వ్యాయామం, యోగా లాంటి చేయాలన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో పాఠశాలలో, హాస్టల్లో టాయిలెట్స్ సక్రమంగా ఉండే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

ఈ మహాసభల చివరి రోజు కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అధ్యక్షత వహించగా అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధా సుందర్ రామన్, రాష్ట్ర కార్యదర్శి మల్లి లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, బి.హైమావతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి, అధ్యక్షురాలు డి.లక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక అణచివేతకు గురవుతున్న మహిళ

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు



సామాజిక అనుచివేతకు దళితులు ఒకరే కాదు, మహిళలందరూ గురవుతున్నారు. మహిళ బయటికి వెళ్తే తిరిగి వస్తుందన్న నమ్మకాన్ని తల్లిదండ్రులు కోల్పోతున్నారు. అందుకే మన ఇంట్లో ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ లాంటివి (కరాటే) నేర్పించాల్సిన అవసరం ఉంది. ఆత్మరక్షణ కోసం ఇవి ఎంతో ఉపయోగపడతాయి. స్త్రీ సామాజిక అణిచివేత నుండి ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురైందని, ఇది మహిళలకు పెద్ద సవాల్‌గా ఉంది. దళితులు, ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున అణచివేతకు గురవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత మహిళ, ముస్లిం మహిళ, ఇతర మహిళ అనే తేడా లేకుండా యావత్తు మహిళా సమాజం మీదనే దాడులు జరుగుతున్నాయి. మహిళలను రెండవ తరగతి మనిషిగా చూడడం విచారకరం. అత్రాస్ దళిత మహిళనే ఆమెపై అత్యాచారం చేసి, నాలుక కోసి, నడుములు విరిచి మృతదేహాన్ని సైతం కుటుంబానికి చెందకుండా దారుణంగా హత్య చేసిన సంఘటన ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింత వివక్షకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి తరుణంలో పోరాట స్ఫూర్తి ఉన్న మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ లాంటి వీరోచిత పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోవాలి. జిల్లాకు పోరాటాన్ని నిర్మించాలి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన మహిళలపై దాడులు జరిగిన సంఘటనల్లో ఐద్వా-కెవిపిఎస్ కలిసి పోరాటం చేసి బాధితులు పక్షాన నిలబడ్డ విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నకిలీ జాతీయవాదం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



ప్రతిరోజు మనం పేపర్ తిరగేస్తే ఎక్కడో ఒక దగ్గర మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్న సంఘటనలు దర్శనమిస్తున్నాయి. భవిష్యత్తులో దినపత్రికలో ఒక్క రోజైనా మహిళలపై దాడి జరగని విషయం వార్తగా ప్రచురించని సందర్భం వస్తుందా...? అని అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మహిళలపై దాడులే కనిపిస్తున్నాయి. 2017 తర్వాత ఈ దేశంలో గంటకి 90 మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రభుత్వమే పార్లమెంట్‌లో ప్రకటించడం సిగ్గు చేటన్నారు. 46 శాతం మహిళలపై హింస పెరిగింది. గ్రామం, పట్టణం అభివృద్ధి చెందిన మహా నగరాలతో పాటు విద్యా సంస్థల్లో బాలికలపై, యువతులపై దాడులు జరుగుతున్నాయి.

23 ఏళ్ల క్రితం జరిగిన మహిళలపై మహిళ మీద జరిగిన అత్యాచారం నిర్భయ చట్టం వచ్చింది. చట్టం వచ్చినప్పటికీ దాడులు అరికట్టలేని విధంగా ప్రభుత్వాలు తయారయ్యాయి. నకిలీ జాతీయవాదం పేరుతో బీజేపీ ప్రజల్ని మోసం చేస్తుంది. ఎస్ఎఫ్ఐ-ఐద్వా ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన పరిస్థితి మన ముందు ఉంది.

వారి స్ఫూర్తితో పనిచేయాలి



ఐద్వా సీనియర్ నాయకులను ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలి. ఐద్వా నాయకులుగా పనిచేసిన ఏలూరి జయమ్మ కొమరం స్వరాజేశ్వరమ్మ నాయకులు పనిచేసిన తీరును స్ఫూర్తిగా తీసుకోవాలి. జయమ్మ కుటుంబం మొత్తం నేటికీ ఐద్వాకు సపోర్ట్ చేస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లో గ్రామ గ్రామం, ఇంటింటికి తిరిగి మహిళా చైతన్యం తీసుకువచ్చారు. స్వరాజేశ్వరమ్మ 95 సంవత్సరాల వయసులో ఐద్వా 4వ హాసభలకు హాజరై నేటి తరం ఐద్వా నాయకత్వానికి ఆదర్శంగా నిలవడం, మనందరికి స్ఫూర్తిని నింపడం జరిగింది. వారికి మహాసభల సందర్భంగా ధన్యవాదాలు. వారి పోరాటం, త్యాగాలు స్ఫూర్తి మనం తీసుకొని పనిచేయాలి. కష్టాలను ఎదుర్కొని ముందుకు పోతేనే సంఘ నిర్మాణం. సంఘం బలపడి, సామాన్య మహిళా ప్రజానీకానికి న్యాయం జరుగుతుంది.

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

మనువాదాన్ని ముందుకు తీసుకొస్తున్న ప్రభుతం

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



మనువాదాన్ని ముందుకు తీసుకోస్తున్న ప్రభుత్వాలను అడ్డుకోవాల్సి ఉంది. ఇది ప్రమాదకరంగా గుర్తించాలి. మన రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడుకోవడం కోసం డీవైఎఫ్ఐ-ఐద్వా కలిసి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉంది. రాబోయే కాలానికి ఐద్వాకు-డీవైఎఫ్ఐ యువజన సంఘం నుండి ఐద్వా కార్యకర్తలు అందించే విధంగా డీవైఎఫ్ఐ కృషి చేస్తుందని, రాబోయే మూడు ఏళ్ల కాలంలో తీసుకునే నిర్ణయాలకు డీవైఎఫ్ఐ కలిసి వస్తుంది.

మునగ సాగుతో అదనపు ఆదాయం

- పూర్తి రాయితీగా సాగు వ్యయం
- ఏపీవో రామచంద్రరావు



నవతెలంగాణ-అశ్వారావుపేట

దీర్ఘకాలిక ఉద్యాన పంటల్లో అంతర్గత పంటగాను, ప్రత్యేక మునగ సాగుతో అదనపు ఆదాయం లభిస్తుందని, అంతే గాకుండా సాగు వ్యయం మొత్తాన్ని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పూర్తి రాయితీగా పొందవచ్చని ఈ పథకం ఏపీవో కే.రామచంద్రరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నవతెలంగాణతో మాట్లాడారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలంలో 400 వందల ఎకరాలు లక్ష్యంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నిర్దేశించారు అని తెలిపారు. ఒక ఎకరానికి అయ్యే సాగు వ్యయం మొత్తాన్ని రూ.1 లక్ష 20 వేలు (అంచనా వ్యయం) పూర్తిగా రాయితీ పొందవచ్చని తెలిపారు. ఔత్సాహికులు ఐన దళిత,గిరిజన,వెనుకబడిన 5 ఎకరాల లోపు నీటి వసతి ఉన్న సన్న చిన్నకారు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, ఉపాధి కార్డు నకలు తో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఒకే ఎకరానికి 1000 మునగ మొక్కలు చొప్పున మొక్క ఖరీదు రూ.15 వేలు, గోతులు తీతకు నందుకు రూ.23 వేలు, మొక్కలు నాటుకు రూ.19 వేలు, ఊత కర్రలుకు రూ.19 వేలు, సాగు నిర్వహణ వ్యయం రూ.44 వేలు రాయితీ అందజేస్తాం అని అన్నారు. ఆసక్తి ఉన్న రైతులు స్థానిక కార్యదర్శులను, ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

తాగునీటికి ఇక్కట్లు

మరమ్మతులకు నోచుకొని చేతిపంపులు
ఏండ్లుగా నిరీక్షణ

- స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా నీటి కోసం ప్రజల అవస్థలు

నవతెలంగాణ-చర్ల

'చుట్టూ కొండలు, మధ్యలో ఓ ఆదివాసీ కుగ్రామం.. దాహార్తి తీర్చుకోవడానికి బోరు బావి లేని దుస్థితి... గుట్ట తడప నుండి వచ్చే నీటి ఊటలే తాగునీటి వసతులు... అత్యంత దయనీయ స్థితిలో తాగునీటి కష్టాలను వెల్లబుచ్చుతున్న కాంకేర్ జిల్లా పంఖజూర్ గ్రామ నీటి గాథలపై నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం"



సరిహద్దు ఛత్తీస్‌గఢ్ కంకేర్ జిల్లాలోని పఖంజూర్ ప్రాంతంలో గ్రామస్తులు నీటి ఊటలతో దాహం తీర్చుకోవాల్సిన దుస్థితిలో ఉన్న గ్రామాలు ఉన్నాయి. చేతిపంపు ఉన్నా మరమ్మతులకు గురై ఏండ్ల తరబడి అధ్వానంగా ఉంది. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. గ్రామస్తులు నీటి ఊట ద్వారా వచ్చిన నీరు తాగవలసి వస్తుంది. నీరు అంటే ప్రాణం అనే స్థితిలో ఆ గ్రామస్తులు ఉన్నారు. నీరంటే ఆరో ప్రాణం అనే నినాదాలు పలుచోట్ల వినిపిస్తాయి. నగరం, పట్టణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీపై ఆధారపడిన గ్రామమైన మర్కచువా గ్రామస్తులు బిస్లరీ, ఆక్వాఫినా, కిన్లే వంటి ఖరీదైన నీరు జీవితంలో ఒక్కసారి అయినా తాగాలని పోటీ పడుతున్నారు. మందగావ్, మర్కచువాలో దాదాపు 23 మంది ప్రజలు నీళ్ళు తాగాలని తహతహలాడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా ఈ ప్రాంతంలో ప్రవహిస్తున్న కొత్రి నదిలోని కలుషిత నీటిని తాగి ఈ గ్రామస్తులు జీవిస్తున్నారు. ఈ గ్రామంలోని గ్రామస్తులకు ఈ నది జీవనాధారంగా నిలుస్తోంది. గ్రామస్తులు నది నీటిని తాగడం వల్ల అనేక రకాల ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే గ్రామస్తులకు ఈ తాగునీటి కష్టాలు రోజువారీ దినచర్యగా మారిపోయింది. వేసవిలో వీళ్ళ పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. ఎండలో మండుతున్న ఇసుక నుండి నీటిని తీసుకురావడం ద్వారా దానిని ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతమంతా అడవులు, పర్వతాలతో చుట్టుముట్టబడి ఉండడంతో ఎలుగుబంట్లు, సింహాలు, ఇతర వన్యప్రాణులు దాడి చేస్తాయి. అందుకే మగవాళ్ళు కూడా వారితో పాటు కర్రలు పట్టుకుని నీరు తెచ్చుకుంటారు. నీటి సమస్య కారణంగా మరచువా గ్రామస్తులు అడవుల్లో పెరిగే మొక్కల నుంచి ఆకులను తెంపుకుని తినాల్సి వస్తోంది. మండల పరిధిలో కూడా చాలా గ్రామాలు తాగునీటి ఇక్కట్లతో సతమతమవుతున్నాయి. ఇప్పటికే ఏర్పడిన వర్షాభావం పరిస్థితి ఒక కారణంగా భూగర్భ జలాలు అతి తొందరగా తగ్గుముఖం పట్టనున్నాయి. భగీరథ తాగునీటి స్కీములు సరిగా లేని గ్రామాలను గుర్తించి అధికారులు త్వరితగతిన తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-బూర్గంపాడు

గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీపురం, నకిరేపేట, టేకుల చెరువు గ్రామ పంచాయ తీల పరిధిలో సుమారు రూ.30 లక్షల విలువగల సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభించిన అనంతరం గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే సంబంధిత అధికారులకు సెల్ ఫోన్ ద్వారా సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. గ్రామంలో పలు సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల కొరత వంటి విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే పంచాయతీరాజ్ డి.వెంకటేశ్వరావుని పిలిచి నోట్ చేసుకొని సీసీ రోడ్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాయం ఆదేశించారు. లక్ష్మీపురం పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయినందున తెలంగాణ ఆర్టీసీ బస్సులు, ఎక్స్‌ప్రెస్ ఆగడం లేదని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే భద్రాచలం డిపో మేనేజర్‌కి ఫోన్ ద్వారా పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయిన లక్ష్మీపురంలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెం పూడి కృష్ణా రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వ రరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటే శ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, భజన సతీష్, బూర్గంపాడు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందా నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బాదం రమేష్ రెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరినీ సమదృష్టితో చూడాలి

- ఎస్ఎస్‌జీ సభ్యులే మహిళలా..? మిగతావారు కాదా..?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఐద్వా



నవతెలంగాణ-చర్ల

రాష్ట్రంలో సెల్ఫ్ వెల్ఫేర్ గ్రూపు సభ్యులే మహిళలా..? మిగతావారు మహిళలు కాదా..? మహిళలందరినీ శ్రమదృష్టితో చూడాలని ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు తాటి నాగమణి, పొడుపు గంటి సమ్మక్కలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం వారు మాట్లాడారు. గడిచిన 10 ఏళ్లలో ఏనాడు వెలుగు మహిళా సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరలు పంపిణీ చేయక నేడు కేవలం గ్రూప్ సభ్యులకు మాత్రమే చీరల పంపిణీ చేయడం మహిళా లోకాన్ని కించపరిచినట్లు అయిందని వారు మండిపడ్డారు. చీరెల పంపిణీ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చాలా తప్పుడు నిర్ణయం తీసుకుందని వారు విమర్శించారు. పాలించే ప్రభుత్వాలు అందరినీ సమదృష్టితో చూస్తూ జనరంజకమైన పాలన చేయాలి, కానీ దానికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం గ్రూపు సభ్యులకు చీరెల పంపిణీ కార్యక్రమం పెట్టడం నిరుపేదల పట్ల వారికి ఉన్న ఔదార్యాన్ని చాటుకున్నారని ఎద్దేవా చేసారు. చేత కానప్పుడు చీరెలు పంపకం మానేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు మీద దృష్టి పెట్టి ప్రజాసంక్షేమ పథకాలకు పెద్దపీట వేయాలన్నారు. అత్యంత నిరుపేదలు గ్రూపులలో ఉండరు అనే సంగతి రేవంత్ రెడ్డికి తెలియదా అని వారు మండిపడ్డారు. ఇకనైనా నిర్ణయాలు తీసుకునే ముందు అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసి ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్ణయాలు తీసుకోవాలని వారు హితవు పలికారు.



అగ్ని బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ చేయూత

నవతెలంగాణ -దుమ్ముగూడెం

మండలంలోని పర్ణశాల గ్రామ పంచాయతీ మునలిమడుగు గ్రామంలో అగ్ని ప్రమాదం సంబంధించి సర్వం కోల్పోయిన వాగే సత్యం కుటుంబానికి భద్రాచలం రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులను రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించడం తీవ్రమైన బాధాకరమైన విషయం అని, సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరులో తప్పక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, తెల్లం నరేష్, తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు, వాగే ఖాదర్ బాబు, కష్ణమూర్తి, వాగే రాజేశ్వరి, గజేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని అయిలయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

ఐక్య పోరాటాల ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు సమస్యల ప్రాతిపదిక కలిసి పోరాటం చేద్దామని ప్రజాసంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. ఐద్వా నాలుగవ రాష్ట్ర మహాసభల సందర్భంగా సోదర ప్రజాసంఘాల నాయకులు సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య మాట్లాడుతూ ఐక్య పోరాటాలే విజయానికి కీలక భూమిక పోషిస్తాయని తెలిపారు. కేంద్ర బిజెపి తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని జరిగిన ఉద్యమం రైతు సంఘాల ఐక్యతకు, విశాలమైన ప్రజా మద్దతు నిదర్శమని అదే స్ఫూర్తితో మహిళల మీద జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం పోరాటాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు దేశంలో భూమికోసం, ఇళ్ల స్థలాల కోసం, రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. తెలంగాణ నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో తుపాకి పట్టి పోరాడి, నిజాంపాలను అంతమొందించిన మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇండ్ల స్థలాల పోరాటాలు పెద్దఎత్తున చేసిన సందర్భాలను గుర్తు చేశారు. మహిళలు కొత్తగూడెం, పాల్వంచలలో ఇండ్ల స్థలాల పోరాటాలు పెద్ద ఎత్తున నిర్వహించారని తెలిపారు. సుమారు 15వేల మంది ఈ పోరాటం పాల్గోన్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సారా వ్యతి రేక ఉద్యంమలో కదిలిన మహిళలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి. డబ్బులు తీసుకోకుండా ఓటు వేసే విధంగా మహిళలు కుటుంబాలను చైతన్యం చేయాలని, అప్పుడే నిజమైన ప్రజాస్వామం సాధించవచ్చన్నారు.

గుణాత్మక విద్యను పెంపొందించాలి

- మండల విద్యాధికారి రమ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణంలోని జగదీష్ కాలనీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి రమ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్సే-1పరీక్షల తీరుని గమనించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులందరూ ప్రతిరోజూ డైరీ రాయడాన్ని అభినందించారు. ఉపాధ్యాయులందరూ ప్రతిరోజు విద్యార్థుల ఆన్‌లైన్ అటెండెన్స్ నిర్వహణ బాగుందని మండలంలోని ఉపాధ్యాయులందరూ ఉదయం 10 గంటల లోపల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ని నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామ మాట్లాడుతూ... మండలంలోని అన్ని పాఠశాలలు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడానికి కోసం అందరూ ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా ఉపాధ్యాయ కృషి చేయాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మెరుగైన ఫలితాల కోసం ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన జరగాలని, ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆమె స్పష్టం చేశారు. మధ్యాహ్నం భోజనం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాశ్రీనివాస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ...

- క్రీడాకారిణికి ఆర్థిక సహకారం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తెలంగాణ అథ్లెంటిక్స్ అసోసియేషన్ హైదరాబాదులో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అండర్-16 విభాగంలో భద్రాచలానికి చెందిన ఎస్.కె అఫ్రీన్ జావిలిన్ త్రో లో ప్రథమ స్థానంలో నిలిచింది. త్వరలో ఒరిస్సా భువనేశ్వర్‌లో జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కింది. అయితే ఈ బాలిక తండ్రి నిరుపేద ఆటో డ్రైవర్ మస్తాన్ వలి ఈ పాపను భువనేశ్వర్ పంపించలేని ఆర్థిక దుస్థితిలో ఉండటంతో... విషయం తెలిసిన భద్రాచలం రోటరీ క్లబ్ ఉపాధ్యక్షులు ఎస్.కె అజీమ్ ప్రముఖ ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, లక్ష్మి దంపతుల దృష్టికి తీసుకువెళ్లడంతో దారి ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని బాలికకు అందజేశారు. అంతేకాకుండా ఆ బాలికను ఘనంగా సత్కరించారు. బాలిక తల్లిదండ్రులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు. అఫ్రీన్ జాతీయ స్థాయిలో కూడా రాణించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారునిగా వెలుగొందాలని దాతలు ఆకాంక్షించారు.

అవస్థలు పడుతున్నాం...రోడ్లు బాగు చేయండి

- పంచాయతీ సెక్రెటరీకి వినతి



నవతెలంగాణ-మణుగూరు

ఆగస్టు 31 శనివారం అర్ధరాత్రి వచ్చిన వరదల కారణంగా శాంతినగర్, పగిడేరు అంతర్గత రోడ్లు ధ్వంస అయ్యాయి. పగిడేరు పంచాయతీలో కురిసిన వర్షాలకు మొత్తం రోడ్లు గుంతల మయంగా మారినాయని గ్రామ యువకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం శాంతినగర్ పగిడేరు యువకులు పంచాయతీ కార్యదర్శి మనీ కిరణ్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. గ్రామాలలో నడవలేని స్థితిలో కంకర రాళ్ల రోడ్డుపై ఉన్నాయని, గ్రావెల్ మట్టితో మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆంజనేయస్వామి గుడి నుండి విప్పల గుంపు వరకు సీసీ రోడ్డు కొట్టకపోయిందని అన్నారు. వెంటనే బాగు చేయించాలని కోరారు. శరం నరేష్ ఇంటి ముందు నుండి కోరం చిన్న నరసయ్య చెందిన ఇంటి వరకు, ఏలేటి వీరయ్య ఇంటి నుండి కొడిశల కుంట వరకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. గుంతలు ఏర్పడ్డాయని, సీసీ రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి అని అన్నారు. గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో ఇతర పంచాయతీలకు అనేక సీసీ రోడ్లు ఎమ్మెల్యే మంజూరు చేయించారని, మారుమూల ప్రాంతమైన పగిడేరులో రోడ్లను వెంటనే శాంక్షన్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంజా రాజు, శ్రావణ్, వజ్జ ఆనంద్, స్రవంత్, శరం నరేష్, సుందర్, ఐక్కయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బందిని సత్కరించిన ముళ్ళపూడి

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వ్యక్తిగతంగా సహాయం అందిస్తున్న సిబ్బందిని తెలంగాణ ఉద్యమ నాయకులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు బుధవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ ఎల్లపుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేకి తోడుగా ఉండాలని క్యాంపు ఆఫీస్‌కు వచ్చే సామాన్యులకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను తొలగించి ఎమ్మెల్యే మరింత మంచిపేరు తీసుకురావాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు తంగెళ్ల విశ్వనాథం, తామ ఆదినారాయణ, నారం మురళి, మచ్చుల శివ, వాసం వేణు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి, ఇంటింటికీ వెళ్లి సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాలెం-సీతాయిగూడెం గ్రామాల మధ్య ఎదుళ్లవాగుపై రూ.1.60కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ తాను ముందు వరుసలో ఉంటానన్నాడు. ప్రజా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, నేరుగా పరిష్కరిస్తామన్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, ఆర్ఎ అక్బర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దారం గోవింద్ రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, అంకిరెడ్డి క్రిష్ణారెడ్డి, మాలోత్ బోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, సయ్యద్ రసూల్, సంకాశంకర్, రుక్మిణి, బుంగశ్రీను, అన్వర్, రియాజ్, బడుగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు సమరశీల పోరాటాలు

- సిద్ధం కావాలని రాష్ట్ర మహాసభ పిలుపు
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- పోరాటాలు, నిర్మాణ నివేదికకు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన ప్రతినిధులు



నవతెలంగాణ-కొత్తగూడెం

బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం సమస్యల పోరాటాలకు సిద్ధం కావాలని మహిళలకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 4వ రాష్ట్ర మహాసభ పిలుపు నిచ్చింది. మహిళలకు 33శాతం చట్ట సభల్లో రిజర్వేషన్ అమలు తక్షణమే అమల్లోకి తీసుకురావాలని మహాసభ డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులను ప్రోత్సహించే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం మనువాద భావజాలాన్ని విద్యావ్యవస్థలో జొప్పించడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నం చేస్తుందని దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని మహాసభ పేర్కొన్నది. గడిచిన మూడు సంవత్సరాల పోరాటాలను సమీక్షించి నూతన కర్తవ్యాలను, పోరాట ప్రణాళికను నిర్దేశించుకోవడం కోసం మల్లు స్వరాజ్యం నగర్, కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణం (కొత్తగూడెం క్లబ్) నందు రెండు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో కార్యదర్శి నివేదికను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మహాసభ ముందు ఉంచారు. 34 జిల్లాల నుంచి హాజరైన 600 మంది ప్రతినిధులు నివేదికలోని అంశాలన్నింటినీ జిల్లాల వారీగా చర్చించి వారి అనుభవాలను, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోరాటాలను సమీక్షిస్తూ మహాసభలో జిల్లాల వారి అభిప్రాయాలను తెలియజేశారు.

ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో గడిచిన మూడు సంవత్సరాల పాటు అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా ఇల్లు, ఇళ్ల స్థలాల సమస్య మీద రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని వీటి పైన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందని జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో మహిళలను సైతం నెల రోజులకుపైగా జైల్లో నిర్బంధించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, వేధింపులు, పరువు హత్యలకు, వ్యతిరేకంగా ఐద్వా పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలన మీద రాష్ట్ర ప్రజలకు, మహిళా లోకానికి తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిన నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక రకాల వాగ్దానాలు చేసిందని ఆ వాగ్దానాల అమలు కోసం తగిన కార్యచరణ కానీ నిధులు కేటాయింపు గాని చేయటం లేదని లక్ష్మి విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీల అమలు అటకెక్కించిందని నిశితంగా విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో కేవలం ఉచిత బస్సు మాత్రమే పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిందన్నారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో సమరశీల పోరాటాలకు అన్ని జిల్లాలలో మహిళలను సిద్ధం చేయాలని రాష్ట్ర మహాసభ పిలుపు నిచ్చింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో మద్యం, గంజాయి, హెరాయిన్, కోకేన్ వంటి ప్రమాదకరమైన డ్రగ్స్ తీవ్ర స్థాయిలో వ్యాపారం సాగుతుందని దీని ఫలితంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. మద్యపాన నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకునే విధంగా దశల వారి పోరాటాలను నిర్మించాలని మహాసభ పిలుపు నిచ్చింది. మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్రంలో కూడా మహిళలపై జరుగుతున్న హింస వేధింపులకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాటి అనుబంధ సంస్థలు మతం రంగు పులిమి విచ్ఛినకర శక్తులు తమ స్వార్థం కోసం అన్యాయానికి గురైన మహిళలను వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఇటువంటి ఘటనే ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిందని లక్ష్మి గుర్తు చేశారు. మహిళలపై జరుగుతున్న హింసకు కులం, మతం, ప్రాంతం అనేటువంటి వ్యత్యాసాలకు తావు లేకుండా దోషులు ఎవరైనా వారందరి పైన కఠినమైన చర్యలు తీసుకునే విధంగా పాలకవర్గాలు చర్యలు చేపట్టాలని అందుకోసం ఐద్వా పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మెరుగైన వైద్యం అందాలంటే మెరుగైన సౌకర్యాలు, అవసరమైన డాక్టర్లు, సిబ్బంది, మందులు అన్ని స్థాయిల్లోనూ ఉండేటట్టుగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన ప్రతినిధులు చర్చించిన కార్యకలాపాల నివేదికను, నిర్మాణ నివేదితను ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలని, అన్నిస్థాయిలోనూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించడం కోసం ఐద్వా కార్యకర్తలు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా ఐద్వాను మరింత విస్తరించాలని మహాసభ నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో అఖిలభారత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీకె.శ్రీమతి, మరియం ధావలె, కోశాధికారి ఎస్.పుణ్యవతి, జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర్ రామన్ పర్యవేక్షణ చేశారు.

రాష్ట్ర కార్యదర్శి నివేదికను 34 జిల్లాల నుంచి పాల్గొన్న ప్రతినిధుల చర్చలను వాటి సారాంశాన్ని అఖిలభారత నాయకత్వం దగ్గరుండి క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధికి పోరాటాల నిర్మాణానికి అవసరమైన సలహాలు, సూచనలు అఖిల భారత నాయకత్వం ఎప్పటికప్పుడు మహాసభలో చేశారు. రెండు రోజుల మహాసభకు అధ్యక్ష వర్గంగా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు పి.ప్రభావతి, గీతా రాణి, డి.అనిత, వినోద వ్యవహరించారు. మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, బుగ్గ వీటిసరళ, ఆశాలత, అనురాధ, మాచర్ల భారతి, రత్న మాల, బండి పద్మ డి.ఇందిర, కె.నాగలక్ష్మి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లైన్ మెన్ జగన్మోహన్ రెడ్డి సేవలు మరువలేనివి

- మాజీ వార్డు సభ్యులు బండారు శరత్ బాబు
- బదిలీ అయిన విద్యుత్ అధికారికి ఘన సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలోని 4వ వార్డు పరిధిలో కరెంటు లైన్ మెన్ ఏ.జగన్మోహన్ రెడ్డి సేవలు మరువలేనివని మాజీ నాల్గవ వార్డు మెంబర్ మెంబర్ బండారు శరత్ బాబు అన్నారు. వార్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న విద్యుత్ శాఖ లైన్ మెన్ జగన్మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండారు శరత్ బాబు మాట్లాడుతూ... వార్డు పరిధిలోని విద్యుత్ సరఫరాలో ఏ సమస్య వచ్చినా సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. నిజాయితీగా పనిచేసే అధికారులు బదిలీపై వెళ్లిన వారి సేవలు ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారని అన్నారు. అనంతరం వార్డు సభ్యులు జగన్మోహన్ రెడ్డిని శాలవాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి మెమెంటోని అందించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ధర్మం రీత్యా పనిచేశానని సహకరించిన వార్డు ప్రజలకు తనకు సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో తుమ్మలపల్లి ధనేశ్వరరావు, ఇజ్జడా రాంప్రసాద్, కోటగిరి వెంకటేశ్వరరావు, పద్మనాభుని రవికుమార్, పసుపులేటి వెంకటేష్, పసుపులేటి సత్యనారాయణ, అనుముల గంగాధర్ రావు, బోళ్ళ వెంకట్రావు, కాసా మల్లేశ్వరరావు, ఎస్.శేషగిరిరావు, శేషం వెంకట్, బోడాల సంపత్, పి.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఐద్వా పోరాట విజయాలు

- కార్యదర్శి మండలపు జ్యోతి



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐద్వా చేసిన అనేక పోరాటాలు బాధితులకు ఊరట కలిగించింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, దేశ వ్యాప్తంగా మహిళాపై జరుగుతున్న లైంగిక దాడులను ఖండిస్తు నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించాం. జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలను బాదితుల పక్కన నిలబడి వారినిక మనోధైర్యాన్ని నింపి, బాధితులకు ఊరట చేకూర్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకల పల్లిలో డ్రాక్రా రుణాలు కట్టలేని పరిస్థితిలో ఆదివాసీ గిరిజన మహిళాపై వేదింపులు, బెదిరింపులకు పాల్పడి ఖచ్చితంగా వసూలు చేయాలని చెప్పారు. ఈ విషయాన్ని పేపర్లో చూసిన ఐద్వా ఆదివాసీ గ్రామాల్లోకి వెళ్లి, మహిళతో మాట్లాడడం జరిగింది. వారికి ఏలాంటి ఉపాధి లేక డ్రాకా రుణాలు కట్టాలేరని, బ్యాంకు అధికారులకు విన్నవించడం జరిగిన నేపద్యం అధికారులు వెనుకకు తగ్గారు...జిల్లాలోని బూర్గంపాడు, సారపాక, ములకలపల్లి ప్రాంతాలలో బాలికలపై హింస జరిగింది. వీటిని ఐద్వా పరంగా నిలదీశాం. అడ్డుకున్నాం. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరిగింది. లక్ష్మీదేవిపల్లి మండలంలోని చింతవర్రే గ్రామంలోని పాఠశాలల్లో నలుగురు బాలికలపై స్కూల్ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీన్ని వెలుగులోకి రాకుండా, పంచాయితీల ద్వారా సద్దుమనిగే విధంగా చేశారు. మీడియా మిత్రుల ద్వారా తెలుసుకున్న తరువాత ఐద్వా ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకు వచ్చింది. చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిపై లైంగిక దాడి జరిగిందని ప్రభుత్వం గుర్తించి, అఘాయిత్యానికి పాల్పడిన ఉపాద్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేసింది. జైలుకు పంపించడం జరిగింది. ఐద్వా పోరాటంతో ఆనాటి కేసీఆర్ ప్రభుత్వ కదిలి విచ్చింది. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించారు. ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరిగే విధంగా ఐద్వా పోరాటాలు చేసింది. దుమ్ముగూడెం మండలంలో గర్భిణీ కాన్పుకోసం భద్రాచలం ఆసుపత్రికి వచ్చింది. ఆమెకు సరైన వైద్యం అందకపోగా, డాక్టర్లు లేరని వైద్య సిబ్బంది వైద్యం చేశారు. డాక్టర్లు లేనప్పుడు మరో ఆసుపత్రికి పంపించాల్సి ఉంది కానీ, అక్కడ ఉన్న వైద్య సిబ్బంది ఆసుపత్రులను ఉంచారు. తీరా ప్రసవ సమయంలో గర్భిణీ సరైన ప్రసవం కాలేక ఇబ్బంది పడింది. తల్లి, బిడ్డ మృతి చెందిన సంఘటన ఉంది. బాధితులకు ఆనాడు ఐద్వా అండగా నిలబడింది. స్థానిక ఎమ్మెల్యే సైతం తప్పించుకన్నారు. కానీ ఐద్వా నాయకులు నిలబడి బాదిత మహిళ కుటుంబానికి ధైర్యాన్ని ఇచింది. ఐటిడిఏ పీఓ వచ్చి నష్టపోయిన కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చేయడం జరిగింది. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్రేషన్ లేని కారణంగానే గిరిజన ఆదివాసి ప్రాంతాలలో ఎక్కువగా మహిళలు ప్రసవం సమయంలో మృతి చెందుతున్నారు. దీన్ని అరికట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు మహిళా వైద్యులు డ్యూటీలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 కేసుల వరకు పరిష్కారం చేసి బాధితులు పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే విధంగా ఐద్వా నిలబడింది. గ్రామంలో పిల్లల్ని ముగ్గురు పిల్లలు ఉంటారు.

విషాదం....

కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని చింత వర్రె గ్రామంలో పాఠశాల విద్యార్థులపై జరిగిన లైంగిక దాడిలో ఆనాడు ప్రభుత్వం దోషులను శిక్షించడం జరిగింది. ఫోక్సో కేసులో జైలుకు పంపించింది. టీచర్ ఉద్యోగం నుండి తొలగించారు. ఆ సంఘటన అనంతరం వారు ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతానికి తరలి వెళ్లారు. తాజాగా బాదిత చిన్నారి బుధవారం మరణించినట్లు సమాచారం రావడం బాధకరం. ఐద్వా మహాసభలు ఆ చిన్నారికి తీవ్ర సంతాపం, శ్రద్ధాంజలి గటిస్తున్నట్లు తెలిపారు.

విధుల్లో నిబద్ధత ఉద్యోగి గౌరవం పెంచుతుంది : ఏడీ

- చదివిన కళాశాలలోనే బోధన చేయడం అరుదైన అవకాశం : ప్రొఫెసర్ కేజీకే మూర్తి



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఉద్యోగిలో విధులు పట్ల నిబద్ధత, అంకిత భావం ఉన్న వారిపట్ల సమాజంలో వ్యక్తిగత గౌరవం పెంచుతుందని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్ కుమార్ అన్నారు. ఈ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి కార్యాలయంలో సాంకేతిక సహాయకులుగా బదిలీ అయిన డా.కె.గోపాలకృష్ణమూర్తి వీడ్కోలు సభను బుధవారం కళాశాల బోధనా సిబ్బంది కళాశాలలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి కళాశాలకు వెన్నుముక లాంటి వారని, ఆయనకు తన పనిపట్ల నిబద్ధత, పెద్దల పట్ల గౌరవం, కళాశాల అభివృద్ధికి తన శాయశక్తులా నిర్విరామంగా కృషి, కళాశాలలో ప్రతి ఒక్క విషయంపై ఆయనకున్న అవగాహనాశక్తి, చిత్తశుద్ధి, ఇతరుల పట్ల ఆయనకున్న అభిమానం, కళాశాల సామగ్రి అభివృద్ధికి ఆయన కృషి చిరస్మరణీయం అని కొనియాడారు. చదివిన కళాశాలలోనే సుదీర్ఘ కాలంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి, ఇప్పుడు విశ్వవిద్యాలయం ఉపకులపతి కార్యాలయంలో సాంకేతిక సహాయకులుగా ఒక గౌరవనీయమైన, కీలకమైన, ఉన్నత స్థానంలోకి బదిలీ కావడం హర్షణీయం అన్నారు.

గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ "చదివిన కళాశాలలోనే బోధన చేసే అవకాశం కలగడం అరుదైన అవకాశం అని" కళాశాలలో తన అనుభవాలను తోటి సిబ్బందితో పంచుకున్నారు. కళాశాలతో అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం తనకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం ఆయన బోధనా సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించి, కానుకలు, జ్ఞాపికలు అందించారు. బోధనా సిబ్బంది ప్రొఫెసర్స్ ఐ.వి.శ్రీనివాసరెడ్డి, కె.నాగాంజలి, యస్.మధుసూధన్ రెడ్డి, రాంప్రసాద్, రెడ్డి ప్రియ, జంబమ్మ, రమేష్, కే.శిరీష, శ్రీలత, పావని, కృష్ణ తేజ, దీపక్ రెడ్డి, చరిత, పావని, పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్

అశ్వారావుపేట అర్హులైన ఉపాధ్యాయులు అందరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా తమ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ సూచించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్హులైన ఉపాధ్యాయులు అందరూ ఫారం-19తో (ఆన్లైన్ / ఆఫ్ లైన్) తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ఓటు నమోదుకు ఉపాధ్యాయులు గత 6 సంవత్సరాలలో 3 సంవత్సరాలు పాటు ఏదైనా హై స్కూల్, తత్సమాన పైబడిన సంస్థ (ప్రభుత్వ, ప్రయివేట్) పాఠశాలలో విధులు నిర్వహించి ఉండాలని, ఓటు నమోదుకు 06 నవంబర్ 2014 చివరి తేదీ కావున అర్హులైన ఉపాధ్యాయులు అందరు ఫారం - 19 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి పొన్నగంటి ప్రసాదరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓ..మహిళా నీకు జేజేలు...



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలకు ఐద్వా ఇచ్చిన పిలుపుకి అక్టోబర్ 21వ తేదీ కొత్తగూడెం పట్టణంలో నగారా మోగింది...
మహిళా లోకం వేలాది సంఖ్యలో శ్రామిక మహిళ లోగో ఉన్న శ్వేత వర్ణ ఐద్వా జండాలను చేత బూని కొత్తగూడెం పట్టణంలోని పురవీధులలో ప్రజాస్వామ్యం సమానత్వం స్త్రీ విముక్తికై తమ గొంతులెత్తి నినదించారు...
మహిళ హక్కుల సాధనకై యుద్ధభేరి మోగించారు...
చూపరుల మనసుల్లో చైతన్య మహిళలుగా ముద్ర వేసారు.
తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన మహిళా బృందాలకు
విద్య వైద్యం ధరల పెరుగుదల మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై బృందా కారత్ ఇచ్చిన సందేశం చైతన్య పూర్వకమైన నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది.
అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం వర్ధిల్లాలి అని చేసిన ఆ నినాదాలకి...
ప్రకృతి సైతం మద్దతు తెలుపుతున్నట్లుగా అప్పటివరకు మండిన సూర్యుడు.....
నల్లని మబ్బుల చాటుకు వెళ్లి ప్రకృతి సైతం మహిళా లోకానికి మద్దతు తెలుపుతున్నట్లు వేడెక్కిన పట్టణం ఒక్కసారిగా చల్లబడింది...
గిరి పుత్రుడు డాక్టర్ మీడియం బాబురావు ఆత్మీయ ప్రసంగం అభిమానుల్ని గుండెలకు హత్తుకుంది.
ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావులే, పీకే.శ్రీమతిల ఉత్తేజ భరితమైన ప్రసంగాలతో ప్రాంగణమంతా వివిధ భాష సంగమాల సమ్మేళనంగా ప్రకాశించింది.
ఉద్యమాల పురిటి గడ్డ తెలంగాణ సాయుధ పోరాట ముద్దుబిడ్డ మల్లు స్వరాజ్యం నగర్‌లో దుర్గమ్మ ప్రాంగణంలో సిద్ధాంతం పట్ల గౌరవంతో ఐద్వా రాష్ట్ర మహాసభలకు వివిధ జిల్లాల నుండి ప్రతినిధులుగా హాజరైన మహిళా మణుల క్రమశిక్షణ మధ్య కేంద్ర రాష్ట్ర కమిటీ సభ్యుల చేతుల మీదుగా....అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జెండా ఆవిష్కరణతో.....సభా ప్రాంగణం కళకళలాడింది..
వర్ధిల్లాలి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం... జిందాబాద్ జిందాబాద్ ఐద్వా అనే నినాదాలు మిన్నంటగా..
సమాజ శ్రేయస్సు కై ఉద్యమ బాట పట్టిన వీర వనితలను చూసి ప్రాంగణం ఒక్కసారిగా పులకించింది.
అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కేంద్ర రాష్ట్ర కమిటీ అతిరథ మహారథుల ఆహ్వానాలతో రెడ్ సెల్యూట్ రెడ్ సెల్యూట్ నినాదాలతో మహాసభ ప్రారంభమైంది...
విచ్చేసిన ముఖ్య అతిథుల ప్రసంగాలు హాజరైన ప్రతినిధులలో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు మహిళలు బయటకి వచ్చి ఉద్యమిస్తామంటే కుటుంబ సభ్యుల సైతం సహకరించనీ, కనీస సదుపాయాలు లేని కాలంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళా ఉద్యమాలకు పురుడు పోసిన సీనియర్ నాయకురాళ్లు ఏలూరి జయమ్మ, సర్వేశ్వరమ్మ సమావేశానికి హాజరు కావడం, వారిని సన్మానించుకోవడం, 95 దాటిన వయసులో వారి ఉద్యమ అనుభవాలను పంచుకోవడంతో సమావేశ ప్రాంగణమంతా ఒక్కసారిగా ఉద్యమస్ఫూర్తితో నిండుకుండలా తొణికిసలాడని మనోధైర్యం నిండినట్లయ్యింది.

విద్యార్థి...యువజన...వ్యవసాయ...కార్మిక..వివిధ సంఘాల మద్దతులతో మహిళల పట్ల వారి ఉద్యమాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతూ మీ ఉద్యమాలకు మా సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తామంటూ వారు చేసిన ప్రసంగాలు మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కాక ఇంకాస్త ముందడుగు వేసే తెగువని నింపాయి.

తెలంగాణ రాష్ట్ర మహిళా ఉద్యమాలను ముందుకు నడిపిస్తున్న అధ్యక్ష,ఉపాధ్యక్ష కార్యదర్శులు వారి అనుభవాలను వారి సందే స్వరూపంలో తెలియజేయగా.. ఐత్తుల హైమావతమ్మ తరానికి..తరానికి ఉద్యమ విధానాలలో అనుభవాలలో వ్యత్యాసాలను తన ప్రసంగంతో తెలియజేయగా
మధ్య మధ్యలో ఉద్యమాల పాటలతో మహిళలు ఉర్రూతలూగించారు.

మూడు సంవత్సరాల మహిళా ఉద్యమాల నిర్మాణాల ఫలితమైన కార్యదర్శి నివేదికతో మరొక్కసారి హాజరైన ప్రతినిధులందరూ తాము చేసిన పోరాటాలను తలచుకుంటూ లోపాలను సరిచేసుకుంటూ.. భవిష్యత్తు ప్రణాళికలు వేసుకుంటూ ఎంతో క్రమశిక్షణతో సమావేశాన్ని ముందుకు నడిపించారు...

అనంతరం జిల్లాలు వారిగా జరిగిన చర్చల్లో ప్రతినిధులందరూ వారి వారి జిల్లా ప్రతినిధులతో సమావేశమై వారి ఉద్యమాలపై నిర్మాణాలపై చర్చించుకుని ఒక్కొక్క జిల్లాలు వారీగా వేదికపై వారి అనుభవాలను, ఆవేదనలను, గుణపాఠాలు తీసుకొని మహిళా సంఘ నిర్మాణానికై ప్రతినబునారు..

అవనిలో సగం...! హక్కుల్లో సగం...!! శ్రమలో సగం...!!! అన్నింటా మనమే...
మనమే అన్ని అంటూ....
గొంతెత్తి చాటినారు...

వర్ధిల్లాలి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వర్ధిల్లాలి..

మీ
పూర్ణిమరామ్
భద్రాచలం

ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్ట్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని సీతానగరం గ్రామ శివారులోని క్రాస్ రోడ్ వద్ద దుమ్ముగూడెం పోలీసులు, స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు తెల్లటి సంచులతో అనుమానస్పాతంగా వెళ్లడాన్ని పోలీసులు గుర్తించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరుకు చెందిన పోడియం కములు, మడకం సోంబారు లుగా వీరిని గుర్తించారు. వీరిద్దరూ గంగలూరు మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి మొడియం దినేష్ ఆదేశాల మేరకు గంపూర్ ఆర్ పీసీ మలేషియా కమాండర్ మూడం వీధ తో కలిసి పేలుడు పదార్థాల కోసం గంగళూరు ఏరియా కమిటీ కార్యదర్శి మొడియం దినేష్ ఇచ్చిన రూ. 20 వేలు తీసుకుని దాదాపు నెల రోజుల క్రితం కుక్కునూరు గ్రామం వెళ్ళి, అక్కడే మిర్చి తోటలలో కూలి పనులు చేసుకుంటూ మంగళవారం మూడం వీధ కోర్డెక్స్ వైర్లను తీసుకుని వచ్చి, వీరిద్దరికీ ఇచ్చి తీసుకువెళ్ళి, నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీ గంగళూరు ఏరియా కమిటీ కార్యదర్శి మొడియం దినేష్‌కు ఇవ్వమని చెప్పడంతో ఆ వైర్లను తీసుకుని వీరు ఇరువురు బుధవారం కుక్కునూరు నుండి బయలుదేరి గంగళూరు ఏరియా కమిటీ సెక్రెటరీ మొడియం దినేష్ ను కలసి ఆ వైర్లను ఇవ్వడానికి వెళ్తున్నారని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. 50 మీటర్ల పొడవు కలిగిన వైర్లను, రూ.11,500 ల నగదును వారి వద్ద నుంచి స్వాదీన పర్చుకుని, వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించగా ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ(ఎం) మండల మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కూసుమంచి

ఈనెల 26 న మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) 10వ మండల మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మహాసభకు సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకులు పాల్గొంటారని కావున పార్టీ సభ్యులు, సానుభూతిపరులు అత్యధిక సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

'విద్యార్థులకు మానసిక క్షోభ'

నవతెలంగాణ-పాల్వంచ

అధిక ఫీజులతో ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుమిత్రా దేవి, లాయర్ సాదిక్ పాషాకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తూ కొన్ని విద్యాసంస్థలు సాధారణ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. ఇష్టానుసారంగా దోచుకుంటున్న సంభందిత శాఖ అధికారులు పట్టించుకోక పొవడం పాలు అనుమానాలకు తావిస్తుందనీ పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు దండుకోవడమే కాకుండా కనీస నిబంధనలను పాటించడం లేదని విమర్శించారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 25% సీట్లను ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను ఏ ఒక్క పాఠశాల యాజమాన్యం పాటించడం లేదని వివరించారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటి కైన ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చే ముడుపుల మత్తును పక్కనపెట్టి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, బహుజన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భారతీయ గోర్ బంజారా పోరాట సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, బీఎస్పీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు అన్నారు. బుధవారం తక్షణమే మండలం కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ బస్సు సెంటర్లు నిర్మించడానికి ఖమ్మం రీజినల్ మేనేజర్‌కి మీ దోరాగా లెటర్ అందేలాగా కృషి చేసి సమస్యను పరిష్కార దశగా అడుగులు వేయాలి అంటూ కొత్తగూడెం ఆర్టిసి సూపర్డెంట్‌కి వినతి పత్రం అందజేశారు.

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుపై అవగాహన కరువు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో ప్రవేశ పెట్టిన 'ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్' పథకానికి ఆళ్ళపల్లి మండలంలో అర్హులైన యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సదవకాశం నిరుపేదలకు కల్పించింది. ఈ ఇంటర్న్‌షిప్ కు ఎన్నికైన యువకులకు స్టైఫండ్ కింద ముందుగా రూ.6000/- లు అనంతరం ప్రతి నెల రూ.5000/-ల చొప్పున స్టైఫండ్ కేంద్రం ప్రభుత్వం అందిస్తుంది. దీనికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ పాలిటెక్నిక్ డిప్లొమా, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీ. ఫార్మసీ చదివిన 21 నుండి 24 ఏండ్ల మధ్య వయస్సు కలిగి విద్యార్థులకు వర్తిస్తుంది. ఇట్టి వారి సంవత్సర ఆదాయం రూ.8 లక్షల లోపు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని 500 ప్రసిద్ధ కంపెనీలు ఈ యొక్క ఇంటర్న్‌షిప్ అందించడంలో భాగస్వామయ్యాయి. ఈ నెల 25వ తేదీన ముగిసే ఈ అవకాశాన్ని మండలంలోని ఆసక్తిగల యువకులు తమ ఆధార్ కార్డ్ లింక్ అయి ఉన్న ఫోన్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు తమ వివరాలను pminternship.mca.gov.in అను వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలి. ఈ యొక్క ఇంటర్న్‌షిప్ పథకమునకు ఎన్నికైనా యువకులకు తాము నమోదు చేసుకున్న కంపెనీ, దరఖాస్తుదారుని సొంత జిల్లాలోని తను నివసిస్తున్న ప్రాంతంలో ఒక సంవత్సరం పాటు అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించింది. కావున మండలంలోని అన్ని వర్గాలకు చెందిన వారు ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి సమాచారం కొరకు ఆశావహులు 8520860785 కు సంప్రదిం చాలి. దరఖాస్తు చేసుకోవడానికి రెండు రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో.. ఇట్టి విషయాన్ని సంబంధిత అధికారులు గాని, పాలకులు గాని మండలంలోని విద్యార్థులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.



రైతులు మద్దతు ధర పొందేలా చూడాలి

- రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించి ప్రభుత్వ మద్దతు ధర పొందేలా చూడాలని డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ద్వారా 8 మండలాల్లో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు నియమితులైన సెంటర్ ఇంచార్జ్ లకు డీసీఎంఎస్ కార్యాలయంలో అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సీజన్‌కుగాను వరి ఏ గ్రేడ్ రకానికి రూ.2350, సాధారణ రకానికి రూ.2300 ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జ్‌లు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే ధాన్యం కొనుగోలు చేసి రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం వద్దనే ఇంచార్జ్ లు ఉండి రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ పి.రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలను సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో పర్యటిస్తున్న శిక్షణ ఐఏఎం, ఐపీఎస్ లు గురువారం రైతు వేధికలు అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లను సందర్శించారు. రైతు వేధికలో ఏవో బీ.అశోక్‌కుమార్ ను రైతులకు అందుతున్న సేవలు, పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల శిక్షణ పర్యటనలో భాగంగా రాజస్థాన్, డిల్లీ, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఐఏఎస్‌లు తేజస్విని తబాని, అనితామీనా, వైభవ్‌మీనా, అల్టామాష్‌ఘాజీ, విపుల్ సింఘాల్ లు పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శిస్తున్నారు. ఉసిరికాయలపల్లిలో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సోలార్ ప్లాంట్ ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించి ఉత్పత్తి సామర్థ్యం, పంపిణి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులతో సరదా గడిపారు. వరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

'అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-బోనకల్

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నమోదులో అక్రమాలకు పాల్పడిన, అర్హులైన రైతులను నష్టపరిచిన వ్యవసాయ శాఖ మండల అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను సిపిఐ బృందం పరిశీలించిందన్నారు. పారదర్శకంగా వ్యవసాయ అధికారులు సమగ్ర పంట నష్ట సర్వే చేపట్టి, అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని నాడు డిమాండ్ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. వ్యవసాయ అధికారులు కాసులకి కక్కుర్తి పడి తప్పుడు సర్వేలు చేపట్టి అర్హులైన రైతులను నష్టపరిచారన్నారు. ఉప ముఖ్యమంత్రి ఇలాకాలోనే ఈ రకంగా రైతుల నష్టపోయారంటే ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. పంట వేయకపోయినా పరిహారం పొందుతున్న అక్రమార్కుల జాబితాను వెంటనే తొలగించి, అర్హులైన వారిని ఆ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, మండల సహాయ కార్యదర్శి ఆకిన పవన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పీ. శ్రీజ

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై అదనపు కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టగా, 801 పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, 147 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని, పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో డిఎంఎఫ్‌టి క్రింద నిధులు అందుబాటులో ఉన్నాయని, పనుల పురోగతి ప్రకారం వెంట వెంటనే బిల్లుల చెల్లింపు పూర్తి చేస్తామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఎంపిడిఓల దగ్గర నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులకు సంబంధించిన చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలల్లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు, ఎన్ని పనులు పూర్తి చేశామని, చెల్లింపులు ఎన్ని జరిగాయని, ఎప్పటి కప్పుడు రివ్యూ చేసుకోవాలని అన్నారు. మన జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులు చేసేందుకు ముందస్తుగా అడ్వాన్స్ క్రింద 16 కోట్ల 18 లక్షలు మంజూరు చేశామని, వీటి చెల్లింపుల వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని ఎంపిడిఓలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టె పనుల కోసం 12 కోట్ల 28 లక్షలు విడుదల చేయగా ఇప్పటి వరకు 6 కోట్ల 49 లక్షల రూపాయలు చెల్లింపు చేయడం జరిగిందని, 4 కోట్ల 49 లక్షల వరకు ఎంపీడీవోలు వద్ద అందుబాటులో ఉన్నాయని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద 49 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మండలాల వారీగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై సమీక్షించి, పనులు త్వరగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ, అధికారులు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ శాఖల ఈఈ., డిఈ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గిరిజనుల సమస్యలపై గవర్నర్ స్పందించాలి

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ బాలాజీ, భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-కొణిజర్ల(ఏన్కూర్)



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా ఏజెన్సీ మండలాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గవర్నర్ దృష్టి పెట్టాలని, సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు. బుధవారం గిరిజన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం వాంకుడోత్ హథిరాం అధ్యక్షతన మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ మండలాల్లో భూ సమస్య తీవ్రంగా ఉందని, ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇల్లు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, సీనియర్ ఐఏఎస్ అధికారితో ఏజెన్సీ మండలాల్లో భూ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు విద్య, వైద్యం సక్రమంగా అందే విధంగా చూడాలని కోరారు. గిరిజన కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలను గవర్నర్ ద్వారా గిరిజనులకు ఉపయోగపడే విధంగా కార్యాచరణ రాష్ట్రంలో చేపట్టాలని వారు తెలిపారు. నవంబర్ 5న ఖమ్మంలో నిర్వహించే గిరిజన సమ్మేళనం జయప్రదం కై గిరిజనులు ఉద్యమ శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భూక్యా లచ్చునాయక్, బండ్ల చిన్న జోగయ్య, బానోత్ మధు, లాకావత్ శ్రీనివాస్ నాయక్, రాములు భీమా తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-కరకగూడెం



పోలీస్ సిబ్బంది విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పి రవీందర్‌రెడ్డిని పోలీస్ గౌరవ వందనంతో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజేందర్ స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నీట్ టర్న్ ఔట్ చూడటం జరిగింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి తగు సలహాలు,సూచనలు ఇచ్చారు. గ్రామాలలో ప్రజలతో మమేకమైతు అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజేందర్, రైటర్ దుర్గారావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమోహన్ , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీ నాయకునిగా ఉంటూ మాణిక్యారం గ్రామపంచాయతీ కార్మికుడిగా ఈదర సత్యనారాయణ సేవలందించారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. గురువారం కారేపేల్లి మండల మాణిక్యారంలో జీపీ కార్మికునిగా పని చేసిన ఈదర సత్యనారాయణ సంస్మరణ కార్యక్రమంలో జరిగింది. సత్యనారాయణ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్ల ఆర్పించారు. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం మాణిక్యారం జీపికి సేవలందించిన ఈదర సత్యనారాయణ అందరి మన్నలను పొందారన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర నాయకులు దాసరి మల్లయ్య, దమ్మాలపాటి ప్రభాకర్, కరపటిసీతారాములు, మాజీ సర్పంచ్‌లు కుర్సం సత్యనారాయణ, భూక్యా రంగారావు, గ్రామపెద్దలు తుళ్లూరి వెంకటేశ్వర్లు, సూర సుబ్బారావు, నామా బుచ్చయ్య చాగంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి ట్రాన్స్‌కో ఏఈగా సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల ట్రాన్స్‌కో ఏఈ గా వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం రూరల్ డివిజనల్‌లో టెక్నికల్ ఏఈగా పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి బదిలీపై కారేపల్లికి రాగా ఇక్క పని చేస్తున్న భూక్యా విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ స్టోర్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందిస్తామన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

నవతెలంగాణ-కారేపల్లి

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సింగరేణి ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ ప్రశాంతి, ఎస్సై వసంతలక్ష్మిలు తెలిపారు. ఇటివల ఎక్సైజ్ దాడులలో మద్య సరఫరా చేస్తూ పట్టుబడి న రెండు ద్విచక్రవాహనాలను వేలం వేయటం జరుగుతుందన్నారు. ఆసక్తి కల వారు కారేపల్లి క్రాస్‌రోడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో జరుగు వేలంకు హాజరుకావచ్చన్నారు.

ఆదివాసీలకు కొమరం భీం స్ఫూర్తి ప్రదాత



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆదివాసీలకు స్ఫూర్తి ప్రదాతగా.. ఒక దిక్సూచిగా.. చరిత్ర మరువని యోధుడు కొమరం భీమ్ అని ఉమ్మడి ఆళ్ళపల్లి, గుండాల మండలాల పీఏసీఎస్ చైర్మెన్ గొగ్గెల రామయ్య, తాజా మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ కొమరం హనుమంతరావు, కోండ్రు మంజు భార్గవి వ్యాఖ్యానించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొమరం భీమ్ 84వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పాయం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అడవి బిడ్డల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేయడానికి అరణ్యంలో ఉదయించిన సూర్యుడు కొమరం భీమ్ అని చెప్పుకొచ్చారు. ఆదివాసుల జల్ జంగిల్ జమీన్ కోసం జంగ్ నడిపిన గిరిజన విప్లవ భీముడని కొనియాడారు. ఆదివాసి తెగల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాలను సందర్భోచితం చేశారు. ముఖ్యంగా దేశంలో భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు కొమరం భీమ్ బాణాలు ఎక్కు పెట్టారన్నారు. ఆదివాసీ ఉనికి, వికాసానికి ఆదివాసీ యువత, ఉద్యోగ సంఘాల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండలంలో ఎవరైనా రెవెన్యూ భూముల్లో అక్రమ కట్టడాలు చేపట్టడం సహేతుకం కాదన్నారు. అటువంటి వారిపై ఆర్.టి.ఐ. వేయడానికి సైతం వెనుకాడమని హెచ్చరించారు. ఆదివాసీ యువత చెడు వ్యసనాలు వీడి మండలంలో త్వరలో ఆదివాసీ సంస్కృతి



సంప్రదాయాలను అద్దంపట్టే కల్చరల్ ప్రోగ్రాంలో చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. అడవి తల్లి ముద్దు బిడ్డ కొమరం భీం పోరాట స్ఫూర్తితో సమాజ శ్రేయస్సు కొరకు యువతి, యువకులు ఉద్యమంలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీఏ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ సాంబశివరావు, ఏటీఏ రాష్ట్ర నాయకులు ముడిగ సమ్మయ్య, ఉపాధ్యాయులు హరినాథ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పూకె కోటేశ్వరి, ఆదివాసీ యువకులు లక్ష్మయ్య, రమేష్, వినోద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సమ్మేళనం జయప్రదం చేయండి

గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మూడు గన్యా నాయక్

నవతెలంగాణ -కూసుమంచి

నవంబర్ 5న ఖమ్మం లో జరిగే గిరిజన సమ్మేళనంను జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మూడు గన్యానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో సంఘం సభ్యులతో కలిసి ఆయన గిరిజన సంఘం పోస్టర్లును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లింగారం తండా మాజీ సర్పంచ్ బానోతు నాగేశ్వరావు, కిషన్, సైదులు గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని "ముదిగొండ"

నవతెలంగాణ- ముదిగొండ



ముదిగొండ మండలంగా ఏర్పడి సుమారు 40 సంవత్సరాలు కావస్తుంది. నేటి వరకూ అభివృద్ధికి నోచుకోలేదు. నాడు ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం నాలుగు మండలాలను కలిపి నియోజకవర్గ కేంద్రంగా పాలేరును ఏర్పాటు చేశారు. పాలేరు నియోజకవర్గంలో ఉన్న ముదిగొండ ఆనాడు కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న నేతలు ముదిగొండ మండల ప్రజలకు కావాల్సన మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేసి ప్రజలకు ఇండ్లు, ఇంటి స్థలాలు మంజూరుతోపాటు, నిర్మాణం చేయించారు. విద్యుత్, రోడ్డు రవాణా సౌకర్యంతో పాటు, చదువుకునేందుకు పాఠశాలల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రజలు ఉంటున్న ఇండ్లు ఆనాడు ముదిగొండ పాలేరు నియోజకవర్గంలో ఉన్నప్పుడే ప్రజలను వరించాయి. నాటి ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

డీలిమిటేషన్‌లో భాగంగా పాలేరు నియోజకవర్గంలో ఉన్న ముదిగొండను విడదీసి 2009లో మధిర నియోజకవర్గంలో కలపటంతో జనరల్‌గా ఉన్న మధిర నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గంగా మారింది. దీంతో అప్పటినుండి కాంగ్రెస్ పార్టీ నేత మల్లు భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా వరుసగా గెలుస్తూ ప్రస్తుతం రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్న విషయం విధితమే. రాష్ట్రంలో అనేక రాజకీయ సమీకరణలు జరిగిన నేపథ్యంలో మధిర నియోజకవర్గం మాత్రం కాంగ్రెస్ ఖాతాలోనే కొనసాగుతుంది. పదేండ్ల పాటు బీఆర్ఎస్ పార్టీలో రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో ముదిగొండకు నిధులు మంజూరు కాలేదు. దీంతో నాయకులు మాటలతో కాలం వెళ్లదీశారు. బీఆర్ఎస్‌పై వ్యతిరేకత పెరగటంతో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టపెట్టారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం వచ్చి పది నెలలు కావస్తున్నా ముదిగొండ అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు.



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతం నుండి వెంకటాపురం వరకు ప్రధాన రహదారి ఇరువైపులా సైడ్ డ్రైన్ నిర్మాణం, డివైడర్‌తో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజాప్రతినిధుల కల కలగానే మిగిలింది. దుమ్ము,ధూళి కాలుష్యంతో మండల ప్రజలు అనారోగ్య బారిన పడి సతమతమవుతున్నారు. మధిర నియోజకవర్గంలో బోనకల్లు, మధిర ప్రజాప్రతినిధులు, నాయకులు నిధులు కోసం కొట్లాడి, మధిరకు రింగ్ రోడ్డు, బోనకల్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ తెచ్చుకున్నారు. ముదిగొండకు మాత్రం శూన్యం. స్థానిక నాయకులు పైరవీలకే పరిమితం అవుతున్నారనే తప్ప ముదిగొండ అభివృద్ధి కోసం నిధులు తెచ్చుకోవాలనే కాంక్ష లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు ముదిగొండ అభివృద్ధిపై దృష్టి పెట్టి, రాష్ట్ర డిప్యూటీ సీఎం, స్థానిక ఎంఎల్ఏ మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడి నిధులు తీసుకొచ్చి ముదిగొండ మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు సందర్శకులు పెంచేలా చర్యలు

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- ఖమ్మం



వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు సందర్శకుల సంఖ్య పెంచే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పరిశీలించారు. కమాండర్ జీపులో సుమారు 4 కిలోమీటర్ల మేర పరిధి గల వెలుగు మట్ల అర్బన్ పార్కులో ప్రయాణించి గోల్డెన్ ఓరియల్ టవర్ ఎక్కి పార్క్ చుట్టుపక్కల కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు పార్కుకు ఎంత మంది సందర్శకులు వస్తున్నారని, ఎంత ఆదాయం సమకూరుతుంది, పార్క్ నిర్వహణకు అవుతున్న ఖర్చు మొదలగు వివరాలను జిల్లా అటవీ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పార్క్ లో ఉన్న సౌకర్యాలు మొదలగు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెలుగు మట్ల అర్బన్ పార్క్ లో యోగా షెడ్, పిల్లల ఆట స్థలం, రాశీ, కార్తిక నక్షత్ర వనం, ఓపెన్ జిమ్, ల్యాండ్ స్కేప్ గార్డెన్, బటర్ ఫ్లై గార్డెన్, పాండ్, సైక్లింగ్ షెడ్, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాచ్ టవర్ లను సరిగ్గా వినియోగిస్తూ సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వెలుగు మట్ల అర్బన్ పార్క్ ను ప్రభుత్వ పాఠశాలల పిల్లలు సందర్శించి ఆహ్లాదంగా గడిపేలా కార్యక్రమం తయారు చేస్తామని అన్నారు. పార్క్ కు సందర్శకుల సంఖ్య పెంచే దిశగా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటివి పెంచాలని అన్నారు. బస్ స్టాప్ నుంచి వెలుగు మట్ల అర్బన్ పార్క్ వరకు మిని బస్ నడిపే ప్రతిపాదన పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఎఫ్.డి.ఓ. వి. మంజుల, ఎఫ్.ఆర్.ఓ. జి. నాగేశ్వర్ రావు, ఖమ్మం టాస్క్ ఫోర్స్ ఎఫ్ఆర్ఓ. పి.శ్రీనివాస్ రావు, టీం మెంబర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

వినియోగదారులకు జొమాటో షాక్

- డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు



బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో తన వినియోగదారులపై మరోమారు భారం పెంచాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.10కి పెంచింది. ఇంతక్రితం ప్రతి ఆర్డర్‌పై రూ.7 వసూలు చేస్తుంది. దీనికి అదనంగా మరో రూ.3 పెంచినట్టు వెల్లడించింది. దేశంలో కొనసాగుతున్న పండుగ సీజన్ సందర్భంగా వినియోగదారులకు తమ సర్వీసుల్ని విజయవంతంగా అందించేందుకు వీలుగా ఈ ఫీజును పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. తొలిసారి ప్లాట్‌ఫామ్ ఫీజును 2023లో ప్రవేశపెట్టింది. అప్పుడు రూ.2గా ఉండగా.. దీన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ఈ సంస్థ రోజుకు సగటున 20-25 లక్షల ఫుడ్ ఆర్డర్లను డెలివరీ చేస్తోందని అంచనా.

బిగ్ సీలో దీపావళి డబుల్ ధమాకా ఆఫర్లు

నవతెలంగాణ- హైదరాబాద్



ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ కొనుగోలుదారులను ఆకర్షించడానికి దీపావళి పండుగ సందర్భంగా డబుల్ ధమాకా ఆఫర్లను ప్రకటించింది. ఈ సీజన్‌లో నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామని బిగ్ సీ సీఎండీ యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు విలువ చేసే మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా పొందవచ్చన్నారు. రూ12వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, అదే విధంగా రూ.5,999 విలువ గల ఖచ్చితమైన బహుమతిని కూడా అందిస్తున్నామన్నారు. ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్ కొనుగోలు చేసే సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ మొబైల్ కొనుగోళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైకులు, మొబైల్స్ తదితర బహుమతులను గెలుచుకోవచ్చన్నారు. బ్రాండెడ్ పరికరాలపై 51 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్‌లను కొనుగోలు చేయవచ్చన్నారు.

బీమా రంగంలోకి జియో ఫైనాన్షియల్..!

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసు బీమా రంగంలో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇప్పటికే ఈ అంశంపై అలియాంజ్ ఎస్ఈతో జట్టు కట్టేందుకు చర్చలు జరుపుతోందని సమాచారం. జర్మనీకి చెందిన అలియాంజ్ భారత్‌లో ఇప్పటికే ఉన్న రెండు సంయుక్త భాగస్వామ్య సంస్థలను రద్దు చేసుకోవాలని భావిస్తోంది. ఈక్రమంలో అలియాంజ్, జియో కలిసి జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ సేవల సంస్థను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి.

ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్యం

హైదరాబాద్ : ఐఓసీఎల్, సన్ మొబిలిటీ జాయింట్ వెంచర్ అయినా ఇండోఫాస్ట్ ఎనర్జీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు పముఖ క్యాబ్ సేవల అగ్రిగేటర్ రాపిడో వెల్లడించింది. ఈ ఒప్పందంలో భాగంగా 10,000 పియాజియో త్రిచక్ర విద్యుత్ ఆటోలను ప్రవేశపెట్టనున్నామని తెలిపింది. వచ్చే 24 మాసాల్లో వీటిని హైదరాబాద్, బెంగళూరు ఇతర దక్షిణ ప్రధాన నగరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నామని పేర్కొంది. 2024 డిసెంబర్ నాటికి 1,000 ఈవీలను రైడర్లకు అందించనున్నామన్నారు.

డిస్కంల ప్రతిపాదనలు తిరస్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ప్రతిపాదించిన 2024-25 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు (ఏఆర్ఆర్), 2025 నుంచి 2029 వరకు ఐదవ నియంత్రణ కాలానికి సంబంధించిన వ్యాపార, ఆదాయ అవశ్యకత, వీలింగ్ చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలపై బహిరంగ విచారణ జరిగింది. ఈ ప్రతిపాదనల్ని తిరస్కరించాలని పిటీషన్‌దారులు ముక్తకంఠంతో కమిషన్‌కు నివేదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్ మధుసూదనాచారి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టి వల్ల విద్యుత్‌రంగంలో తెలంగాణ స్వర్ణయుగం అయ్యిందన్నారు. వ్యవస్థాపక సామర్థ్యం 7 వేల మెగావాట్ల నుంచి 24 వేల మెగావాట్ల వరకు చేరిందనీ, లాభాలు గడించే సంస్థలా దీన్ని చూడొద్దని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెంచొద్దనీ, ప్రభుత్వమే సబ్సిడీలు ప్రకటించి, ఆ భారం భరించాలని కోరారు. దీనిపై విద్యుత్‌రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వమే అన్నింటికీ సబ్సిడీలు ఇస్తే, ఈఆర్సీ, ఏఆర్ఆర్‌లు, బహిరంగ విచారణలు ఏవీ అవసరం లేదని అన్నారు. ఏ విధానాలతో విద్యుత్ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయో వాటిని సమీక్షించాలే తప్ప, అన్నింటినీ ప్రభుత్వమే భరించాలి అనడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలపై ఒకసారి రూ.5,600 కోట్లు, మరోసారి దాదాపు రూ.7,800 కోట్ల విద్యుత్ భారాలు మోపారని గుర్తుచేశారు. వచ్చే ఐదేండ్లలో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని విద్యుత్‌శాఖ మంత్రి ప్రకటించారనీ, ఇప్పటికే మిగులు విద్యుత్‌ను ఏం చేసుకోవాలో అర్థంకాక డిస్కంలు తలలు పట్టుకుంటుంటే, మళ్లీ అదనంగా వచ్చే విద్యుత్‌ను ఏం చేసుకుంటారని ప్రశ్నించారు. ఓవైపు మిగులు విద్యుత్ అంటూనే ప్రభుత్వరంగంలోని జెన్‌కో యూనిట్లను బ్యాకింగ్‌డౌన్ చేస్తున్నారన్నారు. ఈఆర్సీ కూడా వెనుకాముందు ఆలోచించకుండా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పీపీఏ) అనుమతులు ఇచ్చేసిందని ఆక్షేపించారు. అధిక ధరలకు బహిరంగ మార్కెట్ నుంచి మనం కరెంటును కొని, మన మిగులు విద్యుత్‌ను అతితక్కువ ధరకు అమ్ముతున్నామని గుర్తుచేశారు. మిగులు విద్యుత్‌ను నియంత్రించకుంటే ఆ భారం తిరిగి వినియోగదారులపైనే పడుతుందని చెప్పారు. ఈ విషయంలో డిస్కంలు పారదర్శకంగా వ్యవహరించట్లేదని విమర్శించారు. ఫిక్స్‌డ్ చార్జీలను ఆ స్థాయిలో పెంచాల్సిన అవసరం లేదని సూచించారు. కేవలం రూ.1,221 కోట్ల ఆదాయం కోసం టారిఫ్ ప్రతిపాదనలు చేశారనీ, ఈ సొమ్ము వస్తే డిస్కంల కష్టాలు తీరతాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలు రాబట్టుకోవాలనీ, అంతర్గత సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. డిస్కంల ప్రతిపాదనల్ని తిరస్కరించాలని కోరారు. భారత్ కిసాన్ మోర్చాకు చెందిన పలువురు కార్యకర్తలు డిస్కంల ప్రతిపాదనలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పలు స్థానిక సమస్యల్ని ప్రస్తావించారు. సంస్థలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించారు. విద్యుద్ఘాతాలతో సంభవించిన వ్యక్తుల మరణాలు, పశుమరణాలు, పరిహారాల చెల్లింపు, పనుల్లో జాప్యత వంటి అంశాలపై అధికారుల్ని వివరణ అడిగారు.

చార్జీల పెంపు లేదు-సీఎమ్‌డీ

కరెంటు చార్జీల పెంపు ఉండబోదనీ, సామాన్యులపై ఎలాంటి ఆర్థిక భారాలు మోపట్లేదని టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ స్పష్టం చేశారు. కేవలం 300 యూనిట్ల కంటే ఎక్కువ వినియోగించేవారి ఫిక్స్‌డ్ చార్జీని మాత్రమే రూ.50కి పెంచాలని ప్రతిపాదించామన్నారు. హెచ్‌టీ వినియోగదారులపై కూడా చార్జీల భారం ఉండదని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు ఉండబోవనీ, వారిని ప్రోత్సహించేందుకే ఎలాంటి ఆర్థిక భారాలు వేయలేదన్నారు. తమ శాఖ పరిధిలో ఫ్యూస్, ఇతర సామాగ్రి మాయం అవుతున్నాయనీ, ఆ విషయాలు తన దృష్టికి వచ్చాయని చెప్పారు. దానికోసమే ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించి, డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. అనివార్య కారణాలతో నిర్దేశిత సమయంలో ఫైలింగ్స్ చేయలేదనీ, కోట్లమంది ప్రజలకు సంబంధించిన విషయం కాబట్టి ఇకపై అలాంటి పొరపాట్లు చేయబోమని అన్నారు.

ఏసీబీ వలలో 37 మంది...

2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు 37 మంది డిస్కం ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డారని సీఎమ్‌డీ తెలిపారు. వారందరినీ సస్పెండ్ చేశామనీ, వారిలో 15 మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నామని వివరించారు.

మైక్రోఫైనాన్స్ ఉచ్చులో మహిళలు

ప్రభుత్వమే రుణసౌకర్యం కల్పించాలి

- బీజేపీ హయాంలో స్త్రీలపై దాడులు తీవ్రతరం
- ఐద్వా మహాసభలో ఐదు తీర్మానాలు
- కర్తవ్యాల అమలుకు ఉద్యమాలు : జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- ముగిసిన మహాసభలు, నూతన కమిటీ ఎన్నిక
- నేడు అధికారికంగా వెల్లడి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం

మైక్రోఫైనాన్స్ ఉచ్చులో చిక్కుకొని మహిళలు, యువత అవస్థ పడుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మహాసభల నిర్వహణ వేదిక కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ అధ్యక్షులు, కోశాధికారి ఎస్. పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మితో కలిసి ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగిత, మహిళల సమస్యలన్నింటిపై ఈ మహాసభల్లో చర్చించినట్టు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో మహిళలు ఏ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నారో కూడా చర్చించినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సరిగా అమలుకావడం లేదన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుపడకపోగా నిరుద్యోగిత, మహిళలపై హింస పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో మహిళలపై మైక్రోఫైనాన్స్ సంస్థల వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. వీటి నుంచి మహిళలకు విముక్తి కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు మైక్రోఫైనాన్స్ సంస్థల వైపు మళ్లకుండా ప్రభుత్వమే రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాల వైఫల్యంతోనే మహిళలపై దాడులు : ఎస్.పుణ్యవతి

ప్రభుత్వాల వైఫల్యంతోనే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి ఆరోపించారు. ఈ మహాసభల్లో స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులపై రిపోర్టులు అధికంగా వచ్చాయని, బాధితులకు అండగా నిలవడంలో ఐద్వా ముందుందన్నారు. సాధారణ స్త్రీలు బాధిత మహిళలకు తోడుగా ఉంటున్నప్పుడు ప్రభుత్వాలకు ఆపాటి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బర్రెలక్క లాంటి వాళ్ల ప్రభుత్వాలను నమ్ముకోవడం కన్నా గేదెలు కాసుకోవడం ఉత్తమమని నిరసన తెలిపారన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి దాదాపు ఏడాది అవుతుందని, ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారని ప్రశ్నించారు. ఇటీవల బీటెక్ యువకుడు ఉరివేసుకొని చనిపోయాడని, నిరుద్యోగిత, లోన్ యాప్‌లు నిర్వాహకుల వేధింపులే కారణమని విశ్లేషించారు. ఇలాంటి చావులను అరికట్టే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 8 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవన్నారు. ఇలాంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1974లో మొదటి రాష్ట్ర మహాసభలకు వేదికైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తిరిగి 2024లో తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెంలో నిర్వహించడం విశేషమన్నారు. నాటి సభలను ఏలూరి జయమ్మ, కొండపల్లి దుర్గమ్మ స్వరాజ్యేశ్వరమ్మ నాయకత్వంలో నిర్వహించారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు స్త్రీల సమానహక్కుల కోసం ఐద్వా పోరాటం చేస్తోందన్నారు. సారా వ్యతిరేక, అక్షరాస్యత ఉద్యమాల వంటివెన్నో చేసిందన్నారు.

ముగిసిన రాష్ట్ర మహాసభలు

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెంలో ముగిశాయి. ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగాయి. 21వ తేదీన కొత్తగూడెంలో బహిరంగసభ జరిగింది. పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. 22, 23న జరిగిన మహాసభల్లో గడిచిన మూడేండ్లలో ఉద్యమ ప్రస్తానంపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నారు. అంతేకాదు, మహిళల సమస్యలపై పలు తీర్మానాలను ఆమోదించారు. చివరి రోజు నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుల పేర్లను గురువారం అధికారికంగా వెల్లడించనున్నట్టు ఐద్వా తెలిపింది.

హామీల అమల్లో కేంద్ర, రాష్ట్రాలు విఫలం : మల్లు లక్ష్మి

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలపై దాడులు పెరిగాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇచ్చిన హామీల అమల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడాన్ని ఐద్వా స్వాగతిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇస్తామన్న రూ.2,500, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు అమలు చేయాలని 4వ మహాసభ డిమాండ్ చేసిందన్నారు. మహాసభ మరో ఐదు తీర్మానాలను కూడా చేసిందని తెలిపారు. మహిళలపై వివిధ రూపాల్లో పెరుగుతున్న హింసను అరికట్టాలని కోరారు. ఆహార సూచీలో భారతదేశం ప్రపంచంలో 107 స్థానంలో ఉందని, నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో మహిళల్లో రక్తహీనత పెరుగుతోందని అన్నారు. ఆహారభద్రత చట్టాన్ని అమలు చేసి అందరికీ ఆహారం అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సాధికారతలో భాగంగా చట్టసభల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అర్హత కలిగినవారందరికీ ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. 125 గజాల ఇంటిస్థలం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.5లక్షలు, కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందన్నారు. పాఠశాలలు, హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సౌకర్యాలు కల్పించాలన్నారు. వీటన్నింటి సాధనకు ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- స్కూలు బస్సులు ధ్వంసం





నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలోని సాయి చైతన్య ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు ఢీకొని అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మృతి చెందింది. అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మత్త లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బోయిని చందు, సరితలకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె అశ్విని (6) పెద్ద శంకరంపేటలోని సాయి చైతన్య స్కూల్లో ఒకటవ తరగతి చదువుతోంది. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం కూడా పాఠశాల ముగిసిన అనంతరం గ్రామాల్లో పిల్లలను దించేందుకు వెళ్లిన బస్సు లక్ష్మాపూర్‌లో అశ్వినిని కిందకు దించారు. బస్సు నుంచి కిందకు దిగిన అనంతరం అశ్విని ఎటు వెళ్తుందో గమనించకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపడంతో పాపను ఢీకొట్టాడు. ఘటనలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. అక్కడే ఉన్న గ్రామస్తులు ఆగ్రహంతో డ్రైవర్ నిర్లక్ష్యమే విద్యార్థిని మృతికి కారణమంటూ.. ఆ బస్సు అద్దాలు, కిటికీలను ధ్వంసం చేశారు. సంఘటనా స్థలంలో విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బైఠాయించారు. కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరి మనసులను కలిచివేసింది. పాఠశాల ముగించుకొని బిడ్డ ఇంటికి వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూసిన తల్లిదండ్రులకు, చిన్నారి మృతి తీవ్ర శోకాన్ని నింపింది. పాఠశాల యాజమాన్యంపై, బస్సు డ్రైవర్‌పైనా పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సునీత, సిబ్బంది వివరాలు సేకరించారు.

సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు."ఐదేండ్ల తర్వాత అధికారికంగా సమావేశమవుతున్నాం. భారత్-చైనా సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే కాక ప్రపంచ శాంతి, సుస్థిరత, పురోగతికి ఎంతో ముఖ్యమని విశ్వసిస్తున్నాం. గత నాలుగేండ్లుగా సరిహద్దులో తలెత్తిన సమస్యలపై ఇటీవల వచ్చిన ఏకాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాం. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడంలో మనం ప్రాధాన్యంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం అనేవి మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.గత ఐదేండ్లలో మోడీ-జిన్‌పింగ్‌లు అధికారికంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కొన్నేండ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వీరి భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రిక్స్ సమావేశాలు ముగిశాక మోడీ ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు.

ఐఏఎస్ అమోయ్‌పై ఈడీ ఇంటరాగేషన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రంగారెడ్డి జిల్లాలో కోట్లాది రూపాయల విలువైన భూదానోద్యమ భూములను అక్రమంగా ఇతరులకు కేటాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి కలెక్టర్, ప్రస్తుత పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి అమోయ్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సుదీర్ఘంగా విచారించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో అమోయ్‌కుమార్ నాగారంలోని 42 ఎకరాల భూదానోద్యమ భూములను అప్పనంగా నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు కేటాయించారని ఆరోపణలు న్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సైతం రైతులకు చెందిన 26 ఎకరాల కోట్లాది రూపాయల విలువైన భూములను ఇతరులకు కేటాయించడం ద్వారా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలున్నాయి. వీటికి సంబంధించి బాధితులు, రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా అమోయ్‌కుమార్‌ను విచారించారు. ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయానికి వచ్చిన అమోయ్‌కుమార్‌ను మధ్యాహ్నం భోజన విరామం మినహా రాత్రి ఏడు గంటల వరకు సుదీర్ఘంగా విచారించారు. భూముల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపైనే ఈడీ అధికారులు ఎక్కువగా దృష్టి సారించారని తెలిసింది. సాయంత్రం ఏడు గంటలకు విచారణ ముగిశాక.. గురువారం కూడా హాజరుకావాలని ఆదేశించి పంపారు.

గోబ్యాక్..అంబుజా

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. విషపు కోరలు చాచే కాలుష్యపు ఫ్యాక్టరీ మాకొద్దురైతులను డ్రైపోర్టు పేరుతో మోసం చేసి 350 ఎకరాల భూములను కొనుగోలు చేసి ఇప్పుడు మాట మార్చేసి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నామని గత నెల 21న పత్రికా ప్రకటన విడుదల చేయడాన్ని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. మాకొద్దు ఈ విషపు కోరలు చాచే కాలుష్యపు ఫ్యాక్టరీ అంటూ సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు, ప్రజాసంఘాలు, వృత్తిదారులు, యువకులు, న్యాయవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పడాన్ని విరమించు కోకపోతే న్యాయపోరాటానికి సిద్ధమవుతామని, హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలు చేస్తామని హెచ్చరించారు.

పరిహారంపై అనుమానాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నిర్వాసితుల కోసం 16వేల ఇండ్లను కేటాయిస్తూ సెప్టెంబరు 26న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఇండ్లు ఒకే చోట లేవు. జీహెచ్ఎంసీ పరిధిలో 30 కిలోమీటర్ల వరకు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. బాధితుల్లో చాలా మంది అంత దూరం వెళ్లేందుకు సిద్ధంగా లేరు. మరోవైపు నిర్వాసితులకు ఉపాధి, వారి పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామంటూ అధికారులు కొంత ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మూసీ ప్రాంత కుటుంబాలకు చెందిన దాదాపు 50 మంది పిల్లలకు వివిధ గురుకుల్లాల్లో అడ్మిషన్లు ఇచ్చినట్టు సమాచారం. అలాగే నిర్వాసితుల్లో ఎంపిక చేసిన 17 డ్వాక్రా సంఘాలకు రూ.2లక్షల చొప్పున ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే ఆ మొత్తం పరిహారం కాదనీ, కేవలం సబ్సిడీతో కూడిన రుణమని వారంటున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితులను తరలించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 2013 ఆర్ఆండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలా? బాధితులను కేటగిరీల వారీగా విభజించి కోల్పోయిన ఆస్తులు, భూములకు తగు పరిహారం నిర్ణయించి ఇవ్వాలా? మరేదైనా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిం చాలా? అనే అంశంపై సర్కార్ కసరత్తు చేస్తున్నదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

2013 ఆర్అండ్ఆర్ చట్టం ఏంచెబుతోంది?

రైట్ టూ ఫేర్ ట్రాన్స్‌ఫరెన్సీ ఇన్ ల్యాండ్ అక్వేషన్, రిహాబిలిటేషన్, రీ సెటిల్‌మెంట్ (ఆర్ఎఫ్‌సీటీఎల్ఏఆర్ఆర్) 2013 చట్టం ప్రకారం భూ యజమానులకు పునరావాసంతో పాటు న్యాయమైన పరిహారం అందించేందుకు కేంద్రం ఈ ప్యాకేజీని తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు భూములు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లిస్తారు. ఎక్కువ మొత్తంలో కుటుంబాలు ఉంటే వారికి టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి పునరావాసం కల్పిస్తారు. అలాగే నిర్వాసిత ప్రాంతాలకు విద్య, వైద్యం, రోడ్లు, డ్రయినేజీలు, పారిశుద్ధ్యం, సురక్షితమైన తాగునీరు అందించడం తో పాటు ప్రజా రవాణా మొదలగు మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు.

అయితే ఇప్పటి వరకు మల్లన్న సాగర్, కొండపోచమ్మ తదితర ప్రాంతాల్లో జరిగిన పునరావాసంపై ప్రజల్లో అనేక అనుమానాలు న్నాయి.గత ప్రభుత్వం 2013 ఆర్అండ్ఆర్ చట్టాన్ని బాధితులకు వర్తింపజేశామని చెబుతున్నా, వాస్తవం లో చాలా మందికి పరిహారం అందలేదనే విమర్శ లున్నాయి.రాష్ట్రంలోనే అతి పెద్ద పునరావాసంగా భావిస్తున్న మూసీ విషయంలో ఇదే చరిత్ర పునరావృతం అవుతుందనే అనుమానాలున్నాయి

రెండింతలు పరిహారం చెల్లించాలి : రావుల సురేష్ కుమార్, చైతన్యపురి



నేను ఓ ప్రయివేట్ కంపెనీలో చిరుద్యోగిని. మేం ఇద్దరం అన్నదమ్ములం. మా నాన్న అష్ట కష్టాలు పడి 2013లో 271 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ఇల్లు కట్టాడు. ఆ ఇంటిపై అప్పు కూడా ఇంకా తీరలేదు. ప్రభుత్వం కచ్చితంగా ఖాళీ చేయాలని చెబితే మాత్రం రెండింతల పరిహారం చెల్లించాలి.

2013 ఆర్ఆండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి : సురేందర్, నాగోల్,



2013 ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం పునరావాసంతో, న్యాయమైన పరిహారం అందించాలి. ఈ లెక్క ప్రకారం మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం మార్కెట్ విలువ కంటే రెండింతలు పరిహారం చెల్లించాలి. కేవలం డబుల్‌బెడ్ రూం ఇండ్లిచ్చి తరలించాలని చూస్తే ఆందోళన తప్పదు. పరిహారాన్ని తర్వాత ఇస్తాం ముందు ఖాళీ చేయాలంటే కూడా కుదరదు. ఇంటి స్థలాలతో పాటు ఇతర ఆస్తుల విలువను లెక్కకట్టి పరిహారం చెల్లించిన తర్వాతే ఇక్కడి నుంచి కదులుతాం.

పునరావాస ప్యాకేజీ అందించాలి

నవతెలంగాణ-గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని సింగరేణి ఓసీ-3 బాంబు బ్లాస్టింగ్ వల్ల తమ ఇండ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని, కాలనీని తరలించి పునరావాస ప్యాకేజీ అందించాలని గుర్రంపేట ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఓసీ-3 ఎదుట టెంట్ వేసుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్రంపేట ఎస్సీ కాలనీకి ఆనుకుని ఓసీ-3 ప్రాజెక్టు వచ్చిందని, తమ భూములు తీసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ ఎలాంటి సర్వే చేపట్టలేదని అన్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ తమ కాలనీని పరిశీలించారని, అప్పుడు బాంబు బ్లాస్టింగ్ వల్ల ఇండ్లు పగుళ్ళు ఏర్పడి నేలమట్టమయ్యే దశకు చేరుకున్నాయని ఆయనతో మొరపెట్టుకున్నామని తెలిపారు. ఆయన వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సింగరేణి అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి బాంబు బ్లాస్టింగ్స్ వల్ల భారీ శబ్దాలతో నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఓసీ-3 ఎదుట ధర్నా చేస్తుంటే సింగరేణి అధికారులు జోక్యం చేసుకుని మా భూముల్లోనే ధర్నా చేసుకోవాలని హెచ్చరించినట్టు తెలిపారు. చేసేదేమీ లేక అక్కడి నుంచి తమ భూముల వద్దకు వచ్చి ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. ధర్నా వల్ల రెండు రోజులుగా బాంబు బ్లాస్టింగులు నిలిపివేసినట్టు తెలిపారు. సింగరేణి అధికారులు స్పందించి తమ కాలనీని సర్వే చేసి, పునరావాస ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని, పనులను అడ్డగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కాలనీవాసులు దూడపాక శంకర్, రత్నం శ్రీను, దూడపాక వేణు, మిడిదొడ్డి శ్రీను, జేరుపోతుల భిక్షపతి, దూడపాక ఉపేందర్, విజయ్ కుమార్, రత్నం సరోజన, దూడపాక శారద, దూడపాక స్వాతి, సావడి ప్రమీల, సామర్ల పద్మ సామర్ల శారద, తగరం భాస్కర్, శనివారం శ్రీకాంత్, జేరిపోతుల నరేష్, శ్రీను, సంజీవ్, నరేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కాలేజీలో విద్యార్థి మృతి

- బిల్డింగ్‌పై నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదం

నవతెలంగాణ మియాపూర్

ఓ విద్యార్థి బిల్డింగ్‌పై నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పీఎస్ పరిధిలోని నారాయణ బాసర, సరస్వతి క్యాంపస్‌లో జరిగింది. సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రైల్వే కోడూరుకు చెందిన శివకుమార్‌రెడ్డి (17) నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ సెంకడ్ ఇయర్ చదువుతున్నాడు. విద్యార్థి శివకుమార్‌రెడ్డి తోటి విద్యార్థులతో కలిసి మంగళవారం అర్ధరాత్రి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఐదవ అంతస్తు రూమ్ నెంబర్ 501 కిటికీలో నుంచి కిందికి దిగే క్రమంలో కాలుజారి కిందపడి చనిపోయాడు. గమనించిన ఇతర విద్యార్థులు వెనుకడుగు వేశారు. ఈ విషయాన్ని నిర్వహకుల దృష్టికి తీసు కెళ్లారు. అయితే ఐదవ అంతస్తు నుంచి విద్యార్థులు ఎలా దిగే ప్రయత్నం చేశారనే విషయంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడా లేక కాలుజారి కిందపడ్డాడా అనే అంశం ఇంకా తేలాల్సి ఉంది. విద్యార్థి మృతి నేపథ్యంలో కాలేజీ వద్ద ఆందోళనలు జరిగే అవకాశం ఉందని పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 20 మందికి పైగా కానిస్టేబుళ్ళ తో బందోబస్తు నిర్వహించారు. అయితే విద్యార్థి మరణంపై విద్యార్థి సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నారాయణ కాలేజీలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా ఇంటర్మీడియట్ బోర్డు తీవ్ర నిర్లక్ష్యం చేస్తోం దని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నారాయణ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి డిమాండ్ చేశారు.

చిన్నారులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్య నేరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం "బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన" క్యాంపెన్ లో భాగంగా బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి స్థానిక కొత్తగూడెంలో ఉన్న చిన్న బజార్, పెద్ద బజారులలోని కిరణం షాపు, షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలలో ఆకస్మిక తనికి నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా చిన్న బజారులో ఉన్న రాయల్ కిరాణా షాపులో బాల కార్మికుడిని గుర్తించారు. బాలుడు వివరాలను తెలుసుకొని అతడి తల్లిని పిలిపించి తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఆదేశించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే బాల కార్మిక చట్టం ప్రకారం పనిలో పెట్టుకున్న యజమాని పైన కేసు నమోదు చేయడం జరుగుతుందని కిరాణా షాప్ యజమానిని న్యాయమూర్తి హెచ్చరించారు. ఆ బాలుడిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించే బాధ్యతను యజమాని, తల్లి తీసుకొని స్కూల్ లో అడ్మిషన్ చేయించిన వివరాలను తెలియపరచాలని ఆదేశించారు. ఈ తనిఖీలో భాగంగా కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ షర్ఫుద్దీన్, న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

బ్యాగులు శుభ్రం చేయడానికి...

పిల్లల స్కూల్ బ్యాగ్ అయినా, మన ఆఫీస్ బ్యాగ్ అయినా, త్వరగా మురికి పడతాయి. వాటిని ప్రతి వారం ఉతకడం కష్టమే. నీటిలో నానపెడితే కొన్ని బ్యాగులు పాడయిపోయే ప్రమాదముంది. అటువంటి



పరిస్థితిలో, మురికిగా కనిపించే బ్యాగును ఉతకకుండానే శుభ్రం చేసేందుకు కొన్ని చిట్కాలను చూద్దాం. ఈ క్లీనింగ్ హ్యాక్‌ల గురించి తెలిస్తే బ్యాగులు శుభ్రపరచడం చాలా సులువు.

డిటర్జెంట్‌తో

మీ బ్యాగ్ పై మొండి మరక ఉంటే, బ్యాగు మరీ పాతదిలా కనిపిస్తుంది. దానిని సులువుగా తొలగించుకోవచ్చు. దీని కోసం, ఒక గిన్నెలో కొద్దిగా డిటర్జెంట్ లేదా సబ్బు ద్రావణాన్ని తీసుకోండి. ఇప్పుడు ఈ సబ్బు ద్రావణంలో స్పాంజిని ముంచి బాగా పిండేయాలి. ఆ స్పాంజితో బ్యాగ్ పై ఉన్న మొండి మరకలను బాగా రుద్ది తొలగించుకోవచ్చు. ఈ ట్రిక్‌తో మీ బ్యాగ్ పై ఉన్న మొండి మరకలు చాలా సులువుగా పోతాయి. మీరు బ్యాగును ఉతకాల్సిన అవసరం లేదు.

మురికి వాసన పోయేందుకు

బ్యాగును తరచూ శుభ్రం చేయకపోతే మురికి వాసన వస్తుంది. ఆ వాసన భరించడం కష్టంగానే ఉంటుంది. ఈ వాసనను తొలగించడానికి మీరు బ్యాగును ఉతకాల్సిన అవసరం లేదు. ఉతక్కుండానే ఈ వాసనను తొలగించవచ్చు. దీని కోసం, తడి గుడ్డతో బ్యాగ్‌ను తుడిచి, ఎర్రటి ఎండలో ఆరబెట్టండి. ఇలా చేస్తే బ్యాగు మురికి వాసన చాలా వరకూ పోతుంది. బ్యాగ్ లోపలి భాగంలో సబ్బుతో తయారుచేసిన నీటిని స్ప్రే చేసి.. పొడి బట్టతో తుడిస్తే ఇంకా శుభ్రం అవుతుంది.

బ్రష్‌తో

స్కూలు లేదా ఆఫీస్ బ్యాగ్‌పై దుమ్ము, ధూళి పేరుకుపోతే, దాని వల్ల బ్యాగు చాలా మురికిగా కనిపిస్తుంది. అలాంటప్పుడు బ్యాగ్ కడగవలసిన అవసరం లేకుండానే లాండ్రీ సాఫ్ట్ బ్రష్ సహాయంతో దాన్ని శుభ్రం చేయవచ్చు. ఇందుకోసం బ్యాగును ఖాళీ చేసి దాని బయటి, లోపలి భాగాన్ని బ్రష్‌తో శుభ్రం చేయాలి. ఈ విధంగా బ్యాగ్ పై ఉండే దుమ్ము, మరకలు సులువుగా పోతాయి. బ్రష్ తో రుద్ది తడి గుడ్డతో తుడిచేస్తే చాలు బ్యాగు కొత్తదిలా మెరుస్తుంది.

ఇట్ల చేద్దాం

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో కరివేపాకు ఆకులు వేసి ఉంచాలి.





వంకాయ ముక్కలు కోసేటప్పుడు నల్లబడకుండా ఉండాలంటే ఒక స్పూను పాలు వేయాలి.

సీజనల్ ఫ్రూట్ అయిన సీతాఫలంలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. అలాగే శరీరంలో డోపమైన్ ఉత్పత్తిని పెంచుతాయి. ఈ సూపర్‌ఫుడ్ వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. సీతాఫలంలో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి. అధిక రక్తపోటును తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఈ పండులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇందులో నియాసిన్ విటమిన్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది. కాకపోతే షుగర్ పేషంట్లు ఈ పండును మితంగా తీసుకోవటమే మంచిది. ఎన్నో ప్రయోజనాలున్న ఈ పండుతో చేసే కొన్ని వెరైటీ రెసిపీలు...

సీతాఫల్‌తో స్వీట్‌గా...



రబ్డీ

చాలా సింపుల్‌గా రెడీ అయ్యే ఈ ఫ్యాన్సీ రెసిపీ తయారీ ఎలాగో చూద్దాం. సీతాఫలం వాడటం వల్ల తీపి కోసం ఎక్కువగా పంచదార వాడాల్సిన అవసరం లేకుండా హెల్తీగా ఉంటుంది. సీతాఫలం సీజన్ మొదలైనట్లే. ఈ పండ్లు పుష్కలంగా దొరికినప్పుడే ఒక్కసారన్నా ఈ స్వీట్ రెసిపీ ట్రై చేయండి. రుచి మాత్రం అమోఘంగా ఉంటుంది.

కావలసిన పదార్థాలు : పాలు - ఒక లీటర్, 1/4 కప్పు బెల్లం, 1/2 టీస్పూన్ యాలకుల పొడి, సీతాఫలం గుజ్జు - ఒక కప్పు.

గార్నిష్ కోసం: గులాబీ రేకులు, పిస్తా తరుగు, కుంకుమపువ్వు కలిపిన



పాలు కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా పాలను ఒక కడాయిలో వేసి మరిగించాలి. రెండు మూడు సార్లు బాగా ఉడుకు వచ్చాక మంట తగ్గించి సగానికి ఇంకిపోయి చిక్కబడే వరకు పాలను మరిగించాలి. మధ్య మధ్యలో కలియబెడుతూ మరగబెట్టాలి. లేదంటే పాలల్లో అడుగున చిన్న స్టీల్ ప్లేట్ వేసేస్తే పొంగకుండా ఉంటాయి. పాలు సగానికి ఇంకిపోయి చిక్కబడ్డ తర్వాత అందులో యాలకుల పొడి, బెల్లం లేదా పంచదార, సీతాఫలం గుజ్జు వేసి కలపాలి. బెల్లం వేస్తే బాగా కలిసేవరకూ తిప్పాలి. అది కరిగిన తర్వాత స్టవ్ ఆపేసి చల్లారనివ్వాలి. చివరగా కుంకుమపువ్వు కలిపిన పాలు, గులాబీ రేకులు, పిస్తాపప్పులతో గార్నిష్ చేసుకోవాలి. కనీసం ఓ గంటపాటు ఫ్రిజ్‌లో పెట్టుకుని సర్వ్ చేసుకుంటే అద్భుతమైన డెజర్ట్ రెడీ అవుతుంది.

ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు : సీతాఫలం గుజ్జు - 4 కప్పులు, పాలు - 2 కప్పులు, పంచదార పొడి -



అర కప్పు, పాల పొడి - ఒక కప్పు, వెనిలా ఎసెన్స్ - ఒక స్పూను, తాజా క్రీమ్ - అరకప్పు.

తయారీ విధానం : ఒక పెద్ద పాత్రలో బాగా కాచి చల్లార్చిన పాలు, పంచదార పొడి, పాల పొడి, వెనిలా ఎసెన్స్ వేసి పంచదార కరిగి వరకూ బాగా కలపాలి. సీతాఫలం.. గుజ్జు జత చేసి, మరోమారు బాగా కలిపి లోతుగా ఉన్న పాత్రలో పోసి మూత పెట్టి, ఫ్రిజ్‌లో ఉంచాలి. సుమారు నాలుగు గంటల తరువాత బయటకు తీసి, మిక్సీలో వేసి, మెత్తగా చేయాలి. ఈ ఆ మిశ్రమాన్ని లోతుగా ఉన్న పాత్రలో పోసి, గాలి పోకుండా ఉండేలా మూతపెట్టాలి. డీప్ ఫ్రీజర్లో పెట్టి నాలుగైదు గంటల తరవాత తీసేయాలి. ఎంతో ఈజీగా సీతాఫలం ఐస్‌క్రీం సిద్ధమయినట్టే. కప్పులలో పెట్టుకొని సర్వ్ చేసుకోవటమే.

కేక్

కరిగించిన బటర్ - 1 టీ స్పూన్, పంచదార పొడి - 125 గ్రాములు, దాల్చిన చెక్క పొడి -



కొద్దిగా. బటర్- 100 గ్రాములు, కోడిగుడ్లు-2, మైదా పిండి - ఒకటిన్నర కప్పులు, పాలు - 100 మి.లీ., సీతాఫలం గుజ్జు - 2 కప్పులు.

తయారీ విధానం : ముందుగా వెన్నను ప్రీ హీట్.. చేసుకోవాలి. పంచదారను మెత్తగా పొడి చేసుకోవాలి. మందంగా ఉన్న ఒక అల్యూమినియం పాత్రను తీసుకొని పంచదార, దాల్చిన చెక్క పొడి వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత అందులో బటర్ వేసి గిలకొట్టుకోవాలి. తర్వాత కోడి గుడ్లు కూడా వేసి బాగా నురగ వచ్చే వరకూ బాగా కలపాలి. ఆ తర్వాత మైదా పిండి కూడా వేసి బాగా గిలకొట్టాలి. అందులోనే సీతాఫలం గుజ్జు కూడా వేసి బాగా కలిపి ఈ పాత్రను హీట్ చేసిన ఓవెన్‌లో ఉంచాలి. సుమారు 45 నిమిషాల తర్వాత బయటకు తీయాలి. బాగా చల్లారిన తర్వాత కేక్‌ను పాత్ర నుంచి వేరు చేయాలి. దీనిని ముక్కలుగా కట్‌చేసుకోవటమే. ఎంతో ఈజీగా చేసుకునే సీతాఫల్ కేక్ రడీ అయినట్టే.

మిల్క్ షేక్

పాలు - 4 కప్పులు, డ్రైఫ్రూట్స్ పొడి అర కప్పు, పంచదార తగినంత, సీతాఫలం గుజు - రెండు కప్పులు.

తయారీవిధానం : మిక్సీలో సీరావులు గుజ్జు, పాలు, పంచదార, డ్రైఫ్రూట్స్ పొడి వేసి, మెత్తగా అయ్యే వరకూ మిక్సీ పట్టాలి. అంతే వాటిని గ్లాసులలో పోసి అందించాలి. కావాలనుకుంటే కొద్దిసేపు ఫ్రిజ్‌లో పెట్టినా... చల్లచల్లగా ఎంతో రుచిగా ఉంటుంది. ■



బండికి కేటీఆర్ లీగల్ నోటీస్

తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని

నోటీసులో పేర్కొన్న కేటీఆర్

వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

లేనిపక్షంలో లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ తనపై నిరాధారమైన, తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడనీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాడని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ చేసిన నిరాధారమైన కామెంట్లను నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరు కూడా తీశారని చెప్పారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని నోటీసులో తెలిపారు. కేవలం తనను అప్రతిష్ట పాలు చేయాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటాననీ, ఫోన్ ట్యాపింగ్ చేశాననీ, కేసుల నుంచి తప్పించుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయబడ్డాయనీ, దీని కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. వాటన్నింటిని ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కొట్టిపారేశారు. కేంద్రమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశం, తమ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ నోటీసులో తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని చెప్పారు. గతంలోనూ బండి సంజయ్ తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే తన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఇలాంటి ఆరోపణలు చేయటం ద్వారా ప్రజల్లో తన ప్రతిష్టను నాశనం చేయాలనే కుట్ర తప్ప వారి ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు.



నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం

కొండా సురేఖ వ్యాఖ్యలు నాతో పాటు పార్టీకి నష్టం కలిగించాయి..

వాటిని తిరిగి చెప్పలేను : కేటీఆర్

కేటీఆర్, దాసోజు శ్రావణ్ స్టేట్‌మెంట్ రికార్డు చేసిన కోర్టు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మంత్రి కొండా సురేఖ పై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో హైదరాబాద్ నాంపల్లి కోర్టులో బుధవారం కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చారు. కొండా సురేఖ వ్యాఖ్యలు తనతో పాటు పార్టీకి కూడా తీవ్రంగా నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని కేటీఆర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. తనపై ఆమె చేసిన కామెంట్లను చూసి సాక్షులు తనకు ఫోన్ చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వాటిని విని షాక్‌కు గురయ్యానని తెలిపారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను కొండా సురేఖ చేశారని కేటీఆర్ తన వాంగ్మూలంలో తెలిపారు. ఆమె మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని చెప్పారు. తాను డ్రగ్ అడిక్ట్ అని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పబ్లిసిటీ కోసమే కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు అన్ని చెప్పలేకపోతున్నానని, ఫిర్యాదులో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోర్టును కేటీఆర్ కోరారు. దాదాపు అరగంట పాటు కోర్టులో కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. కొండా సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్‌ను కూడా కోర్టు నమోదు చేసుకుంది. మిగతా సాక్షుల స్టేట్‌మెంట్ల రికార్డ్‌ను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ నెల 21నే స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాల్సి ఉన్నప్పటికీ కేటీఆర్ అభ్యర్థన మేరకు గురువారం వరకు కోర్టు సమయమిచ్చింది. ఈ మేరకు తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్ సహా ఈ కేసులో సాక్షులుగా ఉన్న దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, బాల్క సుమన్, మాజీ మంత్రి జగదీష్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు నాంపల్లి కోర్టుకు వచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

మాఫీ చేసిందని తెలిపింది. మిగిలిన 20 లక్షల మంది రైతులకు కూడా రుణమాఫీ చేయాలని పేర్కొంది. పంటకాలం పూర్తవుతున్నప్పటికీ వానాకాలం రైతుభరోసా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేసింది. రైతు భరోసాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసింది. కౌలురైతులకు చట్టపరమైన హక్కులు కల్పించి "రుణ గుర్తింపు కార్డు"లను ఇవ్వాలని సూచించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పినట్టు కౌలురైతులు, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని కోరింది.గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలనీ, అభ్యర్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులతోపాటు, రాష్ట్రం నిధులు కేటాయించి గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలిపింది. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.600 కూలి ఇస్తూ, ఏడాదికి 200 పనిదినాలను కల్పించాలని కోరింది. పనిచేసిన వారికి బకాయిలు పెట్టకుండా వెంటవెంటనే చెల్లించాలని పేర్కొంది. యాంత్రీకరణ పేరుతో ఉపాధి హామి నిధుల్లో 45 శాతం కేటాయిస్తున్నారని తెలిపింది. దీన్ని తగ్గించి కూలీల ద్వారా పనిచేయించాలని సూచించింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించాలనీ, రోజుకు రూ.700 కూలి నిర్ణయించి అమలు చేయాలని తెలిపింది. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లక్షల ఇండ్లు పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలిచ్చి, ఇండ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు సబ్సిడీగా ఇవ్వాలని కోరింది. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఆయా రంగాల ప్రజలు పోరాడుతున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వాటిని పరిష్కరించాలని కోరింది.

ఓటు అడగటం నాకు ఇదే తొలిసారి

(మొదటిపేజీ తరువాయి)

కల్పేట: వాయనాడ్ ఉప ఎన్నికల నేపథ్యంలో తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకాగాంధీ బుధవారం నామినేషన్ వేశారు. ఇక్కడి రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సోదరుడు రాహుల్ గాంధీ, తల్లి సోనియా గాంధీ, భర్త రాబర్ట్‌వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఇతర యూడీఎఫ్ నేతలు సహా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆమెతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే వాయనాడ్ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. అంతకు ముందు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ 1989లో 17ఏండ్ల వయస్సులో తాను తన తండ్రి రాజీవ్‌గాంధీ కోసం ఓట్లు అడగటానికి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం ప్రారంభించానని అన్నారు. ఇప్పుడు తనకు ఓటు వేయాలని ప్రచారం చేసుకోవడం ఇదే తొలిసారి అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్నవారు విభజన, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రియాంకాగాంధీ ఎన్నికైతే లోక్‌సభలో వాయనాడ్‌కు ఇద్దరు ప్రతినిధులు ఉంటారని అన్నారు. "నేను అనధికారిక ప్రతినిధిని, ప్రియాంకా గాంధీ అధికారిక ప్రతినిధి. వాయనాడ్ ప్రజలతో నాకున్న సంబంధాన్ని మీరందరూ బాగా అర్థం చేసుకున్నారని నేను భావిస్తున్నా" అని అన్నారు.వాయనాడ్ స్థానానికి ప్రియాంకాగాంధీని గెలిపించాలని ఈ సందర్భంగా రాహుల్ కోరారు. ఖర్గే మాట్లాడుతూ పియాంకాగాంధీని ఆశీర్వదించండి. ఆమె వాయనాడ్‌కు మంచి ఫలితాలను అందజేస్తుందని అన్నారు. వేదికపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఉన్నారు.కల్పేట బస్టాండ్ నుంచి గూడాలాయి వరకు సాగిన రోడ్ షోలో ఐయూఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పానక్కడ్ సయ్యద్ సాదిక్ అలీ షిహాబ్ తంగల్, జాతీయ ప్రధాన కార్యదర్శి పికె కున్హాలికుట్టి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, కేపీసీసీ అధ్యక్షుడు కె సుధాకరన్, ఇతర నాయకులు సుమారు కిలోమీటరు మేర వాహనంలో ప్రయాణించారు. వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు వీరికి ఘనస్వాగతం పలికారు. వాయనాడ్‌లో నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.

ప్రియాంక వద్ద రూ.77 కోట్ల ఆస్తులు

ప్రియాంకా గాంధీ వద్ద రూ.77 కోట్ల ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో స్థిర ఆస్తుల విలువ రూ.42.16 కోట్లు కాగా చరాస్తుల విలువ రూ. 35.38 కోట్లుగా ఉన్నది. రూ.1.4 కోట్లు విలువ చేసే ఆభరణాలు, రూ.62.5 లక్షలు విలువ చేసే మూడు కార్లు, రూ.4.22 లక్షలు విలువ చేసే బైక్ ఉన్నట్టు తెలిపారు.

మూడుగంటలు..130కి పైగా ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదని అజయ్ కుమార్ వివరణ ఇచ్చారు.

ఈఎన్సీకి 130 ప్రశ్నలు

అంతకు ముందు ఉదయం విచారణకు హాజరైన ఈఎన్సీ నాగేందర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఆగ్రహం వ్యక్తం చేసింది. దాదాపు మూడు గంటలపాటు ఆయనను ప్రశ్నించింది. దాదాపు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. ఆయన నిబంధనలు పాటించలేదని తెలిపారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా? అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు.

ఈ సందర్భంగా రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్టు కమిషన్ ముందు చెప్పడంతో.. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీల్లో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదనీ, పరిమితికి మించి బ్యారేజీలలో నీళ్లను స్టోర్ చేయమని ఎవరు ఆదేశించారని కమిషన్ అడిగింది.

చేయలేదు.. పాటించలేదు..!

ఈ క్రమంలోనే రామగుండం ఈఎన్‌సీ నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పినట్టు తెలుస్తోంది. రామగుండం ఈఎన్‌సీ స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదన్నట్టుగా కమిషన్ ముందు చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా? అని కమిషన్ పదేపదే ప్రశ్నించింది. దీంతో మెయింటెనెన్స్ లేదని ఒప్పుకున్నారు. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్‌పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సీ తీసుకోలేదన్నారు. ఓ అండ్ ఎం ఇన్‌స్పెక్షన్ రిపోర్టును కమిషన్‌కు ఈఎన్‌సీ నాగేందర్ సమర్పించారు. సీడబ్ల్యూసీ మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారా? అని కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఫాలో చేయలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. "ఐఎస్ కోడ్ పాటించారా?" అని అడగగా.. లేదని ఆన్సర్ ఇచ్చారు.

డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించారా? అని అధికారులను కాళేశ్వరం కమిషన్ అడిగింది. నిర్మాణ సంస్థలు అగ్రిమెంట్ ఆపరేషన్స్ ప్రొటోకాల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ఫాలో అయ్యారా అన్న ప్రశ్నకు కాలేదని నాగేందర్ సమాధానం చెప్పారు. వెథర్స్ షెడ్యూల్ ఫాలో అయ్యారా అని ప్రశ్నించగా.. దానికి కూడా కాలేదనే ఈఎన్సీ సమాధానం ఇచ్చారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేసినట్టు కమిషన్ ముందు నాగేందర్ వెల్లడించారు. ప్రమాదం జరిగే ముందు ఓ అండ్ ఎం పరిశీలన చేశారా? అని.. బ్యారేజీల్లో నీళ్లను నిలువ చేయాలని ఎవరు ఆదేశించారంటూ కమిషన్ అడిగిన ప్రశ్నకు... రామగుండం ఈఎన్సీకి మౌకిక ఆదేశాలు ఉన్నట్టుగా కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పుకొచ్చారు.

దీపావళి నుంచి 3ఉచిత గ్యాస్ సిలిండర్లు

అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది.

ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ చార్జీల రద్దుకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ చార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

విశాఖ శారదాపీఠానికి భూ కేటాయింపు రద్దు..

విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

ధాన్యం కొనుగోళ్లపై నివేదిక రెడీ

సీఎంకు అందజేయనున్న
మంత్రివర్గ ఉపసంఘం

- కీలక నిర్ణయాలు తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి నిజామాబాద్ ప్రజాప్రతినిధులతో సమీక్షించిన ఉపసంఘం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లపై నివేదిక రెడీ అయింది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రివర్గ ఉపసంఘం ఈ నివేదికను అందజేయనున్నది. 26న మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాలని నిర్ణయించింది. కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనున్నది. ఈ నేపథ్యంలో బుధవారం ఉమ్మడి నిజామాబాద్ ప్రజాప్రతినిధులతో ఉపసంఘం సమీక్షించింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విప్ లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంతారావు, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి , కమిషనర్ డీ.ఎస్. చౌహన్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి వివిధ అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులతో కూడిన తుది నివేదికపై అక్టోబర్ 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం ధాన్యం కొనుగోలుపై బ్యాంకు గ్యారంటీతో పాటు మిల్లింగ్ చార్జీలు పెంచడం వంటి అంశాలపై పలు సిఫారసులతో కూడిన నివేదికను రూపొందించినట్టు వెల్లడించారు. మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్స్, ఐసీడీఎస్ వంటి పథకాల కింద పంపిణీ చేయడానికి సంబంధించి సన్నబియ్యంపై (10 శాతం పగిలిన బియ్యం) ఉన్న ఖర్చులను పెంచడంతో పాటు వ్యవసాయ శాఖ పాత్ర, ఎస్డబ్ల్యూసీ /ఏఎంసీ గోదాముల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయడంతో పాటు ధాన్యం నిల్వఉంచే సమయంలో 'డ్రైయేజ్' నష్టంపై ఉప సంఘం అధ్యయనం చేసినట్టు ఆయన తెలిపారు.

26న మంత్రివర్గ సమావేశంలో ఆమోదానికి నిర్ణయం

రాష్ట్రంలో 60.73 లక్షల ఎకరాల భూమిలో ధాన్యం సాగు చేయబడిందనీ, 146.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఇందులో 30 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం, 50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్‌ను అందజేయనున్నట్టు ఆయన పునరుద్ఘాటించారు.

సన్నరకం ధాన్యం నిల్వలకుగాను ప్రత్యేకంగా గోదాముల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నేరుగా రైతుల ఖాతాల్లో పడేలా ఆర్థికశాఖకు చెందిన ఈ-కుబేర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా జమ చేసే ఏర్పాట్లు చేశామన్నారు. ధాన్యం కొనుగోళ్ళకు ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు అదనంగా చెల్లించే బోనస్‌పై రైతుల్లో అవగాహన పెంపొందించేందుకుగాను గోడపత్రికలు ముద్రించి రైతులకు చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మొత్తం 7,248 పచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించబోతున్నట్టు ఆయన తెలిపారు. అందులో 2,539 కేంద్రాల్లో ఇప్పటికే కొనుగోళ్ల ప్రారంభమైనట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రవాణా, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. తేమని కొలిచే పరికరాలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, ధాన్యం శుభ్రం చేసే పరికరాలు, డ్రయర్లు, తాలును తొలగించే పరికరాలతో పాటుగా సన్నరకం ధాన్యాన్ని గుర్తించడానికి వీలుగా డయల్ కాలిపర్లు వంటి అవసరమైన మౌలిక వసతులను సనకూర్చుతున్నట్టు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, ఆశ్రయం వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సరిపడా సిబ్బంది, ఎప్పటికప్పటికి కొనుగోలు ఎంట్రీకి గాను ట్యాబ్‌లతో పాటు పుస్తకాలు, హమాలీ సేవలను విరివిగా వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రైతులు ఇబ్బందులకు గురి కాకుండా ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు పర్యవేక్షిస్తుంటాయన్నారు. మధ్యదళారుల చేతిలో రైతులు మోసపోకుండా చూసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. హెడ్ ఆఫీసులో టోల్-ఫ్రీ నంబర్‌తో కూడిన ఫిర్యాదుల పరిష్కార కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యా యని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 22 నాటికి 230 మంది రైతుల నుంచి రూ. 3.34 కోట్ల విలువైన 1,440 మెట్రిక్ టన్నుల పచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందించుకున్నట్టు ఆయన వివరించారు.

ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తేయాలి

- డైరెక్టర్‌కు టీఎన్‌జీవో, టీజీవో, టీఏఈవోల సంఘాల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకారణంగా సస్పెండ్ చేసిన వ్యవసాయ విస్తరణ అధికారులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలనీ, ఆ ఉత్తర్వులను ఎత్తేయాలని రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర టీఏఈవోల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేష్ రెడ్డి బుధవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.డిజిటల్ క్రాఫ్ సర్వే (డీసీఎస్)లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు రాష్ట్రంలో ఉన్న ఏఈవోలను మానసిక ఒత్తిడికిలోనూ కాకుండా ఉండేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. దీనికి డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సస్పెన్షన్ ఎత్తివేస్తామంటూ హామీ ఇచ్చారు. డీసీఎస్ విషయంలో అందరూ వెంటనే డౌన్లోడ్ చేసి పని మొదలు పెట్టాలని సూచించారు. ఈ విషయంలో ఎదురయ్యే అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సమం చేస్తారా?

- గెలుపే లక్ష్యంగా టీమ్ ఇండియా
- స్పిన్ సవాల్‌కు కివీస్ సిద్ధం
- నేటి నుంచి భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో..

స్వదేశంలో టీమ్ ఇండియాకు కఠిన సవాల్. సొంతగడ్డపై టీమ్ ఇండియా 0-1తో వెనుకంజ వేయటం చాలా అరుదు. 2017లో ఆస్ట్రేలియా... 2021, 2024లో ఇంగ్లాండ్‌లు భారత్‌ను తొలి టెస్టులో ఓడించి ఇరకాటంలో పడేశాయి. న్యూజిలాండ్ తాజా సిరీస్‌లో ఆ పని చేసింది. బెంగళూర్ భారత్‌కు భంగపాటు మిగిల్చి.. స్వదేశీ సిరీస్‌లో రోహిత్‌సేనను ఒత్తిడిలోకి నెట్టేసింది.

ఓవైపు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు, మరోవైపు స్వదేశంలో వరుస సిరీస్ విజయాల రికార్డుకు గండం నేపథ్యంలో విజయమే లక్ష్యంగా టీమ్ ఇండియా నేడు పుణె టెస్టులో బరిలోకి దిగుతోంది. భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు నేటి నుంచి ఆరంభం.

నవతెలంగాణ-పుణె

రోహిత్ శర్మ, గౌతం గంభీర్ జోడీ తొలిసారి ఐదు రోజుల ఆటలో విషమ పరీక్ష ఎదుర్కొంటున్నారు. బెంగళూర్‌లో ఊహించని ఓటమి ఎదురుకాగా టీమ్ ఇండియా ఇప్పుడు స్పిన్ పిచ్‌పై కన్నేసింది. స్పిన్ పిచ్ అండతో సిరీస్ సమం చేయాలనే ఆలోచనలో ఉన్న టీమ్ ఇండియా.. నేడు పుణెలో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గతంలోనూ స్వదేశీ టెస్టు సిరీస్‌లో టీమ్ ఇండియా 0-1తో వెనుకంజ వేసినా.. గతంలో నాలుగు మ్యాచుల టెస్టు సిరీస్‌లో భారత్ పుంజుకుంది. కానీ న్యూజిలాండ్‌తో మూడు మ్యాచుల సిరీస్ కావటంతో టీమ్ ఇండియా కాస్త ఒత్తిడిలో కనిపిస్తుంది. భారత్‌లో అరుదైన టెస్టు సిరీస్ వేటలో న్యూజిలాండ్ ఉండగా.. సొంతగడ్డ అనుకూల పరిస్థితుల్లో సిరీస్‌ను సమం చేయాలని భారత్ ఎదురు చూస్తుంది. పుణెలోని ఎంసీఏ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టులో నేటి నుంచి ఢీకొట్టనున్నాయి.

సమిష్టిగా మెరవాల్సిందే

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆధునిక క్రికెట్‌లో దిగ్గజాలుగా పేరొందినా.. ఈ ఇద్దరు స్టార్ క్రికెటర్లు ఆడిన టెస్టుల్లో టీమ్ ఇండియా స్వల్ప స్కోర్లు నమోదు చేయటం గమనార్హం. బ్యాటింగ్ లైనప్‌లో రోహిత్, విరాట్ కోహ్లి బాధ్యత చాలా తక్కువైంది. యువ ఆటగాళ్లు పరుగుల వేటలో దూసుకెళ్తున్నారు. సీనియర్లుగా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు అంచనాల మేరకు రాణించటం లేదు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ ఖాన్ సహా రిషబ్ పంత్‌లు బ్యాటింగ్ లైనప్‌లో కీలకం. ఇటీవల టీమ్ ఇండియా బ్యాటర్లు సైతం స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొవటం లేదు. కివీస్ శిబిరంలో అజాజ్ పటేల్, మిచెల్ శాంట్నర్‌లు గతంలో భారత్‌ను ఇరకాటంలో పడేశారు. ఇక్కడ ఆసీస్ స్పిన్నర్లు భారత్‌ను ఇబ్బంది పెట్టారు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా బ్యాటర్లు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. లోయర్ మిడిల్ ఆర్డర్‌లో అశ్విన్, జడేజా, కుల్దీప్ బ్యాటింగ్ నైపుణ్యం ఈ టెస్టులో భారతకు ఉపయుక్తంగా ఉండే అవకాశం ఉంది.

స్పిన్ సవాల్‌కు సిద్ధమేనా?

విదేశీ గడ్డపై న్యూజిలాండ్‌కు అరుదుగా స్వదేశీ పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై కివీస్ చారిత్రక విజయం సాధించింది. కానీ పుణె టెస్టులో కివీస్‌కు అసలైన సవాల్ ఎదురు కానుంది. ఉపఖండపు ర్యాంక్ టర్నర్ పిచ్ ఇక్కడ సిద్ధం చేశారు. శ్రీలంకలో స్పిన్ పిచ్‌లపై న్యూజిలాండ్ బ్యాటర్లు తేలిపోయారు. పుణె స్పిన్ పిచ్‌పై అశ్విన్, జడేజా, కుల్దీప్‌లను ఎదుర్కొవటం న్యూజిలాండ్‌కు కఠిన సవాల్ కానుంది. కివీస్ శిబిరంలో రచిన్ రవీంద్ర, టామ్ లేథమ్‌లు స్పిన్‌ను బాగా ఆడగలరు. డెవాన్ కాన్వే, డార్లీ మిచెల్, విల్ యంగ్‌లు స్పిన్‌ను ఏ విధంగా ఆడతారో చూడాలి. మిచెల్ శాంట్నర్, గ్లెన్ ఫిలిప్స్, అజాజ్ పటేల్‌లు స్పిన్ బాధ్యతలు చూసుకోనుండగా.. మాట్ హెన్రీ, టిమ్ సౌథీలు పేస్ విభాగం చూసుకోనున్నారు.



సర్ఫరాజ్‌కే మొగ్గు

టీమ్ ఇండియా తుది జట్టు ఎంపికలో ఆరో బ్యాటర్ కోసం గట్టి పోటీ నెలకొంది. మెడ నొప్పితో తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ నేడు పుణె టెస్టుకు పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూర్‌లో శుభ్‌మన్ గిల్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగాడు. రెండో ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీతో చెలరేగాడు. కెఎల్ రాహుల్ తొలి టెస్టులో విఫలమయ్యాడు. ఇప్పుడు గిల్ నేరుగా తుది జట్టులోకి రానుండగా.. కెఎల్ రాహుల్‌ను పక్కనపెట్టి సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంచుకునే వీలుంది. స్పిన్ విభాగంలో జడేజా, అశ్విన్‌లకు తోడుగా కుల్దీప్ యాదవ్ మాయ చేయనున్నాడు. జశ్‌ప్రీత్ బుమ్రా పేస్ బాధ్యతలు తీసుకోనుండగా.. మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్‌లలో ఒకరు రెండో పేసర్‌గా జట్టులో నిలువనున్నారు.

పిచ్, వాతావరణం

పుణె పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామం కానుంది. చిన్నస్వామి పిచ్ పేసర్లను అనుకూలించటంతో పుణెలో పిచ్‌ను టర్న్‌కు అనుకూలంగా సిద్ధం చేసేందుకు.. భారత్ తహతహలాడింది. పిచ్‌పై లో బౌన్స్, అదిరే టర్న్ ఉండనుంది. మ్యాచ్ సాగుతున్న కొద్ది పిచ్‌పై తిరిగే బంతిని ఎదుర్కొవటం మరింత కష్టతరం అవనుంది. పుణెలో రానున్న ఐదు రోజుల పాటు ఎటువంటి వర్షం సూచనలు లేవు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే వీలుంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్/ఆకాశ్ దీప్.

న్యూజిలాండ్: టామ్ లేథమ్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, డార్లీ మిచెల్, టామ్ బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, టిమ్ సౌథీ, మాట్ హెన్రీ, అజాజ్ పటేల్.

నవచిత్రం

సరికొత్త లవ్‌స్టోరీ



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. సాయి కిషోర్ మచ్చా దర్శకుడు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. నవంబర్ 8వ తేదీన ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.


ఈ నేపథ్యంలో డైరెక్టర్ మారుతి ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో టీజర్ చాలా బాగుందని, మూవీ టీమ్‌కు మారుతి బెస్ట్ విషెస్ తెలిపారు.

హీరో, హీరోయిన్లు చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ లవ్ స్టోరీతో టీజర్ ప్రారంభమైంది. ఈ లవ్‌స్టోరీతో పాటు తండ్రీ కొడుకుల మధ్య ఎమోషనల్ బాండింగ్ ఈ సినిమాలో చూపించబోతున్నట్లు టీజర్‌తో తెలుస్తోంది.

చేతన్ కృష్ణ చేసిన విలేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటోంది. వెన్నెల కిషోర్ పెళ్లి సందడిలో డిజైన్ చేసిన కామెడీ ట్రాక్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. లవ్, ఫ్యామిలీ, ఎమోషన్, యాక్షన్, కామెడీ..ఇలా థియేటర్‌లో ప్రేక్షకుడు చూసి ఎంజాయ్ చేసే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ ఇంప్రెస్ చేస్తోంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

'ఇదొక భిన్న ప్రేమకథా చిత్రం. ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథలతో పోలిస్తే ఇది చాలా వినూత్నంగా ఉంటుంది. ముఖ్యంగా హీరో, హీరోయిన్ల పాత్రలు అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తాయి. ఈ పాత్రలతో ప్రేక్షకులు ట్రావెల్ అవుతారు. ఇక వినోదం పుష్కలంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది' అని దర్శకుడు సాయికిషోర్ మచ్చా అన్నారు.

భావోద్వేగభరితంగా నరుడి బ్రతుకు నటన



నితిన్ ప్రసన్న, శివకుమార్ రామచంద్రవరపు

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర ప్రముఖ తారాగణంతో రాబోతోన్న ఈ చిత్రానికి రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు.

టిజివిశ్వ ప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు రెడ్డి ఈ సినిమాను నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. సుధీర్ కుమార్ ప్రాజెక్ట్ హెడ్‌గా ఉన్నారు.

ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో హీరో శివ కుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ, "సత్యమే శివం', 'శివపుత్రుడు' తరహాలో ఒక మంచి అనుభూతికి, ఎమోషన్‌కు ప్రేక్షకులను గురిచేసే చిత్రమిది. సత్య అనే క్యారెక్టర్‌లో నటించాను. సత్య డబ్బున్న కుటుంబంలో పుట్టిన యువకుడు. తండ్రి పోషణలో సకల సౌకర్యాలతో హాయిగా బతుకుతుంటాడు. తనకు నటుడు కావాలనే కోరిక. అలాంటి సంపన్న కుటుంబంలోని యువకుడు అనుకోకుండా కేరళలోని ఓ తెలియని ప్రాంతానికి వెళ్తే అక్కడ ఎలా జీవనం సాగించాడు. అతనికి తోడుగా ఎవరు నిలిచారు అనేది ఈ సినిమా కథ' అని తెలిపారు.

'నేను అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమా తర్వాత చేస్తున్న చిత్రమిది. ఈ స్క్రిప్ట్ దర్శకుడు రిషికేశ్వర్ చెప్పగానే హార్ట్ టచింగ్‌గా అనిపించింది. ఈ మూవీలో నటించడం మంచి ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది. ఈ సినిమా చూస్తున్న ప్రేక్షకులకు మనుషులు ఇలా ఉంటే మన సమాజం ఎంత బాగుంటుంది అనిపిస్తుంది. అలాగే మన లైఫ్‌లో ఇలాంటి స్నేహితుడు ఉండాలని కోరుకుంటారు. హ్యూమన్ ఎమోషన్స్ గురించి హార్ట్ టచింగ్‌గా ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు రిషికేశ్వర్. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో చాలా అందంగా సినిమాను చిత్రీకరించారు. శివకుమార్‌తో కలిసి నటించడం హ్యాపీగా అనిపించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి గొప్ప సంస్థ మా చిన్న సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్తుండటం సంతోషంగా ఉంది' అని మరో హీరో నితిన్ ప్రసన్న చెప్పారు.

అదే రాజా సాబ్ ప్రత్యేకత



ప్రభాస్

ప్రభాస్ హీరోగా డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హర్రర్ జోనర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొదిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ బాగా పెరిగింది. ఈ సినిమా నుంచి రెబెల్ ఫ్యాన్స్, మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. బుధవారం ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు.

ఈ మోషన్ పోస్టర్‌ను యూనిక్‌గా డిజైన్ చేశారు. ఒక అడవిలో నడిచి వెళ్తున్న వ్యక్తి పెద్ద భవంతికి చేరుకుంటాడు. అక్కడ సింహాసనం లాంటి కుర్చీలో కూర్చున్న రాజా సాబ్‌ను మోషన్ పోస్టర్‌లో పరిచయం చేశారు. చేతిలో సిగార్, సాల్ట్ అండ్ పెప్పర్ హెయిర్ స్టైల్‌తో ప్రభాస్ రాజా సాబ్ క్యారెక్టర్ వింటేజ్ లుక్ అదిరిపోయింది. మోషన్ పోస్టర్‌కు తమన్ చేసిన థీమ్ సాంగ్ ఆకర్షణగా నిలుస్తోంది. హర్రర్ ఈజ్ ది న్యూ హ్యూమర్ అనే క్యాప్షన్ మోషన్ పోస్టర్ చివరలో వేయడం ద్వారా ఒక కొత్త ట్రెండ్ సెట్ చేసే హర్రర్ ప్లస్ కామెడీ ఇందులో ఉండబోతున్నట్లు మేకర్స్ తెలియజేశారు. వరుస సక్సెస్‌లు అందుకుంటున్న టాప్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో, ఎక్కడా రాజీపడకుండా గ్రాండ్‌గా నిర్మిస్తోంది. డైరెక్టర్ మారుతి ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయే మాస్టర్ పీస్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో వచ్చే ఏడాది ఏప్రిల్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది.

నిధి అగర్వాల్, మాళవిక మోహన్, రిధి కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ - కార్తీక్ పళని, మ్యూజిక్ - తమన్, ఫైట్ మాస్టర్ - రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్, వీఎఫ్ఎక్స్ - ఆర్.సి. కమల్ కన్నన్, ప్రొడక్షన్ డిజైనర్ - రాజీవన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ - ఎస్ కేఎన్, కో ప్రొడ్యూసర్ - వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - కృతి ప్రసాద్, ప్రొడ్యూసర్ - టీజీ విశ్వప్రసాద్, రచన, దర్శకత్వం - మారుతి.

దీపావళి కానుకగా రిలీజ్



శివకార్తికేయన్, సాయిపల్లవి

శివకార్తికేయన్ నటిస్తున్న బాహుభాషా బయోగ్రాఫికల్ యాక్షన్ మూవీ 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దీపావళి కానుకగా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హీరో నాని ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

ట్రైలర్ ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ అమరవీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పరిచయం చేస్తుంది. మేజర్ ముకుంద్, అతని కుమార్తె హార్ట్ టచ్చింగ్ ఫుటేజ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది.

మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో శివకార్తికేయన్, అతని భార్యగా సాయి పల్లవి, ఆన్-స్క్రీన్ డాటర్ క్యారెక్టర్స్‌లోకి ట్రైలర్ నేచురల్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అవ్వడం కట్టిపడేసింది. తన దేశానికి సేవ చేయడంలో మేజర్ ముకుంద్ నిబద్ధత గూస్ బంప్స్ తెప్పించింది. ట్రైలర్‌లో ధైర్యం, త్యాగం థీమ్స్‌తో పాటు మేజర్ ముకుంద్ సైనిక జీవితం, ఫ్యామిలీ బాండింగ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు అని చిత్ర బృందం తెలిపింది. హీరో నితిన్ ఫాదర్ సుధాకర్ రెడ్డి, సిస్టర్ నిఖిత రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ ద్వారా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

భిన్న కాన్సెప్ట్‌తో సంతాన ప్రాప్తిరస్తు



విక్రాంత్, చాందిని చౌదరి హీరో,హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. ఈ చిత్రాన్ని మధుర ఎంటర్టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'ఏబీసీడీ', 'అహ నా పెళ్లంట' వెబ్ సిరీస్‌లను తెరకెక్కించిన సంజీవ్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. బుధవారం హీరోయిన్ చాందిని చౌదరి పుట్టిన రోజు సందర్భంగా ఆమె క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో కల్యాణి ఓరుగంటి అనే పాత్రలో చాందినీ చౌదరి నటిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగి తన జీవిత భాగస్వామిగా కావాలని, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ వద్దని ఆమె కోరుకుంటున్నట్లు పోస్టర్ ద్వారా రివీల్ చేశారు. ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న సమస్య సంతానలేమి. ఆ సమస్యను ఈ సినిమాలో వినోదాత్మకంగా చూపించ బోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886